మంగళవారం
04-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 104
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కడదాకా కమ్యూనిస్టే 7లో
అటవీచట్ట రూపకర్త సీకే చంద్రప్పన్
వీరనారి ప్రీతిలత

పండగనాడూ పడిగాపులే!

- చాలామందికి జమకాని వేతనాలు
- జగన్ సర్కారు నిర్లక్ష్యం
- ప్రతినెలా కుంటి సాకులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
పండగనాడూ ఉద్యోగులు, పెన్షనర్లు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. చాలామందికి సోమవారం సాయంత్రం వరకు వారి ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. ప్రతి పండగకూ ఉద్యోగులకు ఇదే సమస్య ఎదురవుతోంది. ఒకటో తేదీకి వేతనాలు ఇవ్వడం గగనంగా మారుతోంది. ఉపాధ్యాయులందరికీ వేతనాలు పడలేదని తెలిసింది. దాదాపు రెండు లక్షల మంది ఉద్యోగులకు పండగకు రెండు రోజుల ముందు కూడా వేతనాలు వేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ సందర్భంగా పిల్లలతో కలిసి సొంత గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదు. చాలామంది వారి పర్యటనలను రద్దు చేసుకున్నారు. కనీసం వారి వేతనాలను సైతం సకాలంలో ఇవ్వకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఇదే విషయంపై ఆర్థికశాఖ ఉన్నతాధికారుతో ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీరావు ఫోన్లో మాట్లాడితే, మంగళవారంలోగా అందరికీ వేస్తామంటూ జవాబిచ్చారు. ఇది ఎంతవరకు సాధ్యమవుతుందనేదీ ప్రశ్నార్థకం. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికులకు చెల్లిస్తున్న విధానం పద్ధతిగా లేదు. ప్రతినెలా జీతాల కోసం, పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దుర్మార్గంగా మారింది. ఇంత దారుణమైన పరిస్థితులు గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ కనిపించలేదు. జగన్ సర్కారు ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. ప్రతినెలా ఏదో ఒక సాకు చూపి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. తరచూ కేంద్రం నుంచి అప్పులు తెస్తున్న ప్రభుత్వం, ఉద్యోగుల వేతనాలను సక్రమంగా

- మిగతా 2 లో

అప్పులే అప్పులు

మరో రూ.2వేల కోట్ల సమీకరణ

- ఆర్‌బీఐ బాండ్ల వేలం
- నిత్యాన్వేషణలో రాష్ట్ర ప్రభుత్వం
- రూ.53,100 కోట్లకు చేరిన రుణం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వం అప్పుల వేట కొనసాగిస్తోంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితులు, అధిక వడ్డీలను సైతం లెక్క చేయడం లేదు. దొరికితే చాలన్న విధంగా ప్రభుత్వం నిత్యం అప్పుల కోసం అన్వేషణ చేస్తోంది. గత నెలలో జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని ముఖ్యమంత్రి జగన్ ప్రకటన చేయగా, ప్రతివారం ఏపీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకు బాండ్ల వేలంలో పాల్గొనడం గమనార్హం. గతవారం ఇదే పద్ధతిలో బాండ్ల వేలంలో పాల్గొని వెయ్యి కోట్ల రూపాయలు సమీకరించిన రాష్ట్ర ప్రభుత్వం... సోమవారం సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా మరో రెండు వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చింది. రిజర్వ్ బ్యాంక్ బాండ్ల వేలానికి మంగళవారం సెలవు కావడంతో సోమవారమే వేలం జరిగింది. దీంతో వెయ్యి కోట్ల రూపాయలు 13 సంవత్సరాలకు 7.82 శాతం వడ్డీతో, మరో వెయ్యి కోట్ల రూపాయలు 20 సంవత్సరాలకు 7.74 శాతం వడ్డీతో బాండ్ల ద్వారా రుణం తీసుకుంది. వీటితో ఈ ఆరు నెలల్లో ఏపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.53,100 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్ అంచనాలు, వాస్తవిక ఆదాయం, వ్యయాల లెక్కలపై ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఇటీవల కాగ్ విడుదల చేసిన లెక్కల ప్రకారం రాష్ట్ర రెవెన్యూ లోటు 217.09 శాతానికి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ.17,036 కోట్లుగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొనగా, తొలి ఐదు నెలల్లోనే రెట్టింపై రూ.36,983.28 కోట్లకు చేరుకుంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన దానికంటే ఇది 217.09 అదనం కాగా, ఇక ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి రెవెన్యూ లోటు భారీస్థాయిలో పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ద్రవ్యలోటు కూడా దాదాపు బడ్జెట్ అంచనాలకు చేరువవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.48,724.11 కోట్ల ద్రవ్యలోటును ఎదుర్కొంటామని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించగా, తొలి 5 నెలల్లోనే రూ.44,582.58 కోట్లుగా నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తోందని కాగ్ ఆక్షేపించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం కలిపి రూ.48,724.12 కోట్ల అప్పులు చేస్తామని ప్రతిపాదించిన ప్రభుత్వం... తొలి 5 నెలల్లోనే రూ.44,582.58 కోట్ల అప్పులు చేసి, బడ్జెట్‌లో ప్రతిపాదించిన దానిలో 91.5శాతం అప్పులు చేసినట్లు కాగ్ వెల్లడించింది. ఈ అప్పు అంచనాలకు మించి రూ.53వేల కోట్లకు చేరింది.

విశ్వాస పరీక్షలో నెగ్గిన పంజాబ్ ప్రభుత్వం

పంజాబ్‌లో భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం విశ్వాసపరీక్షలో నెగ్గింది. రాష్ట్రంలో అధికారంలోకి రావడంలో విఫలమైన బీజేపీ ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ఇటీవల ప్రయత్నించి విఫలమైంది.

5 లో

వాడవాడలా అదే ఆదరణ

తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల నుంచి 22వ రోజు యాత్ర

6లో

పండగ వేళ పప్పు, పంచదార ఇవ్వండి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
దసరా, దీపావళి పండగల సందర్భంగా కార్డుదారులకు కందిపప్పు, పంచదార అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆర్నెళ్లుగా రేషన్ కార్డుదారులకు కందిపప్పు, పంచదార సరఫరా సక్రమంగా లేదనీ, వినాయక చవితి పండగకు సైతం రాయితీపై కందిపప్పు, పంచదార ఇవ్వలేదని రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు సీఎం జగన్‌కు రామకృష్ణ సోమవారం లేఖ రాశారు. దసరా, దీపావళి పండగల సందర్భంగానైనా రేషన్ కార్డుదారులకు కందిపప్పు, పంచదార ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రతి నెలా కిలో కందిపప్పు, అరకిలో పంచదార ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల కార్డుదారులకు 14 వేల టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇంటింటికీ రేషన్ అంటున్న రాష్ట్ర ప్రభుత్వం వాహనాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే ఇస్తోందని, గత ప్రభుత్వం కార్డుదారులకు చౌకడిపోల ద్వారా నిత్యావసర వస్తువులను రాయితీపై అందించిందని గుర్తుచేశారు. పంచదార కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల పాత బకాయిలను జగన్ ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. ఫలితంగా ప్రస్తుతం పంచదార సరఫరా చేసినా బిల్లులు వస్తాయో?, రావోనన్న భయంతో కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయడం లేదని వివరించారు. పౌరసరఫరాల సంస్థకు కందిపప్పు సరఫరా చేస్తున్న నాఫెడ్ కూడా అయోమయస్థితిలో ఉందని, మూడు

- మిగతా 2 లో

యాత్రా కాలం!

- అధికారం కోసం పార్టీల పాదయాత్రలు
- కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర
- ఒడిశాలో బీజేడీ జన సంపర్క యాత్ర
- బీహార్‌లో పీకే పాదయాత్ర

న్యూదిల్లీ:
త్వరలో సార్వత్రిక ఎన్నికలు, వీటికి ముందు కొన్ని రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ రాజకీయ పార్టీలు తమదైన శైలిలో ప్రచారానికి శ్రీకారం చుడుతున్నాయి. ప్రత్యేకించి పాదయాత్రలు, బస్సు యాత్రలు సహా వివిధ రూపాల్లో యాత్రకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర కొనసాగిస్తున్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు ఆయన యాత్ర కొనసాగుతోంది. రాజకీయ పార్టీలు తమ బలాన్ని పెంచుకోవడానికి, ప్రజల మద్దతు కూడగట్టడానికి ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నాయి. సామాజిక మాధ్యమంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. పాదయాత్రల ద్వారా ప్రజలతో మమేకం కావడానికి పాత పద్ధతే అయినా ఎంతోమందికి అధికారం కట్టబెట్టిన పాదయాత్రలపై ఎక్కువ పార్టీలు మక్కువ చూపుతున్నాయి. రాహుల్‌గాంధీ సహా ఆయన పార్టీ నాయకులు కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు 3,570 కిలోమీటర్ల పాదయాత్రను చేపట్టారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతా దళ్(బీజేడీ) జన సంపర్క పాదయాత్రను, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) బీహార్‌లోని పశ్చిమ చంపారన్ నుంచి 3,500 కిలోమీటర్ల పాదయాత్రను ఆదివారం ప్రారంభించారు. నవీన్ పట్నాయక్ గాంధీ జయంతి సందర్భంగా భువనేశ్వర్‌లోని లింగరాజ్ ఆలయం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఒడిశా అభివృద్ధిని ప్రజలందరికీ వివరించాలని బీజేడీ నాయకులు, కార్యకర్తలకు నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. రాజకీయాల్లో తిరిగి ప్రవేశానికి ఒక అవకాశంగా ప్రశాంత్ కిశోర్ పాదయాత్రను ఎంపిక చేసుకున్నారు. యాత్ర సందర్భంగా బీహార్‌లోని ప్రతి పంచాయతీ, బ్లాక్‌లోని తన మద్దతుదారులకు చేరువ కావడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. పీకే పాదయాత్ర 12 నుంచి 15 నెలలపాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. మహాత్మాగాంధీ 1917లో తన మొదటి సత్యాగ్రహ యాత్ర ప్రారంభించిన భితిహర్వా గాంధీ ఆశ్రమం నుంచి పీకే పాదయాత్ర చేపట్టారు. ఆదివారం నాటికి 25వ రోజుకు చేరిన కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర తమిళనాడు, కేరళ మీదుగా కర్ణాటక చేరింది. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇంత భారీ పాదయాత్ర చేపట్టడం ఇదే మొదటిసారి. ఇది భారతదేశ రాజకీయ చరిత్రలో గొప్ప మలుపు కాగలదని భావిస్తున్నారు. తన పాదయాత్ర భారతదేశ రాజకీయాల్లో గొప్ప పరివర్తన ఉద్యమమని, పార్టీ పునరుజ్జీవనానికి నిర్ణయాత్మక చర్య అని కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. రాజకీయాల్లో

- మిగతా 2 లో

వైద్యశాస్త్రంలో స్వాంటె పాబోకు నోబెల్

స్టాక్‌హోం:
ఈ ఏడాది నోబెల్ బహుమతి సైకాలజీ / మెడిసన్ విభాగంలో స్వీడన్ శాస్త్రవేత స్వాంటె పాబోను వరించింది. మానవ పరిణామక్రమంతో పాటు అంతరించిపోయిన హోమినిన్ జన్యువులకు సంబంధించి ఆవిష్కరణలకు గాను పాబోకు ఈ బహుమతి దక్కింది. స్వీడన్‌లోని స్టాక్ హోంలో ఉన్న కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బృందం దీనిని ప్రకటించింది. గతేడాది ఉష్ణ గ్రాహకాలు, శరీర స్పర్శపై చేసిన పరిశోధనలకు అమెరికాకు చెందిన డేవిడ్ జూలియస్, అర్డెమ్ పటాపౌటియన్‌లు సంయుక్తంగా నోబెల్ బహుమతి అందుకున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన వారంపాటు కొనసాగనుంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యం విభాగాల్లో విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం 2022 నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 10న అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కార గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. నోబెల్ బహుమతి గ్రహీతలకు 10లక్షల స్వీడిష్ క్రోనర్ (సుమారు 9లక్షల డాలర్లు) నగదు అందుతుంది. వీటిని ఈ ఏడాది డిసెంబర్ 10న అవార్డు గ్రహీతలకు అందజేస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్తగా పేరుగాంచిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా, 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు.

ఇదీ లోకం!

దసపల్లా భూములు సార్!
వేలకోట్లవిలువ,మాంచి టేస్ట్!

3న మునుగోడు ఉపఎన్నిక

- దేశవ్యాప్తంగా ఆరు స్థానాల్లో...
- ఈ నెల 7న నోటిఫికేషన్
- నవంబరు 6న ఓట్ల లెక్కింపు

న్యూదిల్లీ:
ఐదు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు, తెలంగాణలో ఒక స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం షెడ్యూలు విడుదల చేసింది. తెలంగాణలోని మునుగోడుతో పాటు బీహార్‌లో మోకమా, గోపాల్‌గంజ్, మహారాష్ట్రలోని అంధేరి తూర్పు, హరియాణాలోని ఆదంపూర్, ఉత్తరప్రదేశ్‌లోని గోల గోఖర్నాథ్, ఒడిశాలోని ధామ్‌నగర్ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించి, 6న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్టు ఈసీ

- మిగతా 2 లో

దళితులపై ఆగని దాష్టీకం!

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికం
- మూడేళ్లలో 11 శాతం పెరిగిన దాడులు
- మోదీ పాలనలో పెచ్చరిల్లుతున్న విషధోరణి

న్యూదిల్లీ:
స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా దేశంలో దళితులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రతి ఏడాది వేధింపులు, ఛీత్కారాలు అధికం కావడమే ఇందుకు నిదర్శనం. మూడేళ్లలోనే దళితులపై దాడులు 11 శాతం అధికమయ్యాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్బీ) ప్రకారం... 2019లో 45,961, 2021లో 50,900 కేసులు నమోదయ్యాయి. దళితులపై జరుగుతున్న దాడుల్లో జాతీయ సగటు కంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికంగా ఉంది. రాజస్థాన్ (11శాతం), యూపీ(11), కర్నాటక (11), మహారాష్ట్ర (16), తమిళనాడు (20), పంజాబ్ (20), ఒడిశా (23), హిమాచల్‌ప్రదేశ్ (29), గోవా (33),

- మిగతా 2 లో

నాలుగు రోజులు వర్షాలు

- ఉత్తరాంధ్ర-ఒడిశా తీరాల్లో ఉపరితల ఆవర్తనం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- వాతావరణశాఖ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌కు తుపాన్ ముప్పు మళ్లీ పొంచి ఉంది. కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరుస వాయుగుండాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుండడంతో

- మిగతా 2 లో

వాతావరణ న్యాయం కోసం యువత భారీ ర్యాలీ

కేప్‌టౌన్: కాప్ 27 ఐరాస వాతావరణ చర్చల నేపథ్యంలో ప్రపంచంలో సంక్షోభాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌లో యువత పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈజిప్టులో ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సు జరగనున్న నేపథ్యంలో వాతావరణ విధ్వంసం వల్ల ఎక్కువగా ప్రభావితమైన దేశాలకు చెందిన యువత తాము బాధితులు కాకూడదని హెచ్చరించారు. ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల్లో సంక్షోభానికి అతి తక్కువ బాధ్యత వహించే దేశాల నుండి వందలాది మంది కార్యకర్తలు ట్యునీషియాలో సమావేశమయ్యారు. తమ దేశాలకు న్యాయం కోసం నినదించారు. వాతావరణంలో అత్యంత వేడిమికి బాధ్యత వహించే దేశాల నుండి అవసరమైన నిధులు, నష్టానికి పరిహారం వంటి సమస్యలపై డిమాండ్ చేశారు. గ్లాస్గోలోని కాప్ 26 వద్ద, వాతావరణ అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా అత్యంత ప్రభావితమైన దేశాలకు సహాయం చేయడానికి మొత్తం 350 మిలియన్ డాలర్లు ఇస్తానని ప్రతినిధులు హామీ ఇచ్చారు. మెక్సికోకు చెందిన 20 ఏళ్ల మరియా రేయిస్, ట్యూనిస్ వాతావరణ శిబిరానికి హాజరయ్యారు. గ్లాస్గో అంతర్జా తీయ రాజకీయాలపై నాకు పూర్తి విశ్వాసాన్ని కోల్పో యేలా చేసిందన్నారు. 2019 నుండి వాతావరణం కోసం అనేక సమ్మెలను నిర్వహించిన పాకిస్తాన్‌కు చెందిన ఆయిషా సిద్దికా(23) మాట్లాడుతూ వాతావరణ సంక్షోభంతో పోరాడేందుకు మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియా ప్రజల అన్యాయాలు పరిష్కరించాలని పేర్కొన్నారు. హిమానీనదాలు కరిగిపోవడం, వరదలు మొత్తం గ్రామాలను తుడిచిపెట్టడంతో జీవన విధానం తీవ్ర ప్రమాదంలో కూరుకుపోయిందని వాపోయారు. ట్యునీషియాలోని క్లైమేట్ క్యాంప్ నిర్వాహకులలో ఒకరైన గ్రీన్‌పీస్, కాప్27ని ప్రధాన అంతర్జాతీయ కాలుష్య కారకమైన కోకా-కోలా కంపెనీ స్పాన్సర్ చేయబోతున్నట్లు వెల్లడించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామ్రాజ్యవాద యుద్ధంలో గ్రీస్‌జోక్యం తగదు

ఏథెన్స్: ఉక్రెయిన్ సామ్రాజ్యవాద యుద్ధంలో గ్రీస్ జోక్యం తగదు అని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) ప్రధాన కార్యదర్శి డిమిత్రిస్ కౌట్సొంబస్ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద దేశాల జోక్యంతో ప్రపంచ పరిణామాలు అత్యంత కీలకంగా మారాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ యుద్ధం కేవలం ఉక్రెయిన్- రష్యా ప్రజలకు మాత్రమే కాకుండా, మొత్తం ప్రపంచ ప్రజలపై పెను ప్రమాదం మోపిందన్నారు. ఒకవైపు రష్యన్ ఫెడరేషన్ స్వాధీనం చేసుకున్న భూభాగాలను స్వాధీనం చేసుకునే ప్రణాళికలు, మరోవైపు భారీ ఆయుధాలు చేరవేతలు, తిరోగమన జెలెన్స్కీ వ్యవహారశైలి, ప్రభుత్వానికి యుఎస్-నాటో మద్దతు ప్రపంచ సంక్షోభానికి దారితీసిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులలో, గ్రీస్ యుద్ధం నుండి వైదొలగడం తక్షణ అవసరంగా కౌట్సొంబస్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు సైనిక సామగ్రిని పంపడం, గ్రీస్ భూభాగాన్ని, మౌలిక సదుపాయాలను యుద్ధ స్థావరంగా ఉపయోగించడం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జీవన వ్యయ సంక్షోభంపై లండన్‌లో నిరసనలు

లండన్: జీవన వ్యయ సంక్షోభంపై లండన్ ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు పాల్పడ్డారు. దేశంలోని వివిధ నగరాల్లో వేలాది మంది ప్రజలు జీవన వ్యయం పెరుగుదలకు వ్యతిరేకంగా, వాతావరణ పరిరక్షణ, వేతనాల పెంపుకోసం డిమాండ్ చేశారు. లండన్, ఎడిన్‌బర్గ్, స్వాన్సీ, లివర్‌పూల్‌తో సహా నగరాల్లో నిరసనకారులు 'ఇనఫ్ ఈజ్ ఇనఫ్' అనే ప్రచారం ద్వారా సమన్వయంతో మార్చ్ చేపట్టారు. పెరుగుతున్న ధరలను ఎదుర్కోవటానికి, వేతనాల పెంపుదల, ఇంధన బిల్లులపై రాయితీలకు డిమాండ్ చేశారు. లండన్ ర్యాలీలో సుమారు 10,000 మంది పాల్గొన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్, మారిటైమ్, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ సమన్వయంతో సమ్మె ప్రారంభమైంది. అక్టోబర్ 1, 8 తేదీల్లో జరగనున్న జాతీయ వాక్-అవుట్‌లతో దేశవ్యాప్తంగా 40,000 మంది సభ్యులు ఆయా వెబ్‌సైట్‌లలో పిలుపునిచ్చారు. యూనియన్‌లు, రైలు నెట్‌వర్క్ మధ్య చర్చలలో పురోగతి లేకపోవడంతో సమ్మెలు జరుగుతున్నాయి, పెరుగుతున్న జీవనవ్యయాలు, సామూహిక తొలగింపుల ముప్పుపై ఉద్యోగుల ఆందోళనలను పరిష్కారానికి పిలుపునిచ్చారు.

కాబూల్ ఆత్మాహుతి దాడిలో 53 మంది మృతి

కాబూల్ : అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని షాహిద్ మజారీ రోడ్‌లోని పుల్-ఎ-సుఖ్తా ప్రాంతానికి సమీపంలో ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో 53 మంది వరకు మృతిచెందారు. ఓ పాఠశాల తరగతి గదికి సమీపంలో పేలుడు జరిగింది. మృతి చెందినవారిలో 46 మంది బాలికలు, మహిళలు ఉన్నారు. కాబూల్‌లోని పీడీ-6 ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ పేలుడు సంభవించింది. సెప్టెంబర్ 30న శుక్రవారం కాబూల్‌లోని యూనివర్సిటీ వద్ద జరిగిన ఆత్మాహుతి బాంబుదాడిలో కనీసం వంద మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు.

షియా ప్రాంతంలోని విద్యాసంస్థపై ఆత్మాహుతి దాడి జరిగింది. మైనారిటీ షియా కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు ఎక్కువగా నివసించే కాబూల్‌లోని దష్టి బార్చి పరిసరాల్లోని సెంటర్ లోపల ఉదయం సమయంలో పేలుడు చోటుచేసుకుంది.

తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ భారీ జరిమానా

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) భారీ జరిమానా విధించింది. వ్యర్థాల నిర్వహణలో మార్గదర్శకాలు, తీర్పులు అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రూ.3,800 కోట్ల జరిమానా వేసింది. రెండు నెలల్లో ఈ మొత్తాన్ని ప్రత్యేక ఖాతాలో డిపాజిట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వ్యర్థాల నిర్వహణకు చర్యలు చేపట్టి.. పురోగతి చెప్పాలని ఆదేశించింది. 1996లో మున్సిపాలిటీల్లో పారిశుధ్య, వ్యర్థాల నిర్వహణ సరిగా లేదని పేర్కొంటూ పర్యావరణ సురక్షా అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను 2014లో సుప్రీం కోర్టు ఎన్జీటీకి బదిలీ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 351 నదీ పరివాహక ప్రాంతాలు, 124 నగరాల్లో గాలి కాలుష్యంపైనా పిటిషన్‌లో పేర్కొంది. 100 కాలుష్య కారక పారిశ్రామిక ప్రాంతాలపై, ఇసుక అక్రమ మైనింగ్ పైనా చర్యలు తీసుకోవాలని పర్యావరణ సురక్షా స్వచ్ఛంద సంస్థ కోరింది. ఈ రెండు విషయాలను ఎన్జీటీ ప్రస్తుతం విచారణకు స్వీకరించింది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల నుంచి వివరణ కోరింది. కాగా, పిటిషన్‌పై తెలంగాణ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను కూడా ధర్మాసనం విచారించింది. కానీ, ఆయన వివరణకు సంతృప్తి చెందని ఎన్జీటీ అందుకు అనుగుణంగా జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

3న మునుగోడు ఉపఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ అక్టోబర్ 7న విడుదల చేయనుండగా, నామినేషన్ల స్వీకరణకు గడువు అక్టోబర్ 14, పరిశీలన అక్టోబర్ 15, ఉపసంహరణ గడువు అక్టోబర్ 17. అంథేరి తూర్పు, గోల గోఖర్నాథ్, గోపాల్‌గంజ్, ధామ్‌నగర్ స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే మృతి చెందడంతో ఉప ఎన్నిక రాగా, ఓ కేసులో ప్రమేయం ఉండటంతో మోకమా ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించారు. ఆదంపూర్ స్థానానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే బిష్ణోయ్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక తప్పలేదు.

పండగ వేళ పప్పు, పంచదార ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నెలులుగా టెండర్లు పిలుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు స్పందించడం లేదని పేర్కొన్నారు. పౌరసరఫరాల సంస్థ గిడ్డంగుల్లో పంచదార, కందిపప్పు నిల్వలు ఇప్పటికే లేవనీ, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటున్నాయని తెలిపారు. కిలో కందిపప్పు రూ.120లకు పైగా ఉండగా, పంచదార కిలో రూ.40కి పైగా ధర పలుకుతోందని వివరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు రాయితీ సరుకులు సరఫరా చేయలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దంపడుతోందని రామకృష్ణ విమర్శించారు. ప్రచార ఆర్భాటానికి జగన్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని, కానీ నిరుపేదల ఆకలి తీర్చడానికి మాత్రం మల్లగుల్లాలు పడడం విచారకరమని, ప్రజా పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మారుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పంచదార కాంట్రాక్టర్లకు బకాయిలను వెంటనే చెల్లించాలని, దసరా, దీపావళి పండుగల వేళ కార్డుదారులకు పంచదార, కందిపప్పు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాలుగు రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా సముద్ర, నదీ తీర ప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు. ఒడిశా తీరానికి దగ్గరలో వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడుతుం దని వాతావరణశాఖ అంచనా వేసింది. ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశగా వంపు తిరిగి ఉందని, దీని ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఏపీలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, తీరం వెంబడి 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖ, అనకాపల్లితో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశమున్నందున, రానున్న రెండు రోజులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ అధికారులు సూచించారు.

'నా భర్త జీతం ఎంతో చెప్పండి'

న్యూఢిల్లీ: ప్రభుత్వం నుంచి సమాచారం పొందేందుకు ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకుంటాం. కొన్ని పరిమితులతో ఎలాంటి సమాచారాన్నైనా తెలుసుకునే హక్కును ఈ చట్టం కల్పిస్తోంది. ఇప్పుడు ఈ ఆయుధాన్ని ఓ మహిళ తన భర్తపై ప్రయోగించింది. ఇంతకీ విషయం ఏంటంటే..? సంజూ గుప్తా అనే మహిళ తన భర్త జీతం వివరాలు కోరుతూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకుంది. భర్త అంగీకారం లేదని ఆదాయ పన్ను శాఖలోని సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(సీపీఐఓ) ఆ వివరాలు ఇచ్చేందుకు నిరాకరించారు. దాంతో ఆమె ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ (ఎఫ్ఏఏ)ని ఆశ్రయించింది. అక్కడ అప్పీల్ చేసుకుంది. ఎఫ్ఏఏ కూడా సీపీఐఓనే సమర్థించింది. ఆ వివరాలు ఇచ్చేలా చూడాలంటూ ఈసారి ఆమె.. సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్(సీఐసీ)కు దరఖాస్తు చేసుకుంది. వివిధ సందర్భాల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న సీఐసీ ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. 15 రోజుల్లోగా ఆమె భర్తకు సంబంధించిన జీతం వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

వైద్యరంగంలో గొప్ప విజయం: హరీశ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం కొత్తగా ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1200 మందికి కొత్తగా అడ్మిషన్లు వచ్చాయని, ఇది గొప్ప విజయమనీ, 1200 సీట్లు ఒక విద్యా సంవత్సరంలో రావడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో గాంధీ ఆస్పత్రికి వెళ్లి 2004 నుంచి 2014 వరకు మెడికల్ కాలేజీల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడానని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ వస్తేనే మెడికల్ కాలేజీలు వస్తాయని, న్యాయం జరుగుతుందని చెప్పానన్నారు. సమైక్య రాష్ట్రంలో మూడే మూడు మెడికల్ కాలేజీలు వచ్చాయనీ, అవే ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ అన్నారు. 70ఏళ్ల సమైక్య పాలనలో మూడు కాలేజీలు వస్తే, ఏడేళ్లలో 17 కాలేజీలు తెచ్చుకున్నామనీ, కొత్తగా 12 కాలేజీలను ఈ ఏడేళ్లలో తెచ్చుకోగలిగామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో ఎనిమిది మెడికల్ కాలేజీలు పెట్టుకుంటున్నామన్నారు. ఒక్క మెడికల్ కాలేజీకి రూ.510 కోట్ల చొప్పున సీఎం కేసీఆర్ మంజూరు చేశారనీ, మొత్తం రూ. 4,080 కోట్లు మంజూరు చేసినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రజల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎనిమిది మెడికల్ కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతి వచ్చేందుకు కృషి చేసిన డీఎంఈకి, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు, విమలా థామస్, డాక్టర్ వాణికి మంత్రి అభినందనలు తెలిపారు. రిజ్వీ కృషిని కూడా అభినందిస్తున్నానని చెప్పారు.

3.3 రెట్లు పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రం ఏర్పడినపుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 850 ఉంటే, ఈ విద్యా సంవత్సరంలో 2,901కు సీట్లను పెంచుకున్నామని హరీశ్‌రావు వెల్లడించారు. ఎంబీబీఎస్ సీట్లు 3.3 రెట్లు పెరిగాయన్నారు. ఇది చరిత్రాత్మక విజయం అని మంత్రి పేర్కొన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులు ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లి వైద్య విద్య అభ్యసించవలసిన అవసరం లేదన్నారు. ఇలాంటి పరిస్థితికి కారణం సమైక్య పాలనలో తెలంగాణపై చూపిన వివక్షే అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ- ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో 6,540 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయనీ, 2014లో ప్రభుత్వ-ప్రయివేటు రంగంలో ఎంబీబీఎస్ సీట్లు కేవలం 2,600 ఉన్నాయని గుర్తు చేశారు. ఇవి కాక ఆయుష్, ఆయుర్వేద, యూనాని వంటి విభాగాల్లోనూ సీట్లు ఉన్నాయని తెలిపారు.

బీ కేటగిరి సీట్లలో 85 శాతం లోకల్ రిజర్వేషన్లు

బీ కేటగిరి సీట్లలోనూ 85 శాతం లోకల్ రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకున్నామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీని వల్ల తెలంగాణ వైద్య విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ నిర్ణయ వల్ల 1,067 సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయని పేర్కొన్నారు.

రద్దీ మార్కెట్‌లో పేలిన హీలియం ట్యాంక్

తిరుచ్చి: తమిళనాడులోని తిరుచ్చిలో ఆదివారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. కొట్టై వసల్ ప్రాంతంలోని రద్దీ మార్కెట్‌లో హీలియం ట్యాంక్ పేలిపోవడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. అనేకమంది గాయపడ్డారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. దుకాణాల అద్దాలు పగిలిపోయాయి. జనం భయంతో పరుగులు తీయగా, దుకాణాల్లోని జనం కూడా బెంబేలెత్తారు. మంటలతో పాటు చుట్టుపక్కల పొగలు కమ్ముకున్నాయి. ఈ ఘటన మొత్తం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో రికార్డు అయింది. హీలియం ట్యాంక్ పేలుడులో మృతిచెందిన వ్యక్తిని మట్టు రవిగా గుర్తించారు. సీసీటీవీ దృశ్యాలు ఆధారంగా ఘటన ఎలా జరిగిందనేది పోలీసులు విశ్లేషిస్తున్నారు. బెలూన్ అమ్మకాలు జరుపుతున్న వ్యక్తి వద్దనున్న హీలియం ట్యాంక్ పేలి ఈ ఘటన జరిగినట్టు పోలీసులు గుర్తించారు. బెలూన్ అమ్మకందారు కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు తిరుచ్చి పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీకే శివకుమార్‌కు మరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక కార్యకలాపాలపై కొనసాగుతున్న మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఈ సమన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 7న దిల్లీలో ఫెడరల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఈడీ ఆదేశించింది. అక్రమ అస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సెప్టెంబర్ 19న ఈడీ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్ర గత వారం కర్ణాటకలో అడుగుపెట్టిన సమయంలో తాజాసమన్లు జారీ చేయడం గమనార్హం.

పండగనాడూ...పడిగాపులే!

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది.

కక్ష సాధింపు చర్యలు

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు నిర్వహించిన చలో విజయవాడ సభ విజయవంతం అనంతరం నుంచి జగన్ ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చిందనే విమర్శలున్నాయి. అప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇటీవల సీపీఎస్ రద్దు కోసం పిలుపునిచ్చిన సీపీఎస్ ఉద్యోగ సంఘాల నేతలు, ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టారు. వారిని రెండు, మూడు రోజులపాటు పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పించుకున్నారు. వారికి మద్దతిచ్చిన వారిపైనా కేసులు నమోదు చేసి నానా ఇబ్బందులకు గురిచేశారు ఈ పరిణామాలతో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నొక్కిచెబుతున్నాయి.

కరువు భత్యంపైనా నిర్లక్ష్యం: ఎస్టీయూ

ఉపాధ్యాయులకు కరువు భత్యంపైనా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విమర్శించారు. బకాయి ఉన్నటువంటి కరువు భత్యం 2022 జనవరి, 2022 జులైకు సంబంధించి కూడా పెండింగ్ ఉందని తక్షణం 6.37 కరువు పద్యాన్ని విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దసరా పండగను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల్లో ఆందోళన: ఏపీ జేఏసీ అమరావతి

రెండు రోజుల్లో దసరా పండుగ నైపథ్యంలో ఉద్యోగుల సెప్టెంబర్ వేతనం, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు ఇంకనూ కొంతమందికి జమ కాలేదని ఆందోళన చెందుతున్నారని ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు వెంకటేశ్వరరావు, వైపీ రావు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి చాలా మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తమకు ఫోన్ల ద్వారాను, వాట్సాప్ ద్వారాను వారి ఆందోళన వెలిబుచ్చుతున్నారని పేర్కొన్నారు. దీనిపై తాము ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో సంప్రదించగా, మంగళవారం లోగా అందరి జీతాలు, పెన్షన్లు వారి వారి ఖాతాలకు జమవుతాయని తెలిపారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

విశాలాంధ్ర-హైదరాబాద్: సద్దుల బతుకమ్మ వేడుకలు ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. గౌరీ పూజలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. బతుకమ్మలు, కళాకారుల ప్రదర్శనలతో ట్యాంక్‌బండ్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో మహిళలు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో తొమ్మిదో రోజు, చివరి రోజు అయిన ఆశ్వయుజ శుద్ధ అష్టమి) నాడు 'సద్దుల బతుకమ్మ' లేదా 'పెద్ద బతుకమ్మ'గా గౌరమ్మను ఆరాధిస్తారు... పెద్ద పళ్లెంలో గుమ్మడి ఆకులు, రంగులు అద్దిన గునుగు పూలు, తంగేడు, ఇతర రంగురంగుల పూలతో బతుకమ్మను పేరుస్తారు. సద్దులను నైవేద్యం పెట్టి, పూజలు చేస్తారు. అనంతరం రాత్రి వరకూ ఆటపాటలతో అమ్మవారిని కొలిచి, బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

అవసరమైతే 'నేతాజీ'కి కిడ్నీ ఇస్తా: ఎస్పీ నేత

లక్నో: తీవ్ర అనారోగ్యంతో గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ కోసం ఆ పార్టీ శ్రేణులు ఉత్తర్‌ప్రదేశ్ వ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాయి. క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో చికిత్స పొందుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు, కార్యకర్తలు ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా లక్నోలోని విక్రమాదిత్య మార్గ్‌లోని ములాయం నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న హనుమాన్ ఆలయంలో పార్టీ కార్యకర్తలు పూజలు చేశారు. అలాగే, వారణాసిలోని గిలాత్ బజార్‌లోని హనుమాన్ ఆలయం, లొహతియాలోని బడా గణేశ్ మందిరంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధికారప్రతినిధి మనోజ్ రాయ్ మాట్లాడుతూ.. తామంతా ముద్దుగా పిలుచుకొనే 'నేతాజీ' ఆశీర్వాదం పార్టీలోని ప్రతిఒక్కరికీ అవసరమని.. వారణాసిలోని అనేక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అజయ్ యాదవ్, ములాయం కోసం అవసరమైతే తన కిడ్నీ ఇచ్చేందుకు కూడా సిద్ధమేనని ప్రకటించారు. అటు, షహాన్‌పూర్‌లోనూ ములాయం సింగ్ త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థనలు చేశారు. పార్టీ నగర మాజీ అధ్యక్షుడు ఫైసల్ అస్మానీ సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

దళితులపై ఆగని దాష్టీకం!

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ (36), ఉత్తరాఖండ్ (46), హర్యానా (50 శాతం) దళితులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి.

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలో మూడో తరగతి చదువుతున్న దళిత బాలుడు... నీటి కుండను తాకినందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని తీవ్రంగా కొట్టడం, ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం విదితమే. యూపీలోని ఔరియా జిల్లాలో 15 ఏళ్ల బాలుడు పరీక్షలో తప్పు చేసినందుకు ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టడంతో అతడు కూడా ప్రాణాలను కోల్పోయాడు. లఖింపూర్ ఖేరీలో ఒక గ్రామానికి చెందిన ఇద్దరు దళిత సోదరీమణులు లైంగికదాడికి, హత్యకు గురయ్యారు. వారి మృతదేహాలు చెట్టుకు వేలాడదీయబడ్డాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఇలాంటి ఘటనలు దేశంలో దళితులు అనుభవిస్తున్న హింస, అణచివేతలో ఒక భాగం మాత్రమే.

1991 నుంచి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అధికారికంగా ఏడు లక్షలకు పైగా దారుణాలు నమోదయ్యాయి. అంటే ప్రతి గంటకు ఐదు ఘటనలు అన్నమాట. అయితే, చాలా వరకు కేసుల్లో నిందితులు పెత్తందారీ కులాలకు చెందినవారు కావటంతో పెద్ద సంఖ్యలో కేసులు నమోదు కాలేదని విశ్లేషకులు వివరించారు. మధ్యప్రదేశ్‌లో పంచాయతీలో ఓ దళితుడు కుర్చీలో కూర్చున్నందుకు అగ్రకులస్థుడు అతడి తల పగలగొట్టడం... ఉత్తరప్రదేశ్‌లోని ఔరియా జిల్లాలో తరగతి నోట్స్‌లో తప్పులు రాశాడని టీచర్ ఓ దళిత విద్యార్థిని చితకబాదడంతో మరణించడం...ఇలా దళితులపై వివక్ష చూపేలా... వారిని వేధించేలా జరుగుతున్న ఘటనలు కొకొల్లలు. కేంద్రంలో, రాష్ట్రాల్లో బీజేపీ గద్దెనెక్కిన తర్వాత ఈ విష ధోరణి మరింత పెచ్చరిల్లుతోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితుల పరిస్థితి దయనీయంగా మారింది. రాజస్థాన్, తమిళనాడు వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ ధోరణి కనిపిస్తోంది. దళితులపై దాడుల ఘటనలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నా.. వాటిపై ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం తగిన విధంగా స్పందించి, చర్యలు తీసుకుంటున్న సందర్భాలు తక్కువగా కనిపిస్తున్నాయి.

మోదీ పాలనలో దళితులకు సామాజిక భద్రతకరువైందని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్య తీరుపై దళిత సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్ర భారతావనిలో సామాజిక అంతరాలు ఏ మాత్రమూ దూరం కాలేదని విశ్లేషకులు చెబుతున్నారు. 1991 నుంచి అధికారికంగా 7 లక్షలకు పైగా అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా... దళితులు ఇంకా హింస, అణచివేతకు గురౌతుండటం వివక్షతో నిండిన సమాజం ఇంకా కొనసాగుతుందనే వాదనకు అద్దం పడుతోంది.

యాత్రా కాలం!

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్రలు కొత్తేమీ కాదు. ఇలాంటి యాత్రలు గతంలో అనేకం జరిగాయి. అందులో కొన్ని విజయం సాధించాయి. కొన్ని విఫలమయ్యాయి. 1983లో మాజీ ప్రధాని చంద్రశేఖర్ భారత్ యాత్ర పేరుతో కన్యాకుమారి నుంచి పాదయాత్ర చేశారు. 1983 జనవరి 6న కన్యాకుమారి నుంచి ప్రారంభమైన చంద్రశేఖర్ సుదీర్ఘ పాదయాత్ర ఆరు మాసాల తర్వాత న్యూఢిల్లీ చేరుకుంది. గ్రామగ్రామాన పాదయాత్ర చేసుకుంటూ ఢిల్లీ చేరిన చంద్రశేఖర్‌కు మంచి పేరు, ప్రచారం లభించాయి. చంద్రశేఖర్ పాదయాత్ర విజయవంతమైనట్లు పరిశీలకులు చెప్పినప్పటికీ నాటి ప్రధాని ఇందిరాగాంధీ దారుణహత్యతో దేశంలో రాజకీయ పరిణామాలు నాటకీయంగా మారాయి. ఇందిర హత్యతో చంద్రశేఖర్ పాదయాత్రను ప్రజలు మర్చిపోయారు. 1984 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. 1985లో ముంబైలో జరిగిన ఏఐసీసీ ప్లీనరీ వేదికగా నాటి ప్రధాని, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ సందేశ్ యాత్రను ప్రకటించారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఈ యాత్రను దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ)లు, ఆ పార్టీ నాయకులు ముంబై, కశ్మీరు, కన్యాకుమారి, ఈశాన్య ప్రాంతం నుంచి ఒకేసారి యాత్రలు చేపట్టారు. మూడు మాసాల పాటు సాగిన ఈ యాత్రలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ముగిశాయి. రామ మందిర ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో బీజేపీ నాయకుడు ఎల్‌కే అద్వానీ 1990లో రథయాత్ర చేపట్టారు. 1990 సెప్టెంబరులో ప్రారంభమైన అద్వానీ రథయాత్ర 10 వేల కిలో మీటర్లు సాగి అక్టోబరు 30న అయోధ్యలో ముగిసింది. ఉత్తర బీహార్‌లోని సమస్తిపూర్‌లో అద్వానీని నాటి లాలు ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం అరెస్టు చేయడంతో రథయాత్ర తాత్కాలికంగా నిలిచిపోయింది. అద్వానీ రథయాత్ర తర్వాత కాలంలో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ఎన్నికల్లో విజయానికి దోహదపడినట్లు రాజకీయ పరిశీలకులు పేర్కొన్నారు. రామమందిర నిర్మాణం నినాదం ఊపందుకుంది. 1991లో అప్పటి బీజేపీ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి ఏక్తా యాత్ర పేరుతోనూ, 2003లో కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 1400 కిలోమీటర్ల పాదయాత్ర, 2004లో అద్వానీ భారత్ ఉదయ్ యాత్ర, 2017లో వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నేతలు యాత్రలు చేపట్టారు. ప్రస్తుతం చేపట్టిన యాత్రలతో ఆయా రాజకీయ పార్టీలకు ఎలాంటి ప్రయోజనం ఉంటుందో వేచిచూడాల్సిందే. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలకు పాదయాత్రలు ఓ సంప్రదాయంగా, అలవాటుగా మారాయి. ఇక ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే తెలుగుదేశం పార్టీ యువ నేత లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బస్సుయాత్రలు చేపట్టనున్నట్లు ఆయా పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. రాష్ట్రంలో ఎలాంటి ప్రభావం చూపని...తాము కూడా ఉన్నామని చెప్పుకుంటున్న బీజేపీ సైతం యాత్రల పేరుతో అక్కడక్కడ ప్రచారం చేసుకుంటున్నది.

విభజన హామీలపై బీజేపీ నాటకాలు

- రైల్వేజోన్ అమలుపై దగా
- ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లవుతున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, బీజేపీ దొంగ నాటకాలాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ధ్వజమెత్తారు. విజయవాడ బాలోత్సవంలో సోమవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీల అధ్వర్యంలో రాష్ట్ర విభజన హామీలు, విశాఖ రైల్వేజోన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రౌండుటేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ అధ్యక్షత వహించారు. హోదాను పూర్తిగా విస్మరించారని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రామకృష్ణ విమర్శించారు. ఏటా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కొరత విధిస్తోందని, అన్నింటా అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో స్టీలు ఫ్యాక్టరీపై కేంద్రం మౌనంగా ఉందని, కేంద్ర విద్యా సంస్థల నిర్మాణం, వాటి నిధుల ఊసే లేదన్నారు. అటు రాజధాని అమరావతిని జగన్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం అందజేతలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అన్యాయం చేశాయన్నారు. విభజన హామీల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్యార్థి, యువజనులు కలిసి విభజన హామీలు, రాష్ట్ర హక్కుల సాధించేలా సమైక్య ఉద్యమాలకు ప్రణాళిక రచించాలని కోరారు. తమకు అధికారం ఇస్తే పోలవరం పూర్తి చేస్తామంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చేస్తున్న వ్యాఖ్యల్ని రామకృష్ణ తప్పుబట్టారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండి కూడా ఆ పార్టీ నేతలు ఇలా వ్యాఖ్యానించడమేంటని నిలదీశారు. రాష్ట్రానికి రైల్వేజోన్ ఇస్తామని ఆనాటి రైల్వే మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో ప్రకటించారని గుర్తుచేశారు. ఇవాళ తమ పరిధిలో లేదంటూ కేంద్రం మాట మార్చిందంటూ మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విభజన అంశాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించడం లేదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులపై పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకుడు డీ హరినాథ్ మాట్లాడుతూ రాష్ట్రానికి పదేపదే అన్యాయం చేస్తున్న బీజేపీకి రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మద్దతిచ్చాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు వీ కృష్ణయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే సుబ్బరావమ్మ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తదితరులు మాట్లాడుతూ, ప్రజలను పదేపదే బీజేపీ మోసగిస్తోందన్నారు.

విశాఖ రైల్వేజోన్ అమలు కోసం అసెంబ్లీలో తీర్మానించాలని, రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా, రైల్వేజోన్ కోసం ఐక్యంగా పోరాడాలని సమావేశం తీర్మానించింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, కే శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ లెనిన్‌బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే ప్రసన్నకుమార్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, ఏఐఎస్ఏ రాష్ట్ర నాయకుడు అనిల్, జాషువా విజ్ఞాన వేదిక నాయకుడు జి.నారాయణ, ఐద్వా రాష్ట్ర నాయకుడు ఆశ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు సోమేశ్వరరావు, పి.కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చేతిలో గంజాయి... చలనం లేని సర్కార్: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజకీయ వేధింపులకు పోలీసులను వాడడంలో మునిగిపోయిన ప్రభుత్వం, యువత, విద్యార్థుల జీవితాలను గాలికొది లేసిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. ఇది క్షమించరాని నేరమన్నారు. పదమూడేళ్ల పిల్లల చేతికి గంజాయి చేరడం ఆందోళన కలిగిస్తోంది. అతి చిన్న వయసులో బాలికలు విజయవాడలో గంజాయి తాగడం నివ్వెర పరిచిందనీ, ఈ వార్త తనను ఎంతో ఆందోళనకు, ఆవేదనకు గురి చేసిందని తెలిపారు. స్కూలు పిల్లల వరకు గంజాయి వచ్చేసిందంటే... పరిస్థితి ఎంత ప్రమాద కరంగా ఉందో అర్థం అవుతుందనీ, తీవ్రమైన ఈ అంశంపై ప్రభుత్వ వ్యవస్థలు అత్యంత సీరియస్‌గా దృష్టిపెట్టాలని సూచించారు. సమూలంగా గంజాయిని అరికట్టేలా సత్వర చర్యలు తీసుకోవాలనీ, కొత్త సమస్యలు, సవాళ్ల నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు ట్వీట్ చేశారు.

ట్యూషన్ ఫీజు కట్టకుంటే సీటు రద్దు!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంజినీరింగ్ సీట్లు పొందిన విద్యార్థులంతా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేశాక కూడా యాజమాన్యం మొండి వైఖరితో వ్యవహరిస్తోంది. ట్యూషన్, బస్సు ఫీజులు కట్టాల్సిందేనని, లేకుంటే మీ సీటు పోతుందంటూ సర్క్యులర్లు, మెస్సేజ్‌లు పంపుతున్నాయి. గత నెల 29తో ఏపీ ఈఏపీసెట్-2022 ఇంజినీరింగ్‌కు రిపోర్టింగ్ ప్రక్రియ ముగిసింది. కన్వీనర్ కోటా కింద సీట్లు పొంది, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత లేని వారంతా ఆయా కళాశాలల్లో నిర్దేశించిన ఫీజులు కట్టాలి. నిబంధనల ప్రకారం మూడో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక, సదరు విద్యార్థి చివరి దశలో ఏ కళాశాలలో సీటు పొందుతారో అక్కడే ఫీజులు చెల్లించాలంటూ స్పష్టం చేసింది. అదే విషయాన్ని విద్యార్థులకు జారీజేసిన అలాట్‌మెంట్ లెటర్లలో పొందుపరిచారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో సరైన కళాశాల, బ్రాంచి రాని వారంతా రెండో విడత కౌన్సెలింగ్‌కు సిద్ధమయ్యారు. కన్వీనర్ నిబంధల మేరకు వారికి తొలి విడత సీటు వచ్చిన కళాశాలల్లో రిపోర్ట్ చేశారు. ఆయా కళాశాలల యాజమాన్యం వారికి ఫోన్లు, మెస్సేజ్‌లు పంపుతూ ట్యూషన్, బస్సు ఫీజులు కట్టాలంటూ, లేకుంటే సీటు రద్దవుతుందంటూ పేర్కొంటున్నాయి. పేరొందిన వివిధ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ ఇదే తరహాగా మెయిల్లకు సర్క్యులర్లు, మెస్సేజ్‌లు పంపుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఆయా యాజమాన్యాలు కన్వీనర్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందరికీ సాంఘిక న్యాయమే లక్ష్యం

ఓబులేసు ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సాంఘిక న్యాయం జరగాలనే లక్ష్యంతో ప్రపంచ కార్మిక సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) శాయశక్తులా పని చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. డబ్ల్యూఎఫ్‌టీయూ 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పుస్కరించుకుని విజయవాడ ఒన్‌టౌన్‌లోని లెనిన్ భవన్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఐటీయూసీ విజయ వాడ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓబులేసు మాట్లాడుతూ 77 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కార్మికవర్గం, పేద ప్రజానీకం, శ్రమజీవుల సమస్యలపై స్పందిస్తూ డబ్ల్యూఎఫ్ టీయూ కార్యక్రమాలు చేస్తున్నదన్నారు. పాలకుల విధానాల కారణంగా ధనవంతులు మరింత ధనవం తులుగా, పేదలు నిరుపేదలుగా మారుతున్నారని ఓబులేసు చెప్పారు. అదానీ, అంబానీల ఆస్తులు 480 రెట్లు పెరిగాయన్నారు. కరోనా కష్టకాలంలోనూ వారికి రోజుకు రూ.1600 కోట్ల ఆదాయం వచ్చింద న్నారు. ఆరుగాలం పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు లభించటం లేదన్నారు. అందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం సమానంగా అందుబాటులో ఉండాలని డబ్ల్యూఎఫ్‌టీయూ డిమాండ్ చేస్తున్నదన్నారు. కార్పొరేట్ శక్తుల దోపిడీ ఆగాలని చెప్పారు. డబ్ల్యూఎఫ్‌టీయూ ఆవిర్భావం సందర్భంగా కార్మికవర్గాన్ని సమాయత్తం చేయటానికి ఏఐటీయూసీ ప్రతినబూను తుందన్నారు. ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కొట్టు రమణారావు, ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ శ్రీరామ్మూర్తి, కార్యదర్శి వి.నాగేశ్వరరావు, ఆర్టీసీ క్వార్టర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, నాయకులు తిరుపతయ్య, ఎస్.శ్రీనివాసరెడ్డి, బియ్యపు కృష్ణారావు, గొర్రె కొండలరావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణే లక్ష్యం

జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం

వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం జగన్ నిర్దేశించిన వికేంద్రీకరణే ఏకైక మంత్రమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయ కర్తలతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలుత ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తల కుటుంబాలకు విజయదశమి శుభా కాంక్షలు తెలియచేశారు. అమ్మవారి ఆశీస్సులతో సీఎం జగన్ పరిపాలనలో రాష్ట్రం బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సజ్జల మాట్లాడుతూ, వికేంద్రీకరణకు సంబంధించి ప్రజావేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ జరుగుతుందని వివరించారు. కాకినాడ, రాజ మహేంద్ర వరంలో జరుగుతున్నాయన్నారు. అమరావతి 29 గ్రామాలకు సంబంధించి రియల్ ఎస్టేట్ వెంచర్ వంటి చంద్రబాబు పెట్టిన సోకాల్డ్ క్యాపిటల్ అని, అది ఎండమావిలా ఆచరణలోనికి రానిదని విమర్శించారు. చంద్రబాబు దోపిడీ మార్గానికి భిన్నంగా, సీఎం జగన్ ఆలోచనలతో వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులను ప్రతిపాదించామని చెప్పారు. అది శాశ్వతంగా వికేంద్రీకరణ ఉండేలా భవిష్యత్తులో వేర్పాటువాదాలు తలెత్తకుండా మూడు ప్రాంతాల ప్రజల ఆకాంక్షలు నెరవేరేటట్లుగా ఆలోచించారన్నారు. వికేంద్రీకరణ వల్ల రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని, అంతకుమించి ప్రత్యామ్నాయం లేదని నమ్ముతున్నామని పేర్కొన్నారు. వికేంద్రీకరణ ప్రజలందరికీ అనుకూలమైందనీ, సామాజిక అభివృద్ధికి పనికివచ్చేదని స్పష్టం చేశారు. ఈ నెల 5న విజయదశమి రోజున రాష్ట్రంలో అన్ని దేవాలయాలలో పెద్ద ఎత్తున పూజలు జరగాలని, కొబ్బరి కాయలు కొట్టి వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కావాలని కోరాలన్నారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

11.6 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

విశాలాంధ్ర-కడప క్రైం: కేరళకు చెందిన ఇద్దరు అంతర్ రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశామనీ, మరొకరు పరారీలో ఉన్నారనీ అతడి కోసం ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామనీ ఎస్పీ కేకేఎన్ అంబురాజన్ తెలిపారు. పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, అబ్దుల్ నసీం (22), అజ్మల్ (21)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11.6 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేరళ రాష్ట్రానికి చెందిన వీరు రాజమహేంద్రవరంలో ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసి వై.ఎస్.ఆర్ జిల్లా సిద్ధవటం మండలం కనుమలోపల్లి మీదుగా వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వీరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. గంజాయి విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పి.డి చట్టం ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చ రించారు. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా 94407 96900కు సమాచారం అందించాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయికి బానిసైన వారిని పునరావాస కేంద్రాలకు తరలించి మామూలు మనిషిగా మారుస్తామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి పర్యవేక్షణలో స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, చిన్నచౌకు సి.ఐ. అశోక్ రెడ్డి, సిద్ధవటం ఎస్.ఐ తులసి నాగ ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందచేశారు.

రూ.26 లక్షలకు కుచ్చుటోపీ!

- శహపురంలో యూనియన్ బ్యాంక్ బీసీ పాయింట్ నిర్వాహకుడి చేతివాటం
- లబోదిబోమంటున్న 105 డ్వాక్రా సంఘాల మహిళలు
- ఎంపీటీసీ సహకారంతో పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-పెదపూడి: కాకినాడ జిల్లా పెదపూడి మండలం శహపురంలో యూనియన్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ పాయింట్) నిర్వాహకుడు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఎంపీటీసీ సభ్యురాలు చందల్ల పార్వతి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల ప్రతినిధులు సోమవారం పెదపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గ్రామంలో గుత్తుల కుమారస్వామి అనే వ్యక్తి సంపర యూనియన్ బ్యాంక్ శాఖకు అనుబంధంగా శహపురం గ్రామంలో బీసీ పాయింట్ నిర్వహిస్తున్నాడని చెప్పారు. ఈ పాయింట్లో 105 డ్వాక్రా సంఘాల మహిళలు పొదుపు, రుణాలు ప్రతి నెల చెల్లిస్తుంటారన్నారు. అయితే గత రెండు నెలలుగా బీసీ పాయింట్‌లో పొదుపు, రుణాలు చెల్లించినప్పటికి బ్యాంక్ పాస్ పుస్తకంపై ప్రింటింగ్ వేయకుండా పెన్నుతో రాసి మీ నగదు ఖాతాలో జమ అయింది అని నమ్మబలుకు తున్నాడని వారు తెలిపారు. ఖాతాదారులందరికి ఈదే విధంగా చేస్తుండేవాడని... డ్వాక్రా సంఘాల ప్రతినిధులు ఇక్కడ ప్రింటింగ్ వేయడంలేదని సంపర యూనియన్ బ్యాంక్ వద్దకు వెళ్లి ప్రింటింగ్ వేయమని అధికారులను అడిగినప్పటకీ బ్యాంక్ అధికారులు స్పందించలేదని మహిళలు ఆరోపిసు న్నారు. వారం రోజులుగా నిర్వాహకుడు కుమారస్వామి బీసీ పాయింట్ మూసి వేయడంతో అనుమానం వచ్చిన మహిళలు సంపర బ్యాంకు అధికారులను గట్టిగా నిలదీయడంతో, మొత్తం 67 డ్వాక్రా సంఘాలకు సంబంధించి సుమారు రూ.26 లక్షలు గత రెండు నెలలుగా చెల్లింపులు చేయలేదని తెలిపారన్నారు. తిని తినక క్రమశిక్షణతో రుణాలు చెల్లిస్తున్నామని, బీసీ పాయింట్ నిర్వహకుడు తమను మోసం చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కుమారస్వామితో పాటు అతడికి సహకరిం చిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

'సుప్రీం' ఆదేశాల ప్రకారమే నిర్ణయం

పత్రికల్లో అసత్య కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నా: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దసపల్లా భూములపై కొన్ని పత్రికల్లో ప్రచురించిన అసత్య కథనాలు, ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ భూములకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయం వెనుక నిజానిజాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని, దసపల్లా భూముల వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన అనివార్య పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దసపల్లా భూముల్లో మొత్తం 82 ఎకరాలకు సంబంధించిన వివాదంపై టీడీపీ హయాంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అప్పటి అడ్వకేట్ జనరల్ సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. దసపల్లా భూముల వివాదంపై వివిధ అప్పీళ్ల దశలు ముగిసిన అనంతరం డివిజన్ బెంచ్ ఆదేశాలను ఆమోదించామన్నారు. దసపల్లా హిల్స్ సర్వే నంబర్ 1197, 1196, 1028, 1027లోని భూములకు రాణి కమలా దేవిని యజమానిగా నిర్ధారిస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పిందని, ఆ మేరకు 2015 ఫిబ్రవరి 25న టీడీపీ హయాంలోనే సుప్రీంకోర్టు అడ్వకేట్ జనరల్ వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన సూచనలే ఇవి అని తెలిపారు. అయితే కొన్ని పత్రికలు, కొందరు వ్యక్తుల రాజకీయ, స్వార్థ ప్రయోజనాలను కాపాడటం కోసం పని గట్టుకుని దీనిపై తప్పుడు వార్తలను ప్రచురించాయని, గతంలో సర్క్యూట్ హౌస్ ప్రభుత్వ అతిథి గృహం, తూర్పు నౌకాదళంతో పాటు ఇతర కార్యాలయాల ఏర్పాటుకు సేకరించిన దసపల్లా భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లించింద న్నారు. ప్రభుత్వ భూము లైతే పరిహారం చెల్లించా ల్సిన అవసరం లేదని, దసపల్లా భూములు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్నందువల్లే పరిహారం చెల్లించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వాటికి వచ్చిన నష్టమేమీ లేదని, వీటిని కూల్చివేస్తారంటూ చేస్తున్నది కేవలం దుష్ప్రచారమే అన్నారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని, ఇవి కేవలం కొందరి రాజకీయ ప్రయోజ నాల కోసం సృష్టించిన కుట్రపూరిత వదంతులు మాత్రమేనన్నారు. దసపల్లా భూముల్ని ప్రభుత్వం 22ఏ నుంచి తొలగిస్తే సుమారు 40 ఎకరాల పరిధిలో ఉన్న 500 మంది గృహ యజమానులు, అపార్ట్‌మెంట్‌లలో ఉంటున్న ఫ్లాట్ యజమానులకు ప్రయోజనం కలుగుతుందని, 64 మంది ప్లాట్ల యజమానులు మాత్రమే తమ పరిధిలో ఉన్న 20 శాతం భూమిని అస్యూర్ డెవల పర్స్‌కు అప్పగించారే తప్ప, మిగిలిన వారెవ్వరూ ఇవ్వలేదన్న విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. గతంలో టీడీపీ కార్యాలయం విషయంలోనూ ఇదే జరిగిందని, దసపల్లా భూముల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున వల్ల యాజమాన్య హక్కులు ఖరారయ్యే వరకు తాత్కాలిక నిర్మాణం చేపట్టాలని ఆదేశిస్తూ అప్పటి కలెక్టర్ టీడీపీకి భూమిని ఇచ్చారని, అనంతరం రాణి కమలాదేవికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో టీడీపీ ఆ స్థలంలో శాశ్వత నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. అంటే రాణి కమలాదేవితో కుమ్మక్కై టీడీపీ శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లా అని ప్రశ్నించారు. న్యాయస్థానాల తీర్పులు కూడా తమ ప్రభుత్వంలో వచ్చినవి కావనీ, ఇవి గత ప్రభుత్వంలో వచ్చిన తీర్పులని, పైగా తమ తీర్పును అమలు చేయని పక్షంలో కోర్టు ధిక్కరణగా పరిగణించి చర్యలు తీసుకుంటాం అని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో కోర్టు తీర్పును అమలు చేయడం మినహా ప్రభుత్వం ముందు మరో మార్గం లేదన్నారు. దసపల్లా భూములపై సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ప్రభుత్వం వాటిని క్లియర్ చేయడం తప్ప మరో మార్గంలేని పరిస్థితిలో దసపల్లా భూములు కొందరు ప్రైవేటు వ్యక్తులకు దక్కాయి. వారు ఆ భూముల్ని ఉంచుకుంటారా లేక అమ్ముకుంటారా? లేదా ఏం చేసుకుంటారన్నది పూర్తగా వారి ఇష్టమని తెలిపారు. దసపల్లా హిల్స్ మొత్తం భూమి 83.25 ఎకరాలనీ, (సర్వే నంబర్ 1196, 1197, 1028, 1027లో) అందులో ప్రైవేట్ లేఅవుట్స్, వుడా లేఅవుట్స్, బిల్టప్ ఏరియా, రహదారులు, ఎల్.ఆర్.ఎస్. పరిధిలో ఉన్న భూమి- సుమారు 40 ఎకరాలు. ఖాళీగా ఉన్న భూమి- సుమారు 12 ఎకరాలు. టీడీపీ కార్యాలయం, సర్క్యూట్ హౌస్, నేవీ హౌస్‌తో పాటు ఇతర కార్యాలయాలకు వినియోగించిన భూమి: సుమారు 5 ఎకరాలు. మిగిలిన బిల్ట్ అప్ ఏరియా సుమారు 12 ఎకరాలు. అస్యూర్ డెవలపర్స్ ఒప్పందం కుదుర్చుకున్న ప్లాటు యజమానులు- దాదాపు 15 ఎకరాల పరిధిలో ఉన్న 64మందని తెలిపారు.

పరీక్ష విధానంలో ఏకపక్ష మార్పులు తగదు: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పరీక్ష విధానంలో మార్పులు ఏకపక్షంగా చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం ప్రభుత్వానికి తగదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఏవైనా మార్పులు చేయాలనుకున్నప్పుడు సంబంధిత ఉపాధ్యాయులు, మేధావి వర్గం అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. వారికి తోచిన విధంగా ఏకపక్షంగా మార్పుల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఇబ్బందికరమైన విషయమని తెలిపారు. దీనివల్ల నష్టం జరిగితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతుందని, ఇలాంటి విధానాలను అవలంబించే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటే మంచిదని సూచించారు. పదో తరగతి పరీక్ష పేపర్లలో మొత్తం సిలబస్‌ను ఆరు పేపర్లుగా కుదించి నిర్వహించడం వల్ల విద్యార్థులకు నష్టం కలుగుతోందన్నారు. దీనిపై పునరాలోచన చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం జగన్ దసరా శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ముఖ్యమంత్రి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. లోకకంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించి నందుకు, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా ఈ పండగ జరుపుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు. జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు కలిగేలా దుర్గామాత దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

రాజీవ్ సలివేంద్రకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర- విజయవాడ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (టీఏహెచ్‌ఎం) విభాగంలో రీసెర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్న రాజీవ్ సలివేంద్రకు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. టీఏహెచ్‌ఎం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ పి .పూర్ణచంద్రరావు, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ అఫ్ ది డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ శాంసన్ సంజీవరావు నల్లపు పర్యవేక్షణలో "మెడికల్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్ - యాన్ ఎంపెరికల్ స్టడీ ఆన్ ట్రెండ్ పర్స్పెక్టివ్స్" అనే అంశంపై సమగ్ర పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను రాజీవ్‌కు నాగార్జున వర్సిటీ పీహెచ్‌డీ అందజేసింది. ఏపీలో మెడికల్ టూరిజం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నదని, దీనివల్ల హెల్త్ కేర్ సెక్టార్, టూరిజం సెక్టర్ రెండు కూడా అమితంగా అభివృద్ధి చెందేందుకు మెరుగైన అవకాశాలున్నాయని రాజీవ్ తన థీసిస్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా రాజీవ్‌ను ఆయా విభాగాధిపతులు అభినందించారు.

సీఐడీ తీరు సరికాదు

డీజీపీకి వర్ల రామయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చింతకాయల విజయ్ వ్యవహారంలో సీఐడీ పోలీసుల తీరును తప్పుబడుతూ టీడీపీ నేత వర్ల రామయ్య సోమవారం డీజీపీకి లేఖ రాశారు. సీఐడీ పోలీసులపై ఎన్ని విమర్శలు వస్తున్నప్పటికీ, పనితీరులో మాత్రం మార్పు రావడం లేదన్నారు. గోడలు దూకడం, బలవంతంగా ఇళ్లల్లోకి చొరబడటం, కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం నిత్యకృత్యమైందని విమర్శించారు. ఏపీ సీఐడీ పోలీసులు డికె బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్, అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ వంటి కేసులలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని నొక్కిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారనీ, హైదరాబాద్‌లో చింతకాయల విజయ్ ఇంటిలో ప్రవర్తించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. అది మానవహక్కుల ఉల్లంఘనేనని, రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాల్లో కూడా నవ్వులపాలు కాక తప్పదని తెలిపారు. సీఐడీ పోలీసులు బ్యాడ్జీలు ఎందుకు ధరించలేదనీ, ఐదేళ్ల పిల్లవాడిని ప్రశ్నించాల్సిన అవసరం ఏమిటి?, సివిల్ దుస్తుల్లో వెళ్లి ఏం నిరూపించాలనుకున్నారని వర్ల ప్రశ్నించారు. వాస్తవంగా నోటీసు ఇవ్వడానికి వెళ్తే షెల్ఫ్‌లు, కబోర్డులు తెరవాల్సిన అవసరం ఏమిటనీ, విజయ్ డ్రైవర్ చంద్రను ఎందుకు కొట్టాల్సి వచ్చిందని నిలదీశారు. ప్రాథమిక హక్కులు, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి డ్రైవర్‌పై దాడి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీలో 5జీ సేవలు ప్రారంభించండి

కేంద్ర మంత్రికి ఎంపీ జీవీఎల్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దేశంలో 13 నగరాల్లో 5జీ సేవలను ప్రారంభించడం ద్వారా కొత్త డిజిటల్ యుగానికి నాంది పలికినట్టయిందని రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సోమవారం రాసిన లేఖలో పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. అల్ట్రా-హై-స్పీడ్ ఇంటర్నెట్ 5జీ టెక్నాలజీ... డిజిటల్, ఆర్థిక విప్లవానికి నాంది పలుకుతుందని జీవీఎల్ అన్నారు. తదుపరి దశలో ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, తిరుపతి వంటి నగరాలలో 5జీ సేవలను ప్రారంభించేందుకు ప్రాముఖ్యతనివ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయానికి స్థావరంగా ఉన్నందున, పోర్ట్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, హిందుస్తాన్ పెట్రోలియం, సమీర్ మొదలైన వ్యూహాత్మక సంస్థలతో పాటు భారతీయ కోస్ట్ గార్డ్ కార్యకలాపాలను కలిగి ఉన్నందున జాతీయ భద్రత దృష్ట్యా అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతమని తెలిపారు. 5జీ సేవలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని వైష్ణవ్‌ను అభ్యర్థించారు.

599వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ ఆధ్వర్యాన అప్పటి ఉద్యమ ఫలితంగా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ప్రజలే కాపాడుకోవాలని పోరాట కమిటీ ప్రతినిధి వై.మస్తానప్ప, జె.రామక్రిష్ణ, జి.బోసుబాబు, బొడ్డు పైడిరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, జి.నరేంద్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్న పాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారం 599వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఇఅండ్ఎష్ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షా శిబిరానుద్దేశించి నాయకులు మాట్లాడుతూ 32మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు గురించి కేంద్రాన్ని అందరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. రిలే దీక్షలు చేపట్టి 599వ రోజుకు చేరుకున్నప్పటికీ కేంద్రంలో చలనంలేదని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో ప్రజలంతా మమేకమై పాల్గొనాలని, బీచ్‌రోడ్డు పాదయాత్రను జయప్రదం చేయడం ఉద్యమ తీవ్రతకు నిదర్శనమని అన్నారు. ఈ దీక్షల్లో జి.శ్రీను, బంటు రాము, గంగాధర్, గోవిందు, యు.అప్పారావు, నీలకంతం పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆర్.ఎస్.ఎస్. నోట ప్రతిపక్షాల మాట

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే తాజాగా దేశంలోని పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం తదితర అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాతృ సంస్థ అగ్రనాయకుడు ఈ కీలకాంశాలను బహిరంగంగా లేవనెత్తడం ఆశ్చర్యకరమే కాదు. అది మోదీ సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఎక్కుపెట్టిన తీవ్ర విమర్శ కూడా. ఇంతకాలంగా ప్రతిపక్ష నాయకులు ఏ అంశాలనైతే లేవనెత్తుతూ వచ్చారో ఇప్పుడు హోసబలే అవే విషయాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటే మోదీ ఆర్థిక విధానాల మీద బీజేపీకి గురుపీఠమైన ఆర్.ఎస్.ఎస్. తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టే. ఎనిమిదేళ్ల అధికారం తరవాత మోదీ ఆర్.ఎస్.ఎస్.ను ఖాతరు చేయడం లేదన్న గుసగుసలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. హోసబలే విమర్శతో ఆర్.ఎస్.ఎస్. మోదీ సర్కారు నడవడికను మెచ్చడం లేదని తేలిపోయింది. 20 కోట్ల మంది ప్రజలు ఇంకా నిరుపేదలుగానే ఉన్నారని హోసబలే చెప్పారు. అనేక దశాబ్దాలుగా అనుసరించిన ఆర్థిక విధానాలవల్లే ఆర్థిక పరిస్థితి దుర్భరంగా తయారైందని ఒక వేపు ఆయన చెప్తూనే ఉన్నా ఆయన విమర్శల ఆంతర్యం మోదీ సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల మీద ఆర్.ఎస్.ఎస్. అసంతృప్తితో ఉందని అంగీకరించవలసిందే. అయితే బీజేపీ సర్కారును బహిరంగా దుయ్యబట్టినట్టు కనిపించకూడదనుకుని ఆయన గత కొద్ది సంవత్సరాలుగా ఆర్థిక విధానాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ మాటనే ఆయన నమ్ముతున్నట్టయితే లేదా మోదీ సర్కారు ఆర్థిక విధానాలు సవ్యంగా ఉన్నాయని భావిస్తున్నట్టు అయితే పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం గురించి ఆయన ప్రస్తావించవలసిన అవసరం ఏముటుందిగనక. కాంగ్రెస్ అరవై ఏళ్ల పాలించింది నాకు అరవై నెలలు ఇవ్వండి అన్న అభ్యర్థనతోనే మోదీ అధికారంలోకి వచ్చారు. అరవై నెలల కాలం గడిచి మరో రెండేళ్లు గడిచినా హోసబలే నిరసన వ్యక్తం చేయడం అంటే ఆర్.ఎస్.ఎస్.కు బీజేపీకి మధ్య ఎక్కడో పొసగడం లేదని అనుకోవాలి. దేశంలో నాలుగు కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారనీ నిరుద్యోగం 7.6 శాతం ఉందని హోసబలే అందరికీ తెలిసిన లెక్కలే ఉటంకిస్తున్నారు. అంటే అత్యధిక సంఖ్యాకులను వేధిస్తున్న సమస్యే ఆర్.ఎస్.ఎస్.ను కూడా కలవర పెడ్తోందని భావించక తప్పదు. ఉపాధి అవకాశాలు, సముచిత విద్యావకాశాలు, పోషకాహార లోపం, అనేక గ్రామాలకు పరిశుభ్రమైన మంచి నీరు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పేదరికం బ్రహ్మ రాక్షసిలా తయారైందని హోసబలే అంటున్నారు. ఈ రాక్షసిని సంహరించవలసిందేనన్న హోసబలే మాటతో ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండనవసరం లేదు. దేశ జనాభాలో 23 కోట్ల మందికి రోజువారీ ఆదాయం రూ. 375 కన్నా తక్కువే ఉందని ఆర్.ఎస్.ఎస్.కు అనుబంధ సంస్థ అయిన స్వదేశీ జాగరణ్ మంచ్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హోసబలే అనేక సమస్యలను ప్రస్తావించారు. ఈ సంస్థ స్వావలంబి భారత్ పథకం అమలు చేస్తోంది. మామూలు భాషలో చెప్పాలంటే ఇది మన కాళ్ల మీద మనం నిలబడడం లేదా స్వయం సమృద్ధంగా ఉండడం. దీనినే మోదీ తన భాషలో ఆత్మ నిర్భర్ భారత్ అంటున్నారు. హోసబలే మాటలను బట్టి చూస్తే ఈ ఆత్మ నిర్భర్ భారత్ ఎక్కడా కనిపించడం లేదని స్పష్టం అవుతోంది. ఆర్థిక అసమానతలు అంతకంతకూ పెరిగిపోవడం మీద కూడా ఆర్.ఎస్.ఎస్. నాయకుడు ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ప్రపంచంలో ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటున్నా ప్రస్తుత పరిస్థితి అందుకు అనుగుణంగా లేదని ఆయన నిర్మొహమాటంగానే చెప్పారు. ఒక్క శాతం మంది గుప్పెట్లో దేశ సంపదలోని 20 శాతం ఉంటే, 50 శాతం మంది దగ్గర కేవలం 13 శాతం సంపదే ఉందని హోసబలే గణాంకాలను ఉటంకిస్తూ చెప్పారు. ఐక్య రాజ్యసమితి విడుదల చేసిన గణాంకాలను కూడా హోసబలే ప్రస్తావించారు. కానీ ఇలాంటి సందర్భాలలో గౌరవ ప్రతిష్ఠలు గల అంతర్జాతీయ వేదికలు వెల్లడించే గణాంకాలను మోదీ సర్కారు తోసిపుచ్చుతోంది. విదేశీ కొలమానాలు మనకు సరిపడవని వాదిస్తోంది. హోసబలే అవే గణాంకాల ఆధారంగా మాట్లాడుతున్నారంటే ఆయన ఆవేదనను మోదీ సర్కారు కొట్టి పారేస్తుందనుకోవాలా! శీతోష్ణ స్థితిలో మార్పులు, సమాజంలోని భిన్న వర్గాల మధ్య వైషమ్యాల కారణంగా కూడా పేదరికం తాండవిస్తోందని హోసబలే అంటున్నారు. ఈ వైషమ్యాలు ఆర్.ఎస్.ఎస్. వ్యాపింపజేసే విచ్ఛిన్నకర భావజాల ఫలితమేనని ఆయనకు తెలియక కాదు. తమను ఖాతరు చేయకుండా వ్యవహరిస్తున్న మోదీని ఒక్క పొడుపు పొడవడానికే హోసబలే ఈ విమర్శలకు దిగి ఉంటారు. పట్టణాలు పెరిగితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్న ఆలోచనా ధోరణి వమ్ము అయిందని కూడా హోసబలే చెప్పారు. పట్టణాల పెరుగుదలను ప్రోత్సహించినందువల్ల నగర జీవనం నరకప్రాయం అయింది. కరోనా మహమ్మారి చెలరేగిన సమయంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెంచాలనుకున్నామనీ అందుకోసమే స్వావలంబి భారత్ పథకం చేపట్టామని హోసబలే గుర్తు చేశారు. అదీ సాకారం కాకపోవడమే ఆయన ఆందోళనకు ప్రధాన కారణం. దేశవ్యాప్త పథకాలకన్నా స్థానిక అవసరాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించవలసిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ఉద్యోగార్థులకు ఉపాధి కల్పించడం మీద కాకుండా వారే ఇతరులకు ఉద్యోగాలిచ్చే పరిస్థితి కల్పించడమే తమ లక్ష్యం అని మోదీ ఎప్పటి నుంచో ఊదరగొడ్తున్నారు. హోస బలే నోట కూడా అదే మాట వెలువడుతోంది. మరి తేడా ఎక్కడు న్నట్టు! హోసబలే వ్యాకులతకు కారణం ఏమిటి? ఆయుర్వేద ఔషధాల తయారీ కోసం గ్రామాలలో అవకాశాలు పెంచాలని ఆయన సూచిస్తున్నారు. బాబా రాం దేవ్ ఆయుర్వేద ప్రచారం బాగానే చేస్తున్నారు. దానివల్ల కలిగిన పరిణామం ఏమిటంటే ఆయన ఆయుర్వేద వ్యాపారం కొండంతలై పోవడం మాత్రమే. ప్రతికూల ప్రభావం ఏమిటంటే ఇతర వైద్య విధానాలను రాందేవ్ బాబా తూలనాడి జనాన్ని గందరగోళంలోకి నెట్టేయడం. విద్యార్హత సాధించిన వారు అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని ఆర్.ఎస్.ఎస్. నాయకుడు దాపరికం లేకుండానే అంగీకరించారు. పరిశ్రమల వ్యవస్థాపకులను ప్రోత్సహించాలన్నది ఆయన వాదన. ఆ ఆలోచన మంచి చెడ్డలు ఎలా ఉన్నా కుంటి నడక నడుస్తున్న ఆర్థిక వ్యవస్థలో అది పగటి కలగానే మిగిలిపోక తప్పదు. ప్రభుత్వం ఆర్థిక విధానాలను పునస్సమీక్షించుకోవాలని, స్వదేశీ ఉత్పత్తులు పెరగాలనీ, దిగుమతులు తగ్గించాలని, స్థానిక ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని ఆర్.ఎస్.ఎస్. దాని అనుబంధ సంస్థలు అంటున్నాయి. మోదీ సైతం ఇవే మాటలు వల్లిస్తున్నా ఆచరణలో అతికొద్దిమందికి సర్వ సంపదలూ దోచిపెట్టే ప్రక్రియే కొనసాగుతోంది. దీని గురించి హోసబలే ప్రస్తా వించకపోవడం గమనించాల్సిన అంశమే. దసరాకు సరిగ్గా ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేయడానికి ప్రబలమైన కారణం ఉండే ఉంటుంది. దసరా రోజు ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ సందేశం ఏ ధోరణిలో ఉంటుందో గమనించాలి.

ముందంజలోనే లులా

సాత్యకి చక్రవర్తి

బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల పోలింగ్ మొదటి రౌండ్‌లో మాజీ అధ్యక్షుడు, వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా ముందంజలోనే ఉన్నారని ఫలితాలు తెలియజేస్తున్నాయి. లాటిన్ అమెరికాలో అత్యధిక జనాభా కలిగిన దేశం బ్రెజిల్. ఇక్కడ 50 శాతం ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థి మొదటి రౌండ్‌లోనే గెలిచినట్టు ప్రకటిస్తారు. అయితే లులాకు 48.4 శాతం ఓట్లు లభించాయి. ఆయనతో పోటీ పడుతున్న ప్రస్తుత అధ్యక్షుడు జెయిర్ బొల్సొనరోకు 43.2 శాతం ఓట్లు లభించాయి. ఒపీనియన్ పోల్స్‌లో మాత్రం మొదటి రౌండ్‌లోనే లులా గెలుపొందుతారని అంచనా వచ్చింది. బొల్సొనరోకు అనుకున్న దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న బ్రెజిల్‌లో తీవ్రంగా ఓటర్ల మధ్య విభజన ఉన్నది. పోటీలో ఉన్న సైమన్ టిబెట్‌కు 4.3 శాతం ఇతర అభ్యర్థులకు 4.2 శాతం ఓట్లు లభించాయి. ఈ ఓట్లన్నీ మితవాద రాజకీయాలు అనుసరించేవారివేనని భావిస్తున్నారు. బొల్సొనరో, లులా మధ్యనే రెండో రౌండు, తుది ఎన్నికలు జరుగుతాయి. ఈసారి మరో 1.6 శాతం ఓట్లు అధికంగా లులాకు లభిస్తాయని వామపక్ష కార్యకర్తలు గట్టిగా చెప్తున్నారు.

ఇప్పటికే లాటిన్ అమెరికాలో అనేక దేశాలలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. లులా గెలుపు కొంచెం ఇబ్బందిగా ఉన్నప్పటికీ విజయం సాధిస్తారని అంచనాలు ఇప్పటికీ ఉన్నాయి. మరో నాలుగు వారాల్లో తుది ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల సమీకరణకు రెండు పక్షాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఒకవేళ లులా గెలుపొందినప్పటికీ తాము అంగీకరించబోమని బొల్సొనరోతో సహా ఆయన అనుచరులు చెప్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంలో పోలింగ్ సరైనది కాదని తాను అంగీకరించబోనని బొల్సొనరో అంటున్నారు. అయితే అంతర్జాతీయ పరిశీలకులు మొదటి రౌండు ఎన్నికలను జాగ్రత్తగానే పరిశీలించామని, ఓటర్లు స్వేచ్ఛగా, న్యాయంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని స్పష్టం చేశారు. అయినప్పటికీ బొల్సొనరో అనుచరులు లులా గెలుపును అంగీకరించే పరిస్థితులు లేవు. అందువల్ల లులా గెలిస్తే తప్పనిసరిగా దేశంలో తీవ్రంగా ఘర్షణలు జరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. 2003 నుండి 2010 వరకు లులా బ్రెజిల్ అధ్యక్షుడిగా పాలించారు. ఆయన హయాంలో అనేక ప్రజానుకూల కార్యకలాపాలను నిర్వహించి మిక్కిలిగా వారి ఆదరణ పొందారు. బొల్సొనరో అనుచరుడు మీడియాను, జర్నలిస్టులను అబద్ధాలకోరులని, సిగ్గులేనివారని దూషిస్తున్నారు.

సైనిక కెప్టెన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన బొల్సొనరో నాలుగేళ్ల పాలనలో దేశంలో తీవ్ర అలజడులు చోటు చేసుకున్నాయి. సమాజంలో ప్రశాంత పరిస్థితులు లేవు. మళ్లీ ప్రశాంత వాతావరణం ఏర్పడాలన్నా, ప్రజలు ఆనందంగా ఉండాలన్నా మళ్లీ లులా పాలన రావాలని విద్యార్థులతో సహా అన్ని తరగతుల ప్రజలు కోరుతున్నారు. బొల్సొనరో పాలన పెట్టుబడులకు, కళలు, సంస్కృతి, సైన్సు, విద్యారంగానికి తీవ్ర విఘాతం కలిగించిందని అరాచక ప్రభుత్వాన్ని అందించారని యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు వ్యాఖ్యానించారు. బొల్సొనరో కాలంలో అవినీతి కుంభకోణాలు అనేకం వెలువడ్డాయి. రాజకీయ నాయకులు, వాణిజ్య ఎగ్జిక్యూటివ్‌లు, అధికార యంత్రాంగం అవినీతి కుంభకోణాల్లో భాగస్వాములయ్యారు. బొల్సొనరో చివరికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం లక్ష్యంగా చేసుకొని వారిని కించపరిచే వ్యాఖ్యానాలు చేశారు. ఆయన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిమాని. ఆయన బాటనే నడుస్తాడు. లులా గెలిస్తే తాను అంగీకరించబోనని బొల్సొనరో నాలుగైదు నెలల క్రితమే ప్రకటించాడు. ఇది ఎన్నికల కమిషన్‌ను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బొల్సొనరోపై తొమ్మిది తీవ్రమైన నేరాలు నమోదయ్యాయి. ఆయన్ని అభిశంసిస్తూ సెనెట్ కమిటీ 1300 పేజీల నివేదికను రూపొందించి విడుదల చేసింది.

కర్ణాటక కాంగ్రెస్‌లో నూతన ఉత్తేజం

అరుణ్ శ్రీవాస్తవ

ప్రజా జీవనంలో స్వచ్ఛమైన నైతిక సూత్రాలకు కట్టుబడి యాత్రను కొనసాగిస్తూ ప్రజలను రాహుల్ ఉత్తేజపరుస్తున్నందునే యాత్ర విజయవంతం అవుతోందని భావిస్తున్నారు. కర్ణాటకలో రాహుల్ యాత్రను కించపరచాలని బీజేపీ నాయకత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ప్రజా జీవనంలో స్వచ్ఛత ఉండాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని రాహుల్ ప్రచారం చేస్తున్నారు. కర్ణాటకలో గత నాలుగు రోజులుగా అవినీతికి వ్యతిరేకంగా ఆయన ప్రచార యాత్ర సాగుతోంది. ప్రత్యేకించి భజరంగ్‌దళ్, రామ్‌సేన, విహెచ్‌పి సంస్థలు ప్రజల మధ్య మతాల విభజనకు ప్రోత్సహిస్తున్నాయని రాహుల్ తీవ్రంగా విమర్శిస్తున్నారు.

కర్ణాటకలో రాహుల్ గాంధీ జోడో యాత్రకు మంచి స్పందన లభించింది. దీంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో నూతన ఉత్తేజం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో ముఖ్యులైన సిద్ధ రామయ్య, శివ కుమార్‌లు కలిసి రాహుల్ యాత్రలో పాల్గొంటూ తాము ఐక్యంగా పనిచేస్తామన్న సంకేతాలను పంపుతున్నారు. సెప్టెంబరు 30వ తేదీన కర్ణాటకలో ప్రవేశించిన రాహుల్ యాత్రను కొనసాగిస్తున్నారు. అయితే, ఈ యాత్రకు పెద్దగా స్పందన లేదని ప్రధాన స్రవంతి మీడియాతో పాటు చాలా టీవీ చానల్స్ కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాన్ని చేస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ పరిపాలన ఉంది. ఈ ప్రచారం బీజేపీకి అనుకూలంగానే కనిపిస్తోంది. 2023లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కర్నాటక యాత్ర కేరళలో సాగిన యాత్రకు ధీటుగానే ఉన్నదని, విజయవంతంగానే జరుగుతున్నదని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రజల నుంచి ఇంత గొప్ప స్పందన ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఊహించలేదు. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని రాహుల్ మరింత దృఢంగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ వర్గాలు ఆశిస్తున్నాయి.

నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత మహోత్సవం నిర్వహిస్తున్నారు. మోదీ పాలనలో కొత్తరకం నైతిక రాజకీయాలు అమలు చేయడం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాలలో నైతిక విలువలను తప్పక పాటించాలని బోధిస్తున్న మోదీ ఆచరణ అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. మోదీ చెప్పే రాజకీయ విలువలు దేశంలో నెలకొన్న రాజకీయ వాతావరణానికి భిన్నంగా ఉన్నవి. రాహుల్ గాంధీ తన యాత్రలో నైతిక రాజకీయాలనే పాటిస్తున్నాడని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక దశలో రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు కలుగుతుందనేంతగా అశోక్ గెహ్లోత్, సచిన్ పైలట్ మధ్య సంబంధాలు నెలకొన్నాయి. రాజస్థాన్‌లో పరిస్థితులు ఇబ్బంది కరంగానే ఉన్నప్పటికీ రాహుల్ తన యాత్రను కొనసాగిస్తున్నారు. సచిన్, గెహ్లోత్ మధ్య రాజీ కుదిర్చేందుకు రాహుల్ ఢిల్లీకి వెళ్లకుండానే పట్టుదలతో యాత్రను నిర్వహిస్తున్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయి ఉన్నట్లయితే అది కాంగ్రెస్‌కు తీవ్రంగా హాని కలిగించేది.

ప్రజా జీవనంలో స్వచ్ఛమైన నైతిక సూత్రాలకు కట్టుబడి యాత్రను కొనసాగిస్తూ ప్రజలను రాహుల్ ఉత్తేజపరుస్తున్నందునే యాత్ర విజయవంతం అవుతోందని భావిస్తున్నారు. కర్ణాటకలో రాహుల్ యాత్రను కించపరచాలని బీజేపీ నాయకత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ప్రజా జీవనంలో స్వచ్ఛత ఉండాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని రాహుల్ ప్రచారం చేస్తున్నారు. కర్ణాటకలో గత నాలుగు రోజులుగా అవినీతికి వ్యతిరేకంగా ఆయన ప్రచార యాత్ర సాగుతోంది. ప్రత్యేకించి భజరంగ్‌దళ్, రామ్‌సేన, విహెచ్‌పి సంస్థలు ప్రజల మధ్య మతాల విభజనకు ప్రోత్సహిస్తున్నాయని రాహుల్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొంతకాలంగా ఆర్ఎస్ఎస్, బీజేపీలు కొనసాగిస్తున్న మత విభజన, విద్వేష రాజకీయాల పట్ల కర్ణాటక ప్రజలు విసిగిపోయి ఉన్నారని రాహుల్ అంటున్నారు. ఇలాంటి దుష్ప్రచారానికి దూరంగా ఉన్నవారు ఈ సంస్థలను తీవ్రంగా విమర్శిస్తున్నారు.

సమ్మిళిత సమాజాన్ని కోరుకున్న గొప్ప గురువు బసవన్న జీవించిన నేలన సంఘ్ పరివార్ శక్తుల చర్యల పట్ల ప్రజలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. సోదర భావంతో సామాజిక సామరస్యంతో నిర్ణయాత్మక రాజకీయాలలో పాల్గొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. బసవన్న బోధించిన సూత్రాల వెలుగులో జోడో యాత్ర సాగుతున్నదని కాంగ్రెస్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో హిజాబ్ సమస్యపై దుష్ట రాజకీయాలు చేయడంపైన తీవ్ర విమర్శలు వచ్చాయి. రాష్ట్రంలో ముస్లింలు సంప్రదాయంగా సమాజంలో జీవిస్తున్నారు. అలాంటి జీవనాన్ని బీజేపీ ప్రభుత్వ హయాంలో ధ్వంసం చేస్తున్నారు. నైతిక రాజకీయాలను అనుసరించటం గొప్ప ఆచరణ అవుతుంది. ఇందుకు కఠినమైన కసరత్తు అవసరం. మోదీ ఢిల్లీలో అధికార పీఠం ఎక్కడానికి ముందు ఆయన నైతిక సూత్రాలను, నీతివంతమైన రాజకీయాలను తాను అనుసరిస్తానని వాగ్దానం చేశారు. అధికారం చేపట్టిన తరవాత మోదీ ఆచరణ భిన్నంగా ఉంది. బీజేపీ అలాంటి విలువలకు, నైతిక సూత్రాలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చింది. ఇప్పుడు నూతన భారత రాజ్యాన్ని మోదీ చక్రవర్తిగా ఏలుతున్నారు. బీజేపీ పాలనలో నైతిక పతనం చెప్పనలవి కాదు. నైతిక సూత్రాలను పాటించాలని బీజేపీ నాయకులెవరూ ఆలోచించటం లేదు. ఏదో విధంగా అధికారాన్ని దక్కించుకోవాలన్నదే ఆర్ఎస్ఎస్ బలమైన కోరిక. అవినీతి, ద్వేషం, హింస ఆధారంగా నూతన భారతాన్ని నిర్మించడానికి మోదీకి ఆర్ఎస్ఎస్ గట్టి అండగా నిలిచింది. ఒక్క కర్ణాటకలోనే కాదు దేశ వ్యాప్తంగా ఇదే విధానాన్ని ఆర్ఎస్ఎస్ అనుసరిస్తోంది.

కర్ణాటకలో 21 రోజుల యాత్ర అనంతరం రాహుల్ తెలంగాణాలో ప్రవేశిస్తారు. ఈ నెల 19న బళ్లారిలో బహిరంగ సభలో మాట్లాడిన అనంతరం రాహుల్ తెలంగాణ చేరుకుంటారు. ప్రతి రోజూ 15 నుంచి 20 వేల మంది యాత్రలో పాల్గొంటున్నారని కర్నాటక కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రజలు మహాత్మాగాంధీ సబర్మతి నుంచి జరిపిన దండి యాత్రను గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

ఓ-మెయిల్

మహిళా హక్కుల్ని గౌరవించే దిశగా సుప్రీం తీర్పు

వైవాహిక స్థితితో సంబంధం లేకుండా మహిళ చట్టబద్ధంగా అబార్షన్‌పై నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు అభినందనీయం. ఇంతవరకూ 20 నుండి 24 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునే హక్కు అవివాహితులకు లేదు. ఒక్క వివాహితులకు, ఆరోగ్యపరమైన అవసరాలు ఉన్నవారికే పరిమితమైన హక్కుని అందరికీ కల్పించడం ద్వారా మహిళకున్న నిర్ణయాధికారాన్ని సుప్రీం సమర్థించింది. చట్టపరమైన అడ్డంకుల్ని తొలగించింది. తద్వారా తన శరీరంపై, గర్భ ధారణ పట్ల తన స్వీయాధికారంపై మహిళ నిర్ణయం తీసుకోవచ్చు. దేశంలో జరిగే అబార్షన్‌లలో సగభాగం దొంగచాటుగా, సరైన వైద్య నిపుణుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్నాయి. చట్టం ఒప్పుకోని సమయంలో వక్రమార్గంలో జరుగుతున్న వీటివల్ల తల్లి ప్రాణాలకు ముప్పు ఎక్కువ కావడమే కాకుండా అవమాన భారం, ఆర్థిక భారం వారిపై పడుతుంది. ఇప్పుడీ తీర్పు ద్వారా అలాంటి సంఘటనలు కూడా తగ్గు తాయి. గర్భవిచ్ఛిత్తికై నిర్ణయించుకున్న వంచితులైన మైనర్ బాలికల పేర్లు, అవివాహితల పేర్లు బహిరంగపరచే అవసరం వైద్యులకు లేనందున వారి వివరాలు గోప్యంగా ఉండి వారి హక్కు పరిరక్షించినట్లవు తుంది. విస్తృతార్థంలో చూస్తే ఈ తీర్పు మహిళలపై వివక్షని, మళ్ళీ హక్కులు పొందడంలో వారి మధ్యనే చట్టం కల్పించిన అసమానతల్ని సరైన దృక్పథంతో చూసి



నట్టే. సరిచేసినట్టే. వివాహిత కూడా తన అంగీకారంతో ప్రమేయం లేని అవాంఛిత గర్భాన్ని వద్దనుకునే హక్కుని ఈ తీర్పు ద్వారా సుప్రీం దఖలు పర్చింది. అయితే వైవాహిక అత్యాచారం (మారిటల్ రేప్) మన చట్టాల ప్రకారం నేరం కాదు. ఆ విషయం కోర్టు పరిశీలనలో ఉంది. ఏదిఏమైనా స్వేచ్ఛా సమాజం అంటూ డప్పు కొట్టుకునే అమెరికా కోర్టు అబార్షన్‌పై పరిమితులు విధించగా, మన దేశపు అత్యున్నత న్యాయస్థానం మహిళా హక్కుల దారిలో ఉన్న అడ్డం కుల్ని ఒక్కొక్కటిగా తొలగిస్తూ రావడం గర్వకారణం. ప్రగతిశీలకం. ఆ స్ఫూర్తిని, మహిళాలోకం పట్ల బాధ్యతను ప్రభుత్వాలు, పౌరసమాజం అందిపుచ్చుకోవాలి.

డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, 9440836931.

జైశంకర్.. ఎవరి కోసం ఈ వ్యాఖ్యలు?

ఎం. కోటేశ్వరరావు

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ వద్ద ఉన్న ఎఫ్-16 యుద్ధ విమానాలను మెరుగుపరుస్తున్నట్లు అమెరికా చెబితే నమ్మేంత వెర్రి వెంగళప్పలు ఎవరూ లేరని మన విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు. అది నిజమే! అమెరికా పర్యటనలో భాగంగా సెప్టెంబరు 25 ఆదివారం వాషింగ్టన్ నగరంలో భారతీయుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ చేసిన వ్యాఖ్యలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అమెరికా గురించి జైశంకర్ లేదా మన పాలకులకు ఎప్పుడు, ఎలా జ్ఞానోదయమైందో తెలుసుకొనే హక్కు దేశ పౌరులందరికీ ఉంది. నిజంగా బుద్ధి వికసించిందా లేక ప్రశ్నించేవారిని, అమెరికా వైఖరిని బహిరంగంగా సమర్థించలేని కాషాయ దళాలను సంతుష్టీకరించేందుకు, ప్రచార అవసరార్థం అలా మాట్లాడారా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఆ మరుసటి రోజే అదే అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో కలసి ఉమ్మడిగా విలేకర్ల సమావేశంలో భద్రతా అంశాలకు సంబంధించి అమెరికా ఎంతగానో అంతర్జాతీయ వైఖరితో వ్యవహరిస్తోందని అదే నోటితో జై శంకర్ ప్రశంసలు కురిపించటం ఎవరిని వెంగళప్పలను గావించేందుకు? నలభై ఐదు కోట్ల డాలర్ల విలువ గల ఎఫ్-16 విమానాలకు అవసరమైన మెరుగుదల, పరికరాలకు సంబంధించి అమెరికా-పాక్ మధ్య ఒప్పందం కుదిరింది. వాషింగ్టన్ సభలో దీనికి సంబంధించిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ చివరకు ఒకరోజు ఎవరైనా వచ్చి ఉగ్రవాద నిరోధం కోసమే ఇదంతా అని చెబుతారు, మీరు చెబుతున్నది ఎఫ్-16 విమానం గురించి కనుక, వాటిని ఎక్కడ మోహరిస్తారో, వాటి ఉపయోగం, సామర్థ్యం గురించి అందరికీ తెలిసిందే. ఇలాంటి మాటలు చెప్పటం ద్వారా మీరు (అమెరికా) ఎవరినీ వెంగళప్పలను చేయలేరు" అన్నారు. మరో ప్రశ్నకు బదులిస్తూ పూర్వపు సోవియట్ తరవాత రష్యాతో ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగా 1965 నుంచి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు మన దేశానికి అమెరికా ఎలాంటి మిలిటరీ పరికరాలను విక్రయించలేదని, దీనికి రెండు వైపుల నుంచి కారణాలున్నాయని, అణు ఒప్పందంతో ఈ పరిస్థితి మారిందన్నారు. ఇప్పుడు మనం అనేక అమెరికా విమానాలు, హెలికాప్టర్లను వాడుతున్నామని, రెండు దేశాల సంబంధాలు ఇంకా పెరుగుతాయని చెప్పారు.

భారత్-పాక్‌లతో సంబంధాల అంశంలో ఒకదానితో మరొక దానికి సంబంధం లేదని, దేనికదేనంటూ రెండు దేశాలూ తమకు కావలసినవేనని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ చెప్పాడు. రెండింటితో అవసరాలు వేర్వేరన్నాడు. ఉగ్రవాద నిరోధానికి కృషి చేయటం లేదంటూ డోనాల్డ్ ట్రంప్ 2018లో పాకిస్తాన్‌కు సాయం నిలిపినట్లు ప్రకటించిన తరవాత ఇప్పుడు ఉగ్రవాద నిరోధానికి అనే సాకుతో బైడెన్ యుద్ధ విమానాల ఒప్పందం కుదుర్చుకున్నాడు. అప్పటికీ ఇప్పటికీ మారిన పరిస్థితులు ఏమిటో చెప్పటం లేదు. తాము ఇప్పుడు చేస్తున్న సాయంతో ఇప్పటికే పాక్ వద్ద ఎనభైకి పైగా ఉన్న ఎఫ్-16 విమానాలు లేదా వాటి ఆయుధ సామర్థ్యం పెంచటం లేదని మనలను నమ్మించేందుకు అమెరికా చూస్తున్నది. ఇవి యుద్ధాలకు తప్ప ఉగ్రవాదుల నిరోధానికి పనికి వచ్చేవి కాదు. 2019లో బాలాకోట్ దాడుల తరవాత పాకిస్తాన్ వాటిని మన దేశం మీద మోహరించింది. ఒక విమానాన్ని మన దళం కూల్చివేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విమానాల ద్వారా మాత్రమే సంధించే ఆధునిక క్షిపణి శకలాలను తరవాత మన మిలిటరీ ప్రదర్శించింది.

ఈ ఉదంతాల తరవాత ఈ ఏడాది జరిగిన సంఘటనకు తాజా ఒప్పందానికి

సంబంధం ఉందా అన్నదాన్ని కూడా చూడాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి 9న మన దేశం రష్యా భాగస్వామ్యంతో రూపొందించిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణిని వదిలింది. అది నలభై వేల అడుగుల ఎత్తులో 124 కిలోమీటర్లు వెళ్లి పాకిస్తాన్‌లోని చన్ను అనే పట్టణ సమీపంలో పడింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దాని గురించి పాకిస్తాన్ వెల్లడించిన తరవాతనే మన దేశం స్పందించి సాంకేతిక లోపంతో వచ్చి మీ గడ్డమీద పడిందని చెప్పింది. తరవాత మరొక ప్రకటనలో మానవ తప్పిదమని పేర్కొన్నది. ఆరు నెలల తరవాత ముగ్గురు వైమానిక దళ సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించినట్లు ప్రకటించింది. దీన్ని అంగీకరించని పాకిస్తాన్ ఈ ఉదంతం మీద ఉమ్మడి విచారణ జరపాలని ఇది అనధికారికంగా వదిలినదా నిజంగా తప్పిదమా అన్నది తేల్చాలని కోరుతోంది.

అమెరికా తన వ్యూహంలో మన దేశాన్ని ఇరికించేందుకు 1947 నుంచి చూస్తున్నది. చైనాను దెబ్బతీసేందుకు బలమైన సాధనంగా మన దేశం, పశ్చిమాసియాలో తన ఎత్తుగడల అమలుకు పాకిస్తాన్ పనికి వస్తుందన్నది దాని అంచనా. అందుకోసం రెండు దేశాలనూ చెప్పుచేతల్లో ఉంచుకొనేందుకు చూసింది. ఇప్పుడు కూడా వేర్వేరు అంశాలతో అవసరం ఉందని చెప్పటం దానిలో భాగమే. పాక్ భుజం మీద తుపాకి పెట్టి మనలను లొంగదీసు కోవాలని చూసింది. కశ్మీరు ఆక్రమణకు పాక్‌ను ప్రోత్సహించటం, తరవాత ఉగ్రవాదులను మన మీదకు వదలటం, కశ్మీరులో చిచ్చు ఇవన్నీ దానిలో భాగమే. మరోవైపు అఫ్గానిస్తాన్‌లో అమెరికా పథకాలకు పాకిస్తాన్ ప్రధాన సాధనంగా తాలిబాన్ల సృష్టి, శిక్షణకు కేంద్రంగా మారిన సంగతి తెలిసిందే. మన పాలకవర్గం తనకు ప్రయోజనం కలిగించే విదేశీ, స్వదేశీ విధానాలకే ప్రాధాన్యత ఇవ్వటం, సొంతంగా తాము కూడా ఎదిగేందుకు సోవియట్‌తో సంబంధాలే మెరుగు అని భావించిన కారణంగానే అది ఉనికిలో ఉన్నంత వరకు అమెరికాకు అవకాశం దొరకలేదు. దాని పతనం తరవాత అమెరికాకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ లబ్ధి పొందవచ్చని భావించి మరొక మార్గం లేకపోవటంతో ఆ వైపు మొగ్గింది. ఎప్పుడైతే ఇది జరిగిందో తనకు కావాల్సిన భారత్ దొరికిన తరవాత పాకిస్తాన్‌తో సంబంధాలను కొనసాగిస్తూనే మన దేశంలో ఉన్న పాక్ వ్యతిరేకతను గమనంలో ఉంచుకొని తన ఎత్తుగడలను మార్చుకుంది. మనకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు నమ్మించేందుకు చూసింది. దీంతో ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో మన పాలకవర్గం అనుసరించిన ఎత్తు గడను తరవాత పాక్ అనుసరిస్తున్నది. అమెరికాను వ్యతిరేకించే చైనాకు దగ్గర కావటం దానిలో భాగమే. చైనాకు పాకిస్తాన్ అవసరం ఉంది కనుక వచ్చిన అవకాశాన్ని అది అందిపుచ్చుకుంది. ఇది కొత్త పరిణామాలను ముందుకు తెచ్చింది. ఇప్పుడు అమెరికా అవసరాలకు భారత్-పాకిస్తాన్ రెండూ అవస రమే గనుక, మన దేశం తమ బంధం నుంచి తప్పుకొనే అవకాశాలు లేకుండా బిగింపు పూర్తైనట్లు భావిస్తున్న కారణంగా, అంతర్జాతీయ అవసరాల రీత్యా ఇప్పుడు పాకిస్తాన్‌కు అమెరికా తిరిగి తన సాయాన్ని అందిస్తున్నది. నిజానికి దాన్ని ఎన్నడూ వదిలిపెట్టలేదు. ఇప్పుడు పాకిస్తాన్‌ను పటిష్టపరచ టాన్ని ఎలా చూడాలి. ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థం పేరుతో భారత్ తమ కూటమిలో చేరనందుకు గుర్రుగా ఉన్న అమెరికా దాన్నే గనుక కొనసాగిస్తే మీ ఇష్టం అని పరోక్షంగా హెచ్చరించటం కూడా కావచ్చు. మోదీ దాన్ని తట్టుకొని నిలబడగలరా? ఇది మన దేశం మీద మాత్రమే ఒత్తిడి అనుకుంటే పొరపాటు, పాకిస్తాన్‌పై చైనా ప్రభావం పెరగకుండా చూసుకోవటం కూడా దీని వెనుక దాగి ఉంది. అమెరికా తన ప్రయోజనాలకే ఎల్లవేళలా పెద్ద పీట వేస్తుంది అని మరచిపోరాదు. ముందే చెప్పినట్లు అటు అమెరికా ఇటు చైనా మద్దతు, సాయం పొందేందుకు పాక్ పాలకవర్గం చూస్తున్నది.

ఎఫ్-16 విమానాలను ఉగ్రవాద నిరోధం కోసం అని అమెరికా ఎందుకు చెబుతున్నది? పాకిస్తాన్‌కు చేస్తున్న సాయాన్ని సమర్థించుకొనేందుకు చెబుతున్న సాకు తప్ప మరొకటి కాదు. అమెరికా మనకు ఎఫ్-16 విమానాలు అమ్మితే పాక్ వైపు నుంచి కూడా జై శంకర్ మాదిరి స్పందనే వస్తుంది. మనం కూడా ఉగ్రవాదుల అణచివేతకే అని చెప్పగలమా?

మన పక్కలో బల్లెంలా ఉన్న పాకిస్తాన్‌కు అమెరికా సాయం చేస్తుంటే మౌనంగా ఎందుకు ఉన్నారనే ప్రశ్న సహజంగానే తన మద్దతుదార్ల నుంచే నరేంద్ర మోదీ సర్కార్‌కు ఎదురౌతుంది. పాకిస్తాన్ మీద విద్వేష ప్రచారంలో తలమునకలైన కాషాయ దళాలు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. బహుశా వారి కోసం జైశంకర్ గట్టిగా మాట్లాడినట్లు కనిపిస్తోంది. ఎవరి అవసరం వారిది. అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి నెడ్‌ప్రైస్ ఎలాంటి శషభిషలు లేకుండా సరళంగా సూటిగా చెప్పాడు. భారత్-పాకిస్తాన్లతో భిన్న మైన ప్రాంతాల్లో భిన్నమైన ప్రయోజనాలున్నట్లు చెప్పటమంటే రెండు దేశాలను ఎక్కడ ఎలా అవసరమైతే అక్కడ అలా ఉపయోగించుకుంటామని చెప్పటమే. గతంలో పాకిస్తాన్ అలా ఉపయోగపడిన చరిత్ర ఉంది. మన దేశాన్నీ అదే బాటలో నడిపిస్తారా? ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా రష్యా నుంచి చౌక ధరలకు చమురును తెచ్చుకుంటున్న మన మోదీ సామరకండ్ షాంఘై సహకార సంస్థ సమావేశాల్లో ఇది యుద్ధాల యుగం కాదంటూ పుతిన్‌కు చెప్పి అమెరికాను సంతుష్టీకరించేందుకు తెరతీశారు. ఆరు నెలల్లో వారు వీరవుతారు అంటే ఇదేనా!

విద్యలో పెట్టుబడుల ద్వారానే

బాలకార్మిక వ్యవస్థ, దోపిడీ నిర్మూలన

రాంచీ: జార్ఖండ్‌లోని గనుల్లో బాల కార్మికురాలిగా పని చేస్తూ ఆరేళ్ల కిందట ఆ పని నుంచి విముక్తి పొందిన 20 ఏళ్ల యువతి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నడుంకట్టింది. ఐక్యరాజ్య సమితి దృష్టిని ఆకర్షించింది. విద్య వ్యవస్థ ద్వారానే ప్రపంచ వ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ, దోపిడీలు అంతమవుతాయంటూ ఆదిశగా పెట్టుబడిదారులు విద్యారంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని ప్రపంచ వేదికలపై ఆ యువతి చేసిన ప్రసంగం దేశం దృష్టిని ఆకర్షించింది. ఆ యువతి ప్రయాణంపై పీటీఐ ఒక కథనాన్ని ప్రచురించింది. పూర్తి వివరాల్లోకి వెళితే రాష్ట్రంలోని కోడెర్మాలోని మైకా గనిలో బాల కార్మికురాలిగా ఉన్న కాజోల్ అనే యువతి ఆరేళ్ల క్రితం నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి ఏర్పాటు చేసిన బచ్‌పన్ బచావో ఆందోళన సమితి సహకారంతో బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొందింది.. తాను విముక్తి పొందినట్టు తన చుట్టూ ఉన్న బాల కార్మికులందరినీ విముక్తం చేయాలన్న ధృఢమైన సంకల్పంతో ఆమె చేసిన కృషి అభినందనీయం. తనముందున్న లక్ష్యం చాలా సవాళ్లతో కూడుకున్నదైనా

యూఎన్‌వోలో గళమెత్తిన జార్ఖండ్ యువతి

ధృఢమైన సంకల్పంతో ముందుకు కదిలించి. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలన్న పట్టుదల ఆమెను ముందుకునడిపించింది. రాష్ట్రంలో ఎక్కడ బాల కార్మికులు పని చేస్తున్నట్టు తెలిసినా అక్కడ ప్రత్యక్షమవుతోంది. కాజల్ మాట్లాడుతూ... కైలాశ్ సత్యార్థి కృషి, సహకారంతో కోడెర్మాలోని డోమ్‌చాంచ్ నుంచి ఆరేళ్ల క్రితం తాను బాలకార్మికురాలిగా బయటపడినట్టు తెలిపారు. ప్రస్తుతం డోమ్‌చాంచ్‌లోని ఒక కళాశాలలో చదువుతున్నట్టు చెప్పారు. పోలీసు అధికారిణిగా మారి బాలకార్మిక వ్యవస్థ, చిన్నారుల అక్రమ రవాణాలపై కఠిన చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. చిన్న వయసులో చాలా మంది చిన్నారులు బలవంతంగా బాలకార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, చదువు అవసరం లేదనే పెద్దల మనస్తత్వాల కారణంగా బాల కార్మిక వ్యవస్థలోకి నెట్టి వేయబడుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో తాను బాలల మండలిని ఏర్పాటు చేసి బాలకార్మిక వ్యవస్థకు

వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. మూడు బాల్య వివాహాలను నిలువరించానని, 35 మంది బాలబాలికలను గని యజమానుల బారి నుంచి రక్షించినట్లు చెప్పారు. నిరక్షరాస్యత పేదరికం అనేవి సమాజ అభివృద్ధికి ప్రతిబంధకాలు అవుతున్నాయని, ఇవే బాలకార్మిక వ్యవస్థ సహా ఇతర రుగ్మతలకు కారణమని పేర్కొన్నారు. ఇటీవల ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ దేశాల నేతల ముందు విద్యారంగంలో పెట్టుబడులు పెట్టాలని, కర్మాగారాలు, ఇతర వ్యాపార సముదాయాల్లో బాల కార్మికులను వినియోగించకుంగా కఠినమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పినట్టు తెలిపారు. విద్యరంగంలో పెట్టుబడులతో జీవనోపాధి మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. తన పర్యటనలో ప్రపంచవ్యాప్తంగా పిల్లలను ప్రభావితం వివిధ సమస్యలపై అవగాహన ఏర్పడిందని తెలిపారు. అంతర్జాతీయంగా చాలా మంది యువ కార్యకర్తలతో పరిచయాలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం తనకు టాంజానియా, ఇరాన్, వివిధ ఆఫ్రికన్ దేశాలకు చెందిన స్నేహితులు ఉన్నారని ఆనందం వ్యక్తం చేసింది. కాజల్ పోరాటంపై స్పందించిన కైలాశ్ సత్యార్థి మాట్లాడుతూ...బాలకార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా చెర నుంచి చిన్నారులకు రక్షించేందుకు కాజల్ చేస్తున్న పోరాటం తమకు గర్వకారణమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాల కార్మికులను విముక్తి చేసి వారందరికీ విద్య, సామాజిక భద్రత అందించకపోతే ఆ పిల్లల కష్టాలకు అధికారంలో ఉన్న నేతలే బాధ్యత వహించాలని ఐక్యరాజ్యసమితిలో కాజల్ చేసిన ప్రసంగం దేశానికి గర్వకారణమని అభినందించారు.

విషమంగానే ములాయం ఆరోగ్యం

గురుగ్రామ్: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్‌ను స్థానిక మేదాంత హాస్పిటల్‌లోని "క్రిటికల్ కేర్ యూనిట్"లో చేర్చామనీ, సమగ్ర నిపుణుల బృందం చికిత్స చేస్తోందని ఆసుపత్రి సోమవారం తెలిపింది. ములాయం సింగ్ యాదవ్ ఆగస్టు 22 నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జులైలో కూడా ఆయన ఆసుపత్రిలో చేరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన కుమారుడు అఖిలేష్ యాదవ్, కోడలు డింపుల్ యాదవ్, సోదరుడు శివపాల్ సింగ్ యాదవ్ ఆదివారం ఆసుపత్రిలోని ములాయంను సందర్శించారు. కొంతమంది పార్టీ కార్యకర్తలు కూడా ఆయన పరిస్థితి గురించి ఆరా తీసేందుకు ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్నారు. 'ములాయం సింగ్ యాదవ్ ఐసీయూలో చేరారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. ఆసుపత్రికి రావద్దని అందరికీ వినయపూర్వకమైన విన్నపం. ఆయన ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తాం' అని సమాజ్‌వాదీ పార్టీ ఆదివారం తన అధికారిక ట్విట్టర్‌లో తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా అఖిలేశ్ యాదవ్‌తో మాట్లాడి ములాయం ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన చికిత్సకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తానని అఖిలేశ్‌కు మోదీ హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రేపటి నుంచి జైశంకర్ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బుధవారం నుంచి న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల్లో వారం పాటు పర్యటించనున్నారు. న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి నానాయా మహుతా, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌లతో విడివిడిగా చర్చల సందర్భంగా ఆయన రెండు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షిస్తారు. మంత్రిగా తన మొట్టమొదటి న్యూజిలాండ్ పర్యటనలో, జైశంకర్ గురువారం న్యూజిలాండ్ ప్రధాన మంత్రి జసిందా ఆర్డెర్న్‌తో కలిసి భారతీయ కమ్యూనిటీలోని సభ్యులను సత్కరిస్తారు. "న్యూజిలాండ్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను స్మరించుకోవడానికి, ప్రదర్శించడానికి ఇద్దరు నాయకుల భారతదేశ ఏ75 పోస్టల్ స్టాంపులను విడుదల చేస్తారు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. జైశంకర్ 'మోదీఏ20: డ్రీమ్స్ మీట్ డెలివరీ' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. సిక్కు కమ్యూనిటీతో ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేసే పుస్తకాన్ని కూడా ఈ సందర్భంగా విడుదల చేయనున్నారు. అంతేకాకుండా జైశంకర్ అనేక ఇతర న్యూజిలాండ్ మంత్రులతో కూడా సమావేశం కానున్నారు. న్యూజిలాండ్‌లో మంత్రి అయిన మొదటి భారతీయ సంతతి వ్యక్తి రాధాకృష్ణన్. ఇంకా, ఆయన విద్యార్థులతో సహా పార్లమెంటేరియన్లు, వ్యాపార సంఘం సభ్యులతో పాటు భారతీయ ప్రవాసులతో సంభాషించనున్నారు. వెల్లింగ్టన్‌లో జైశంకర్ హైకమిషన్ ఆఫ్ ఇండియా నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తారు. ఆస్ట్రేలియాలో కాన్‌బెర్రా, సిడ్నీలను జైశంకర్ సందర్శించనున్నారు.

మహిషాసురుడిగా మహాత్ముడు

గాడ్సే భక్తుల దుశ్చర్య!

కోల్‌కతా: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పెద్ద పెద్ద వేదికలను ఏర్పాటు చేసి కనకదుర్గ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. అయితే, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన ఓ పండల్ కొత్త వివాదానికి తెరలేపింది. ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహంపై నిరసన వ్యక్తం కావడంతో పోలీసుల సూచన మేరకు విగ్రహాన్ని నిర్వాహకులు మార్చేశారు. నైరుతి కోల్‌కతాలోని రుబీ క్రాసింగ్ వద్ద అఖిల భారత హిందూ మహాసభ నవరాత్రి పండల్‌ను ఏర్పాటు చేసింది. ఈ వేదికపై కనకదుర్గమ్మ రాక్షసులను చంపుతున్నట్లుగా ఉన్నది. అయితే, మహిషాసురుడిగా గాంధీని ఉంచడం వివాదాస్పదమైంది. దీనిపై అనేక సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. గాంధీని ఇలా రాక్షసుడిగా చూపడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం హోంశాఖ దృష్టికి వెళ్లింది. పోలీసుల ఆదేశాలతో ఆఘమేఘాల మీద గాంధీజీని అసురుడిగా చూపించిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని అఖిల భారత హిందూ మహాసభ నిర్వాహకులు మార్చేశారు.

దీనిపై పశ్చిమ బెంగాల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు చంద్రచూడ్ గోస్వామి మాట్లాడుతూ.. తాము గాంధీని అసురుడిగానే భావిస్తామని, అందుకే అలా విగ్రహం ఏర్పాటు చేశామని వాదించారు. విగ్రహాన్ని మార్చాలని హోంశాఖ నుంచి తమపై తీవ్ర ఒత్తిడి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విగ్రహాన్ని మార్చినట్లు చెప్పారు. వీరి చర్యను రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఖండించాయి. ఇది ముమ్మాటికీ జాతిపితను అవమానించడమే అని తృణమూల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ అన్నారు. హిందూ సంస్థలు ఇలా గాంధీజీని అవమానించడంపై బీజేపీ ఇంకా ఏం మాట్లాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూపీలో దళిత ప్రొఫెసర్‌పై కక్షసాధింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో యోగి సర్కార్ అండదండలతో హిందూ మతతత్వ గ్రూపులు చెలరేగిపోతున్నాయి. వర్సిటీల్లో పనిచేస్తున్న దళిత ప్రొఫెసర్లు, లెక్చరర్లను లక్ష్యంగా చేస్తూ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నాయి. 'దుర్గా నవరాత్రి' గురించి వారణాసి వర్సిటీలో ఒక దళిత ప్రొఫెసర్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ హిందూమతతత్వ గ్రూపులు దుమారం రేపాయి. ఏబీవీపీ, బీజేపీ నాయకుల బెదిరింపులు, ఒత్తిడికి తలొగ్గిన వారణాసి వర్సిటీ పాలకవర్గం, మహాత్మా గాంధీ కాశీ విద్యాపీఠ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మిథిలేశ్ కుమార్ గౌతమ్‌ను ఉద్యోగంలో నుంచి డిస్మిస్ చేసింది. "ముఖ్యంగా మహిళలకు ఒక సూచన చేయదలుచుకున్నా. నవరాత్రి సమయంలో ఉపవాసం ఉండటం కన్నా భారత రాజ్యాంగాన్ని, హిందూ కోడ్ బిల్లును చదవాలని వారికి సూచిస్తున్నా"నని సామాజిక మాధ్యమంలో సందేశాన్ని గౌతమ్ పోస్ట్ చేశారు. భయం, బానిసత్వం నుంచి మహిళలు విముక్తి పొందాలని ఆకాంక్షించారు. దీనిపై ఆర్‌ఎస్‌ఎస్ విద్యార్థి సంఘం ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న వారణాసి వర్సిటీ, ప్రొఫెసర్ గౌతమ్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసింది. వర్సిటీ చర్యపై ప్రొఫెసర్ స్పందిస్తూ, "భారత రాజ్యాంగం, హిందూ కోడ్ చదవాలని మహిళలకు సూచించటం తప్పా? మహిళా సాధికారతపై మాట్లాడటం నేరమా? కనీసం నా వైపు నుంచి వివరణ కోరకుండా... చర్యలు చేపట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూత్వ శక్తులు తెచ్చిన ఒత్తిడి, బెదిరింపులకు వర్సిటీ యాజమాన్యం తలొగ్గిందన్నారు. ఈ ఘటనపై వర్సిటీ రిజిస్ట్రార్ సునీతా పాండే మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రొఫెసర్ గౌతమ్ చేసిన వ్యాఖ్యలు వర్సిటీలో తీవ్ర దుమారం రేపాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆగ్రహంతో ఉన్నారు. వర్సిటీ అడ్మిషన్లు, పరీక్షల ప్రక్రియకు ఇది ఆటంకంగా మారింది. దీనిని పరిగణలోకి తీసుకుని వర్సిటీ నిబంధనల ప్రకారం గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గౌతమ్‌ను విధుల నుంచి తొలగించాము" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీలోకి ఆయన ప్రవేశాన్ని కూడా నిషేధించామని తెలిపారు.

ఇంకా న్యాయం జరగలేదు

లఖిపూర్ హింస మృతులకు రైతుల నివాళి: తికైత్

లఖింపూర్ ఖేరీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో జరిగిన హింసలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఇప్పటికీ న్యాయం జరగలేదని బీకేయూ నాయకుడు రాకేశ్ తికైత్ చెప్పారు. లఖింపూర్ ఖేరీ హింస జరిగి ఏడాది అయిన సందర్భంగా రైతులంతా సోమవారం ఇక్కడ సమావేశమయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడికి చేరుకున్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. గతేడాది టికునియా గ్రామంలో జరిగిన హింసను దేశం ఎప్పటికీ మర్చిపోదని, ఆ హింసలో 8 మంది ప్రాణాలు కోల్పోయారని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) అధికార ప్రతినిధి తికైత్ చెప్పారు. కౌడియాల ఘాట్ గురుద్వారలో జరిగిన మత కార్యక్రమాల్లో తికైత్ పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆయన ప్రకటించారు. ఈ దుర్ఘటనను దేశంలోని రైతులెవరూ మర్చిపోరని చెప్పారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో యోగి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తికైత్ విమర్శించారు. యూపీ సర్కారుకు అటు న్యాయవ్యవస్థపైనా, ఇటు రాజ్యాంగంపైనా విశ్వాసం లేదని, ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భవిష్యత్ కార్యాచరణపై విలేకరుల ప్రశ్నించగా ప్రజలు తమ వాణిని గట్టిగా వినిపించాలని పేర్కొన్నారు.

రైతులను అవమానించడమే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: లఖింపూర్ ఖేరీ హింసకు బాధ్యుడైన కేంద్రమంత్రి అజయ్ మిశ్రాను మోదీ సర్కారు ఇంకా కేబినెట్‌లో కొనసాగించడం... రైతులను అవమానించడమేనని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు సాగించిన ఉద్యమాన్ని సైతం అవమానిస్తోందని మండిపడింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రైతులను చంపిన కేసులో కేంద్ర మంత్రి తనయుడు పాత్ర ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. జోరు వానలో సైతం ప్రజలనుద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగించడంపై హర్షం వెలిబుచ్చారు. భారత్ జోడో యాత్ర ప్రాముఖ్యతను ఇది తేటతెల్లం చేస్తోందని వ్యాఖ్యానించారు. రాహుల్ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని చెప్పారు. రాహుల్ పాదయాత్రలో పాల్గొనే కాంగ్రెస్ ఓటర్లు పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటారని జైరాం రమేశ్ చెప్పారు. అక్టోబరు 17న పోలింగ్ నాటికి పాదయాత్ర బెంగళూరు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

దిల్లీలో విజృంభిస్తున్న డెంగీ

వెయ్యికి చేరువలో కేసులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో డెంగీ విజృంభిస్తున్నది. మొత్తం కేసుల సంఖ్య వెయ్యికి దగ్గరగా చేరింది. గత వారంలో కొత్తగా 412 డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన రేపుతున్నది. సెప్టెంబర్ నెలలో ఈ వ్యాధి బాగా వ్యాపించింది. సెప్టెంబర్ 28 నాటికి ఆ నెలలో మొత్తం 693 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి సెప్టెంబర్ 21 వరకు 525 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనంతరం వారం రోజుల్లోనే కొత్తగా 412 డెంగీ కేసులు వెలుగు చూశాయి. దీంతో దిల్లీలో మొత్తం డెంగీ కేసుల సంఖ్య 937కు చేరిందని మున్సిపల్ కార్పొరేషన్ సోమవారం విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఆగస్ట్‌లో కేవలం 75 కేసులు మాత్రమే నమోదైనట్లు తెలిపింది. అయితే డెంగీ వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి మరణాలు సంభవించలేదని ఆ నివేదిక వెల్లడించింది. కాగా, 2015లో కూడా దిల్లీలో డెంగీ విజృంభించింది. ఆ ఏడాది 10,600కు పైగా మొత్తం కేసులు నమోదయ్యాయి. 1996 నుంచి దిల్లీలో ఇంత భారీ సంఖ్యలో డెంగీ కేసులు నమోదు కావడం అదే మొదటిసారి.

మూగ విద్యార్థిని పిటిషన్‌పై...

కేంద్రానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: మాట్లాడలేకపోవడాన్ని (మూగతనం) లోపంగా చూసి తనకు మెడికల్ కోర్సులో ప్రవేశం కల్పించడానికి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఒక విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. వైద్య విద్య గ్రాడ్యుయేషన్ కోర్సుకు సంబంధించిన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్స్-1997ని సవాలు చేస్తూ విద్యార్థిని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వికలాంగుల హక్కుల చట్టం -2016 ప్రకారం 40 శాతం కన్నా ఎక్కువ మూగతనం ఉన్నా మెడికల్ కోర్సులో ప్రవేశం పొందడానికి నిరాకరించడంతో తాను వైద్య విద్యకు దూరమయ్యాయనని ఆ పిటిషన్‌లో పేర్కొంది. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వంతో పాటు నేషనల్ మెడికల్ కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. యువతి దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

మధ్యప్రదేశ్‌లో మళ్లీ రేగిన చిచ్చు

నవరాత్రి ఉత్సవాలపై రెండు వర్గాల ఘర్షణ

భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మళ్లీ చిచ్చు రేగింది. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండు వర్గాలకు సంబంధించిన వ్యక్తులు కర్రలతో దారుణంగా కొట్టుకున్నారు. రాష్ట్ర రాజధాని భోపాల్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న అగర్ జిల్లాలో ఈ ఘటన సంభవించింది. కంకర్ గ్రామంలోని దళిత వర్గానికి చెందిన వారు శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గా మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని అగ్ర వర్ణాలకు చెందిన వారు ఆదివారం తమపై దాడి చేశారని వారు ఫిర్యాదు చేశారు. మరో వర్గం భిన్నంగా ఆరోపించింది. గర్బా వేడుకలో భాగంగా ఇద్దరు అమ్మాయిలు అశ్లీల డ్యాన్స్ చేసినట్లు తెలిపారు. దీనిపై వాగ్వాదం కారణంగా గొడవ మొదలైందని చెప్పారు. రెండు పక్షాల ఆరోపణలపై ఫిర్యాదులు తీసుకున్నామనీ, ఇందుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. కర్రలతో కొట్టుకున్న వీడియో క్లిప్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గొడవకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి చెప్పారు.

దుర్గా మండపంలో మంటలు

ఐదుగురి మృతి... 64 మందికి గాయాలు

భదోహి (ఉత్తరప్రదేశ్): దుర్గాపూజ మండపంలో హాలోజన్ లైట్ వేడెక్కడం వల్ల మంటలు చెలరేగడంతో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు మృతి చెందగా, 64 మంది గాయపడ్డారని అధికారులు సోమవారం తెలిపారు. మండపం వద్ద డిజిటల్ షో జరుగు తుండగా ఆదివారం రాత్రి మంటలు చెలరేగడంతో నర్తువా గ్రామంలోని మండపం బూడిదగా మారింది. మంటలు చెలరేగిన సమయంలో మండపంలో 300 మందికి పైగా ఉన్నారు. వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. జిల్లా మేజిస్ట్రేట్ గౌరంగ్ రాఠీ మాట్లాడుతూ ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో మండపం వద్ద హాలోజన్ లైట్ వేడెక్కడంతో మంటలు చెలరేగాయని, దీంతో విద్యుత్ తీగకు మంటలు అంటుకున్నాయని తెలిపారు. వెంటనే మంటలు చెక్క పరంజా, టెంట్‌ను చుట్టుముట్టాయని చెప్పారు. అగ్నిప్రమాదానికి గల కారణాన్ని అదనపు డైరెక్టర్ జనరల్ రామ్ కుమార్ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్ధారించిందని, 67 మంది గాయపడ్డారని, వారిలో ముగ్గురిని గుర్తించామని, ఓ వ్యక్తి మరణించడగా, మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారని జిల్లా మేజిస్ట్రేట్ వివరించారు. ఔరై పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్పీ అనిల్ కుమార్ తెలిపారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

విశ్వాస పరీక్షలో నెగ్గిన

పంజాబ్ ఆప్ ప్రభుత్వం

చండీగఢ్: పంజాబ్‌లో భగవంత్ మాన్ నేతృత్వంలోని అమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం విశ్వాసపరీక్షలో నెగ్గింది. రాష్ట్రంలో అధికారంలోకి రావడంలో విఫలమైన బీజేపీ ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ఇటీవల ప్రయత్నించి విఫలమైంది. ఈ నేపథ్యంలో మాన్ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష పెట్టుకుని నెగ్గాడు. మాన్ ప్రభుత్వానికి అనుకూలంగా 93 మంది ఓటేయగా వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా నమోదు కాకపోవడం విశేషం. కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. తమ ప్రభుత్వం పట్ల ఆప్ ఎమ్మెల్యేల్లో విశ్వాసం ఉన్నదని స్పష్టం చేసేందుకు భగవంత్ మాన్ విశ్వాస పరీక్షను ఎదుర్కొన్నాడు. సోమవారం పంజాబ్ అసెంబ్లీలో స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్ విశ్వాస పరీక్ష నిర్వహించగా విశ్వాస తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శిరోమణి అకాలీదళ్, బీఎస్పీ కూటమి ఎమ్మెల్యేలు సభలోనే ఉన్నప్పటికీ విశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించలేదు. బీజేపీ ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరయ్యారు. విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా జలంధర్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్ బీజేపీ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. విశ్వాస పరీక్ష సందర్భంగా చర్చ దాదాపు రెండు గంటలపాటు కొనసాగింది.

విశ్వాస పరీక్షపై చర్చను ప్రారంభించిన సీఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అనేక పథకాలు తీసుకురానున్నమని చెప్పారు. తగినంత డబ్బు లేకపోవడంతో చెరకు రైతులు వరి పంట వైపు వెళ్తున్నారని విచారం వ్యక్తం చేశారు. చెరకు మద్దతు ధరను రూ.360 నుంచి రూ.380కు పెంచి ఖజానా నుంచి రూ.200 కోట్లు రైతులకు అందజేస్తామన్నారు. మొహాలీ విమానాశ్రయానికి భగత్‌సింగ్ పేరు మార్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీఎం చెప్పారు. హల్వారా విమానాశ్రయానికి కర్తార్ సింగ్ సారభా పేరు పెట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. పంజాబ్ ప్రజలు తమపై నమ్మకంతో అధికారం అప్పగించారని, వారి నమ్మకాన్ని నెరవేరుస్తామని చెప్పారు.

భారత్ జోడో యాత్రలో మావోయిస్టులు

బీజేపీ ఎంపీ

బెంగళూరు: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో మావోయిస్టులు భాగస్వామ్యమయ్యారని బీజేపీ రాజ్యసభ ఎంపీ లహర్ సింగ్ సిరోయా ఆరోపించారు. బీజేపీ పాలిత కర్ణాటకలో రాహుల్ యాత్రకు మంచి ఆదరణ లభిస్తోన్న తరుణంలో యాత్రలో మావోయిస్టులు, వారి సానుభూతి పరులు భాగమయ్యారో లేదో చెప్పాలని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కేంద్రం ఏజెన్సీలతో విచారణ కోరగలదా అంటూ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. రాష్ట్రంలో రాహుల్ గాంధీ యాత్ర ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ సభాపక్ష నేత సిద్ధరామయ్య సమాధానం చెప్పాలంటూ పది ప్రశ్నలు సంధించారు. యాత్రలో మావోయిస్టులు భాగస్వామ్యం కాలేదని నిరూపించుకోగలరా అని ప్రశ్నించారు. మావోయిస్టు సానుభూతి పరులు రాష్ట్రంలో కొన్ని మీడియా సంస్థలను ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ నేతలు నిధుల సమకూర్చారా లేదా అని నిలదీశారు. సిద్ధరామయ్య సీఎంగా ఉన్న తరుణంలో మావోయిస్టుల పట్ల కాంగ్రెస్ వైఖరి ఎలా ఉండేదో చెప్పాలని డిమాండు చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వానికి పీఎఫ్ఐ పట్ల సానుభూతి లేదా అంటూ వివిధ ప్రశ్నలు సంధించారు.

ఆదాయం పెంపుకోసం

ఎయిమ్స్‌ల్లో పెరుగనున్న ప్రైవేట్ వార్డులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు సరిపోకపోవడంతో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఎయిమ్స్ చింతన్ శిబిర్ పేరుతో ఆగస్టులో ఒక సమావేశాన్ని నిర్వహించాయి. ప్రభుత్వం ఇచ్చే నిధులపై ఆధారపడకుంగా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపైనే ప్రధానంగా ఈ శిబిరంలో చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఈ శిబిరంలో చేసిన కొన్ని కీలకమైన సిఫార్సులను పీటీఐ ప్రచురించింది. అన్ని

చింతన్ శిబిర్ సిఫార్సులు

ప్రాంతాల్లోని ఎయిమ్స్ ఆసుపత్రుల్లోని సాధారణ వార్డుల్లో మూడో వంతు వార్డులను ప్రత్యేక వార్డులుగా మార్చాలని, వాటితో పాటు ప్రైవేటు వార్డుల సంఖ్యను పెంచాలని సిఫార్సు చేసింది. తద్వారా సంస్థకు వచ్చే ఆదాయం పెరుగుతుందని పేర్కొంది. ఇక ఆసుపత్రులకు వచ్చే రోగుల నుంచి తీసుకోవాల్సి ఛార్జీలను కూడా సవరించాల్సిన అవసరం ఉందని ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలనే సిఫార్సు చేసినట్టు తెలిపింది. ఆసుపత్రిలోని సాధారణ పడకలను రోగులకు ఉచితంగానే కేటాయించినా ప్రత్యేక వార్డుల్లోని పడకల వినియోగం కోసం రుసుం చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించింది. గతం కన్నా భిన్నంగా కొన్ని మందులు, పరీక్షల కోసం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని ఎయిమ్స్ అధికార వర్గాలు తెలిపాయి. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించి అమలవుతున్న ఆరోగ్య, వైద్య సేవల పథకాల కోసం ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని మరో సిఫార్సు చేసినట్టు పేర్కొంది. మెడికల్ వాల్యూ ట్రావెల్ హబ్‌లను ఆకర్షించేలా ఎయిమ్స్‌లో ప్రత్యేక బ్లాకుల ఏర్పాటుసకు ఒక సిఫార్సు చేసింది. సంస్థకు ఆర్థిక భారం కాకుండా వైద్య పరిశోధనల కోసం కలసి వచ్చే వివిధ సంస్థల నుంచి సహకారం పొందేలా మరో సిఫార్సు చేసినట్టు తెలుస్తోంది.

సీడీఎస్ అనిల్ చౌహాన్‌కు జడ్ ప్లస్ భద్రత

న్యూఢిల్లీ: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జనరల్ అనిల్ చౌహాన్‌కు జడ్ ప్లస్ భద్రతను కేంద్ర ప్రభుత్వం కల్పించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఢిల్లీ పోలీస్ విభాగానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో సీడీఎస్ అనిల్ చౌహాన్ నివాసం, ఆయన పర్యటనల సందర్భంగా 33 మంది సాయుధ ఢిల్లీ పోలీసులు రక్షణగా ఉంటారు. తొలి సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్, హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తర్వాత 9 నెలల పాటు ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇటీవల లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) అనిల్ చౌహాన్‌ను సీడీఎస్‌గా కేంద్రం నియమించింది. ఆయనకు జనరల్ ర్యాంకు హోదా కూడా కల్పించింది. దేశ సైనిక చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. 1961 మే 18న జన్మించిన జనరల్ చౌహాన్ 1981లో భారత సైన్యంలోని 11 గూర్ఖా రైఫిల్స్‌లో చేరారు. శుక్రవారం సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన త్రివిధ దళాల వ్యవహారాలపై రక్షణ మంత్రికి ప్రిన్సిపల్ మిలిటరీ సలహాదారుడిగాను, సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగాను వ్యవహరిస్తారు.

వాడవాడలా అదే ఆదరణ

తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల నుంచి 22వ రోజు యాత్ర

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు : ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిని సాధించడానికి రైతులు తలపెట్టిన మహా పాదయాత్రకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం లభించింది. అమరావతి పరిరక్షణ కోసం అమరావతి టు అరసవల్లికి అమరావతి రైతుల పాదయాత్ర రాష్ట్ర చరిత్రను తిరగరాసేలా ముందడుగు వేసింది. అమరావతి రాజధాని నినాదంగా పల్లెలు, పట్టణాలు చుట్టబెడుతోంది. 22వ రోజు తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల నుంచి ఉత్సాహంగా యాత్రను ప్రారంభించారు. సోమవారం రైతు రథం వద్ద నీరు పోసి, కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. స్థానిక మహిళలు, మహిళా రైతులకు కుంకుమ పెట్టి స్వాగతించారు. దసరా పండుగ సందర్భంగా విచిత్ర వేషధారణలతో కళాకారుల విన్యాసాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పాదయాత్రకు టీడీపీ, సీపీఐ, జనసేన, బీజేపీ, వివిధ ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపి ప్రత్యక్షంగా పాదయాత్రలో పాల్గొన్నాయి. వాడవాడలా రోడ్లకు రెండువైపులా రైతులు, మహిళలు పూల వర్షంతో, జై అమరావతి నినాదంతో స్వాగతం పలికారు. ముసుళ్లకుంట, పుల్లలపాడు జాతీయ రహదారి, పోలవరం ప్రధాన కుడి కాలువ మీదుగా పాదయాత్ర నల్లజర్లకు చేరుకుంది. స్టార్ గ్రాండ్ కల్యాణ మండపంలో భోజన విరామ సమయం తీసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ అమరావతి ఒక ప్రాంతీయ సమస్య కాదని రాష్ట్ర ప్రజలందరికీ కేంద్ర బిందువుగా రాజధానిగా ఉండాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రతిపాదించగా, అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఏకగ్రీవంగా ఆమోదించారనీ, కానీ నేడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. పాదయాత్రకు అడ్డు తగులుతామని వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు పదేపదే చెబుతున్నారని ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. తాము శాంతియుతంగా పాదయాత్రలో పాల్గొంటూ అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు పూర్తి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. దేశంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆంధ్ర ప్రజలను రాజధాని లేని ప్రజలుగా చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. ముఖ్యమంత్రి ఇకనైనా మనసు మార్చుకుని, నిరంకుశ ధోరణి విడనాడి అమరావతిని రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించి ప్రకాశరావుపాలేనికి చేరుకోవడంతో14 కిలోమీటర్ల యాత్ర 22వ రోజు ముగిసింది. ఈ పాదయాత్రలో టీడీపీ నుంచి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, తెలుగు యువత నాయకుడు సిరిగిన బాబి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలిస్తేనే తెప్పోత్సవం!

మూలానక్షత్రం రోజు దుర్గమ్మను దర్శించిన రెండున్నర లక్షల మంది భక్తులు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజైన ఆదివారం రెండున్నర లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి సంతృప్తికరమైన దర్శనం అందేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఐదు క్యూలైన్‌లలో నాలుగు ఉచిత దర్శనానికి నిర్దేశించడం జరిగిందని, రూ.500 క్యూలైన్ మాత్రం టికెట్టు కొన్నవారికి మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ పొందేందుకు వెసులుబాటు కల్పించినట్టు చెప్పారు. ఎనిమిదో రోజైన మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నట్టు పేర్కొన్నారు. భవానీలు అమ్మను దర్శించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. తెప్పోత్సవంపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నదిలో నీటి ప్రవాహాన్ని బట్టి ఇరిగేషన్ అధికారులు అనుమతులను మంజూరు చేస్తారని చెప్పారు. వాతావరణం అనుకూలించకపోతే శాస్త్ర ప్రకారం నది ఒడ్డునే పూజల నిర్వహణకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు అమ్మను దర్శించుకునేందుకు దివ్యాంగులకు అనుమతిచ్చినట్టు వివరించారు. వారికి మోడల్ గెస్ట్ హౌస్ నుంచి బస్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ , రెవెన్యూ, మున్సిపల్, మీడియా, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాల విజయవంతానికి కృషి చేస్తున్నట్టుచెప్పారు.

ఆపరేషన్ లోటస్ వికటించింది: మాన్

న్యూఢిల్లీ: బీజేపీ తన బుద్ధి మార్చుకోవడం లేదనీ, ఇతర రాష్ట్రాల్లోలానే పంజాబ్‌లో కూడా ఆపరేషన్ లోటస్ చేయబోయిందనీ, అది కాస్తా వికటించిందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ విమర్శించారు. పంజాబ్ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గిన అనంతరం ఆయన మాట్లాడారు. పంజాబ్‌లో ఆప్ సర్కారు ఏర్పాటై ఆరు నెలలైనా కాకముందే.. బీజేపీ దాన్ని కూల్చేందుకు ప్రయత్నించి విఫలమైందని ఆరోపించారు. ఇటీవల ఆప్ సర్కారును కూల్చేందుకు ఆ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.25 కోట్ల చొప్పున ఆఫర్ చేసి బీజేపీ ఆపరేషన్ లోటస్‌కు తెరతీసింది. కానీ ఆప్ ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడంతో వారి ప్రయత్నం బెడిసికొట్టింది. ఈ క్రమంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్.. విశ్వాస పరీక్ష కోసం గవర్నర్ అనుమతితో అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించారు. సోమవారం సెషన్ ప్రారంభం కాగానే సీఎం భగవంత్ మాన్ సభలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే సభలో చర్చించాల్సిన అంశాలను పక్కనపెట్టి సీఎం విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ వాకౌట్ చేసింది. అయినా 91 మంది ఆప్ ఎమ్మెల్యేలు, ఒక శిరోమణి ఎమ్మెల్యే, ఒక బీఎస్పీ ఎమ్మెల్యే మద్దతుతో విశ్వాస తీర్మానం నెగ్గింది. అనంతరం సీఎం మాన్ మీడియాతో మాట్లాడారు.

విశాఖలో భీమా జ్యువెలరీ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ భీమా గోల్డ్ స్టోర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేశారు. సినీ నటి నిక్కీ గల్రానీ ముఖ్య అతిథిగా విచ్చేసి సోమవారం భీమా స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత డాక్టర్ బి. గోవిందన్ మాట్లాడుతూ, అత్యంత ఆధునికమైన సంప్రదాయ సమకాలీన సేకరణ సంబంధిత డిజైన్స్ విస్తృత శ్రేణిలో ఉన్నాయన్నారు. భీమా... స్వచ్ఛత, నిష్కలంకమైన నాణ్యతతో కూడిన ఆభరణాలు అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా బంగారు, వజ్రాలు, వెండిపై మెగా ఆఫర్స్‌ను ప్రకటించామన్నారు. ఖాతాదారులు బంగారం తరుగు చార్జీలపై 50 శాతం తగ్గింపుతో కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. వెండి వస్తువులపై ఇవేమీ లేవన్నారు. వజ్రాలు ఒక క్యారట్ పై రూ. 15,000 వరకు తగ్గింపు ఉంటుందన్నారు. కేవలం 10 శాతం అడ్వాన్స్ చెల్లించి, బంగారం రేటును 3 నెలల పాటు స్థిరంగా ఫిక్స్ చేసుకొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివాహాది శుభకార్యాలకు అద్భుతమైన ప్యాకేజీలు కూడా ఉన్నాయని వివరించారు. ఖాతాదారులు లక్కీ డ్రా ద్వారా బహుమతులు గెలుపొందవచ్చునని చెప్పారు. 1925లో ఏర్పాటు చేసిన భీమా... దక్షిణ భారతదేశం, యుఏఈలలో 50 వరకు స్టోర్స్ కలిగి ఉందని పేర్కొన్నారు. పార్ట్‌నర్ జయ గోవిందన్, మేనేజింగ్ డైరెక్టర్లు గాయత్రి సుహాస్, సుహాస్ ఎంఎస్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌ఐతో ఎస్‌డీపీఐకి లింక్ లేదు: ఈసీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిషేధించిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తో రాజకీయ పార్టీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ)కు ఎలాంటి సంబంధాలు లేవని తేలింది. ఈ విషయాన్ని భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ (సీఈసీ) వెల్లడించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా నిలుస్తున్న పీఎఫ్ఐని కేంద్రం ఇటీవలనే ఐదేళ్ల పాటు నిషేధించింది. ఈ నేపథ్యంలో తమకు పీఎఫ్ఐతో ఎలాంటి సంబంధాలు లేవని ఎస్‌డీపీఐ స్పష్టం చేసుకోవాల్సి వచ్చింది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ), నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు మధ్య ఎలాంటి లింకులు లేవని ఎన్నికల సంఘం గుర్తించింది. దేశవ్యాప్తంగా పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలపై ఎన్ఐఏ కొరడా ఝళిపిస్తున్నాయి. ఇప్పటికే అనేకమందిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో పీఎఫ్ఐతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేసే అన్ని పత్రాలను ఎస్‌డీపీఐ తమకు అందజేసిందని, వీటిని పరిశీలించిన తర్వాత వారిపై ఎలాంటి చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని సీఈసీ రాజీవ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఎస్‌డీపీఐ వైపు నుంచి ఎలాంటి డిఫాల్ట్ లేదని ఆయన చెప్పారు. కాగా, ఎస్‌డీపీఐ 2009 జూన్ 21న ఏర్పడింది. 2010 ఏప్రిల్ 13న భారత ఎన్నికల సంఘం వద్ద నమోదైంది. ఇప్పటివరకు, ఎస్‌డీపీఐ పార్టీ కేరళ, తమిళనాడు, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసింది.

ఐటీ కంపెనీల వెనకడుగు

ఫ్రెషర్స్‌లో ఆందోళన

న్యూఢిల్లీ: ఫ్రెషర్లకు ఆఫర్ లెటర్లు ఇచ్చిన తర్వాత అదిగో..ఇదిగో అంటూ నియామక ప్రక్రియలో జాప్యం చేసిన విప్రో, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్ర వంటి ఐటీ దిగ్గజాలు తాజాగా యూటర్న్ తీసుకున్నాయి. ఫ్రెషర్స్‌కు ఇచ్చిన ఆఫర్ లెటర్లను ఇప్పుడవి తోసిపుచ్చుతున్నాయి. నెలల తరబడి నియామక ప్రక్రియను తొక్కిపెట్టిన తర్వాత టెక్ దిగ్గజ సంస్థలు సహా అనేక ఐటీ కంపెనీలు ఆఫర్ లెటర్లను తిరస్కరిస్తున్నాయని సమాచారం. మూడు, నాలుగు నెలల కిందట తాము ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్ర వంటి టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నామని, అనేక రౌండ్ల ఇంటర్వ్యూల తర్వాత తమకు ఆఫర్ లెటర్లు ఇవ్వగా తామిప్పుడు కంపెనీల్లో చేరేందుకు వేచిచూస్తున్నామని విద్యార్థులు చెబుతున్నారు. కాగా తమ ఆఫర్ లెటర్లను రద్దు చేశామని తమకు ఆయా కంపెనీల నుంచి లెటర్స్ వచ్చాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హతా నిబంధనలు, కంపెనీ మార్గదర్శకాల పేరుతో ఆఫర్ లెటర్లను రద్దు చేస్తున్నట్టు ఆయా కంపెనీలు చెబుతున్నాయని ఎంపికైన అభ్యర్థులు వాపోతున్నారు. అంతర్జాతీయంగా ఐటీ రంగంలో మందగమనం, వ్యయ నియంత్రణ చర్యలు చేపడుతన్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. వడ్డీరేట్ల పెంపు, మార్కెట్లలో లిక్విడిటీ తగ్గుదల, మాంద్యం పరిస్థితులతో టెక్ స్టార్టప్‌ల నుంచి దిగ్గజాల వరకూ ఐటీ కంపెనీలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రతికూల పరిస్థితులతో అనేక కంపెనీలు నియామకాలను నిలిపి వేశాయి. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు సైతం హైరింగ్‌ను నిలిపివేయడంతో పాటు అవసరమైతే లేఆఫ్స్ తప్పవనే సంకేతాలను పంపడం ఆందోళన రేకెత్తిస్తోంది.

ఉపాధిలో మెరుగేది!

కళ తప్పిన పండగలు

తక్కువ శ్రమశక్తితో అత్యధిక ఉత్పత్తే యాజమాన్యాల లక్ష్యం

న్యూఢిల్లీ: పండగ సీజన్ వచ్చిందంటే అన్ని రకాల వస్తు సేవలకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ, మన దేశంలో ఈ ఫెస్టివల్ సీజన్లోనూ ఉపాధి సృష్టి మెరుగుపడలేదు. నిరుద్యోగితా రేటు దిగిరాలేదు. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదే కానీ తగ్గ డం లేదు. గత నెలాఖరు నాటికి దేశంలో నిరుద్యోగిత 7.7 శాతం గా నమోదైంది. గత ఏడాది అక్టోబర్‌లో ఇది 7.37 శాతంగా ఉంది. కరోనా ఉధృతి తగ్గిన నేపథ్యంలో, అన్ని రంగాలు క్రమంగా నిలదొక్కుకోవడం మొదలవుతాయని అనుకున్నప్పటికీ, దేశంలో దిగిరాని నిరుద్యోగితా రేటు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం లేదా తక్కువ శ్రమశక్తితో అత్యధిక ఉత్పత్తిని సంపాదించడమే యాజమాన్యాలు లక్ష్యంగా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. అందుకే, పండగలు కళ తప్పాయి. దీపావళి సైతం వెలుగులు తీసుకురాలేకపోతున్నది.

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజా నివేదికను అనుసరించి పట్టణ నిరుద్యోగిత ఈ ఏడాది ఆగస్టు లో 9.57 శాతంగా నమోదైంది.

సెప్టెంబర్‌లో పరిస్థితి మెరుగైనట్టు కనిపిస్తున్నప్పటికీ సాధారణంగా పండగల కాలంలో పెరగా ల్సిన స్థాయికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగలేదు. జాబ్ మార్కెట్లో క్షీణతను నిరోధించలేదు. గ్రామీణ నిరుద్యోగిత కూడా ఆగస్టులో 7.68 శాతం నుంచి సెప్టెంబరులో 5.84 శాతానికి తగ్గింది. ఇది పట్టణ నిరుద్యోగితా రేటు చూపిన విధంగా పెరిగిన మార్కెట్ కార్యకలాపాల కంటే వ్యవసాయ కార్యకలాపాల పెరుగుదలను సూచిస్తుంది. సంవత్సరం గణాంకాలను పరిశీలిస్తే, జాబ్ మార్కెట్లో హఠాత్ మార్పులు స్పష్టంగా గోచరిస్తాయి.

దేశంలో కార్మిక మార్కెట్ అస్థిరతకు ఇలాంటి ఆకస్మిక మార్పులే నిదర్శనం. దేశం మొత్తంలో నిరుద్యోగితా రేటు 6.43 నుంచి 8.28 శాతం మధ్య నమోదవుతోంది. అంటే, ఒక నెలలో ఉపాధి పొందిన వారు తర్వాతి కాలంలో నష్టపోయారు. ఈ సూత్రం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే రీతిలో వర్తిస్తుంది. గత ఏడాది పట్టణ నిరుద్యోగితా రేటు 7.32 నుంచి 9.57 శాతం వరకూ ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే నిరుద్యోగితా రేటు చండీగఢ్ లో అత్యల్పంగా 0.1 శాతం ఉండగా, రాజస్థాన్లో అత్యధికంగా 23.8 శాతంగా నమోదైంది. ఈ వైరుధ్యాలు దేశంలోని అసమాన ఆర్థిక వ్యవస్థకు అద్దం పడుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ (23.2 శాతం), హర్యానా (22.9), త్రిపుర (17), జార్ఖండ్ (12.2) , బీహార్ (11.4), గోవా (10.9 శాతం) రాష్ట్రాల్లో కూడా రాజస్థాన్ మాదిరిగానే నిరుద్యోగిత రేటు రెండు అంకెల్లో ఉంది. తెలంగాణలో ఇది 8.3 శాతంగా ఉంది. జాతీయ సగటు కంటే తక్కువగా నిరుద్యోగిత ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైంది. ఈ స్థాయి ప్రాంతీయ వ్యత్యాసాలు కార్మిక మార్కెట్ అభివృద్ధి ఆటంకాలు సృష్టిస్తాయి. నిరుద్యోగ పెరుగుదల సహజంగానే సామాజిక అశాంతికి, ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉంది. పెరిగిన వ్యవసాయ కార్యకలాపాల కారణంగా గ్రామీణ ప్రాంతాలు రాబోయే నెలల్లో ఉపాధి స్థాయిని కొనసాగించవచ్చు, కానీ కొన్ని నెలల వరకు మాత్రమే పరిమితం. ఆ తర్వాత పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి సారించి, మెరుగుదలకు ప్రత్యేక విధివిధానాలను, వ్యూహాలను, ప్రణాళి కలను సిద్ధం చేసి, యుద్ధ ప్రాతిపదికన అమలు పరిస్తే తప్ప పరిస్థితి మెరుగుపడదు.

అధ్యక్ష ఎన్నికల కోసం...

కాంగ్రెస్ మార్గదర్శకాలు ఇవే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల తేదీ సమీపిస్తున్న వేళ...ఈ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ సోమవారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. పార్టీ కార్యవర్గ సభ్యులు అభ్యర్థుల తరఫున ప్రచారం చేయ రాదని స్పష్టంచేసింది. ఏ అభ్యర్థికైనా ప్రచారం చేయాలని కోరుకుంటున్న నాయకులు ముందుగా తాము పనిచేస్తున్న పదవికి రాజీనామా చేయాలని తెలిపింది. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. తమ వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మల్లికార్జున ఖర్గె, శశి థరూర్ పోటీ చేస్తున్నారని, బ్యాలెట్ పేపర్ ద్వారా తమకు నచ్చిన నాయకుడిని ప్రతినిధులు స్వేచ్ఛగా ఎన్నుకోవచ్చని పార్టీ స్పష్టంచేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు/ ఇన్‌చార్జిలు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నేతలు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, వివిధ విభాగాలు, పార్టీ అధికార ప్రతినిధులంతా పోటీ చేస్తున్న అభ్యర్థులకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేయరాదని ఆదేశించింది. ఏ అభ్యర్థికైనా ప్రచారం చేయాలని భావిస్తే...వారు ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలని, ఆ తర్వాతే ప్రచార ప్రక్రియలో పాల్గొనవచ్చని తేల్చిచెప్పింది. అక్టోబరు 17న కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోలింగ్ జరుగుతుంది. 19న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. 9 వేలకు పైగా పీసీసీ ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ప్రచారం కోసం వచ్చిన అభ్యర్థులకు సహకరించాలని పీసీసీ అధ్యక్షులకు సూచించింది. పీసీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించాలని కోరుకున్న అభ్యర్థికి సమావేశ మందిరం, కుర్చీలు, ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపింది. అయితే, తన వ్యక్తిగత హోదాలో ఏ పీసీసీ అధ్యక్షుడు సమావేశం ఏర్పాటు చేయరాదని స్పష్టంచేసింది. ఎన్నికల వేళ ఓటర్లకు వాహనాలు ఏర్పాటు చేయడం, శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడవద్దని పేర్కొంది. కరపత్రాలు పంచడం, ఇతర ప్రచార మార్గాలను ఉపయోగిం చరాదని వివరించింది. పార్టీ ఆదేశాలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని, అంతేకాకుండా ఆ అభ్యర్థి ఎన్నికను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఏ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం చేసినా సహించేది లేదని పేర్కొంది.

ఏపీలోకి 17న 'జోడో' ప్రవేశం

ఐదు రోజుల పాటు సాగనున్న రాహుల్ పాదయాత్ర

నేడు కర్నూలులో కాంగ్రెస్ నేతల సన్నాహక సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈనెల 17న రాష్ట్రంలోకి ప్రవేశించబోతోంది. మొత్తం ఐదు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. యాత్రను జయప్రదం చేసేందుకు కాంగ్రెస్ నేతలు మంగళవారం కర్నూలులో భారత్ జోడో ఏపీ సన్నాహక యాత్ర సమావేశం నిర్వహించనున్నారు. ఏపీసీసీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ అధ్యక్షతన కర్నూలు టౌన్ లోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాలులో సమావేశం జరుగనుంది. ముఖ్య అతిథిగా భారత్ జోడో యాత్ర జాతీయ ఇన్‌చార్జ్ దిగ్విజయ్ సింగ్, ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఉమెన్ చాందీలతో పాటు, భారత్ జోడో యాత్ర రాష్ట్ర ఇన్‌చార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీడీ మెయ్యప్పన్, జైరాం రమేష్, కొప్పుల రాజు, కేవీపీ రామచంద్ర రావు, గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ జోడో యాత్ర రాష్ట్ర సమన్వయకర్త ఎన్. తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలంతా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతపురం జిల్లా డి.హీరేహల్ నుంచి ఓబులాపురం మీదుగా మోకా, ఆలూరు, ఆదోని, కోసగి ప్రాంతాల మీదుగా యాత్ర సాగనుంది. రాష్ట్రంలోకి ప్రవేశించే రోజు వేలాదిమంది పార్టీ శ్రేణులతో ఘనంగా స్వాగతం పలికేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రాహుల్ పాదయాత్ర జరిగే ఐదు రోజుల పాటు కాంగ్రెస్ శ్రేణులతో పాటు, సామాన్య ప్రజలు కూడా భారత్ జోడో యాత్రలో పెద్దసంఖ్యలో భాగస్వామ్యం అయ్యే విధంగా కర్నూలు సన్నాహక సమావేశం కార్యాచరణ రూపొందించనుంది.

త్రిపురకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లు

అగర్తల : వచ్చే ఏడాది జరుగనున్న అసెం బ్లీ ఎన్నికల కోసం ఉద్దేశించిన 4,900 ఈవీఎంలు, వీవీప్యాట్లు హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి చేరినట్టు త్రిపుర ఎన్నికల అదనపు కమిషర్ యూజ్ జెన్ మోగ్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు ఉన్న వివిద రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములో ఈ యంత్రాలను భద్రపరిచినట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు హైదరాబాద్ నుంచి 4,900 ఈవీఎంలు, వీవీప్యాట్‌లు అందినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1000 ఈవీఎంలు ఉన్నాయని, తాజాగా చేరిన వాటితో కలపి 5900 యంత్రాలు ఉన్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో 3,324 పోలింగు బూత్‌లను ఏర్పాటు చేసినా ప్రస్తుతం ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్లు సరిపోతాయని తెలిపారు. దసరా అనంతరం వీటిని వివిధ జిల్లాలకు చేరవేయనున్నట్టు తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై నవంబరు 8న హైదరాబాద్‌లో అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పుదుచ్చేరిలో విద్యుత్ ఉద్యోగుల సమ్మె ఉధృతం

పుదుచ్చేరి: ప్రభుత్వ రంగంలోని విద్యుత్తు పంపిణీ వ్యవస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పుదుచ్చేరిలో ఆందోళనలు తీవ్రమయ్యాయి. కేంద్ర పాలిత ప్రాంతమైన రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యుత్ శాఖకు చెందిన 300 మంది సిబ్బంది సమ్మె చేపట్టారు. ఆదివారం అర్థరాత్రి ఉప్పలంలోని విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగుల ఆందోళన తీవ్రమవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సిబ్బందిని అక్కడ నుంచి పంపించి వేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో రెండు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సిబ్బంది ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు అక్కడున్న ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు.

ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ ఉద్యోగులు చేపట్టిన సమ్మె చట్టవిరుద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. సమ్మెను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఏ. నమశ్శివాయం హెచ్చరించారు. అవసరమైతే ఎస్మా ప్రయోగానికి కూడా వెనుకాడమని ప్రకటించారు. విద్యుత్ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రైవేటీకరణ ప్రతిపాదన చేసినట్టు సమర్థించుకునే ప్రయత్నం చేశారు.



"కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని ఒక్క వాక్యంలో చెప్పొచ్చు. అదే ప్రైవేటు ఆస్తి రద్దు చేయడం"

కారల్ మార్క్స్



సీపీఐ 24వ జాతీయ మహాసభలు

COMMUNIST PARTY OF INDIA

అక్టోబర్ 14-18, 2022
విజయవాడ

కడదాకా కమ్యూనిస్టే

హైదరాబాద్ మలక్ పేట్‌లో ఒకసారి స్వాతంత్ర్య సమరయోధుల సమావేశానికి నన్ను కూడా పిలిచారు. ఇది జరిగి ఇరవై-ఇరవై అయిదేళ్లు అయి ఉండొచ్చు. తేదీ సరిగ్గా గుర్తు లేదు. ఆ సమావేశానికి హాజరైన వారిలో నా కన్నా చిన్న వాళ్లు ఎవరూ కనిపించలేదు. నేను తెలంగాణా సాయుధ పోరాటం, అందులో ఆంధ్రమహాసభ, కామ్రేడ్స్ అసోసియేషన్, కమ్యూనిస్టు పార్టీ కృషి గురించి ప్రస్తావించాను. సాయుధ పోరాట సమయంలో కమ్యూనిస్టు పార్టీ నాలుగు వేలమందిని కోల్పోవడంతో పాటు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది. అయితే ఇప్పుడు ఆ భూమి అప్పుడు కమ్యూనిస్టు పార్టీ ఎవరికైతే పంచిందో వారి చేతుల్లో లేదు అని నేను ఆ సమావేశంలో అన్నాను. నేను ప్రసంగించడం పూర్తి అయిన తరవాత బూర్గుల నరసింగ రావు నా దగ్గరికి వచ్చి "నువ్వు ఎవరు" అని అడిగారు. నా పేరు ఆర్వీ రామా రావ్ అని చెప్పా. అది తెలుస్తూనే ఉందిలే అసలు నువ్వు ఎవరు అని రెట్టించి ప్రశ్నించారు. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఎందుకు అలా అడుగుతున్నారు అన్నాను. "నువ్వు చిన్న వాడిగా కనిపిస్తున్నావు. సాయుధ పోరాటం రోజుల్లో పుట్టి అయినా ఉండవు. ఈ విషయాలన్నీ నీకు ఎలా తెలుసు? అని అడిగారు. నా ఆసక్తి ఏమిటో చెప్పిన తరవాత నేనెవరో ఆయనకు అర్థమైంది. మొదటిసారి బూర్గుల నరసింగ రావుతో మాట్లాడడం అదే. ఆ తరవాత ఆయనను అనేక సందర్భాలలో చూశాను. సాన్నిహిత్యం ఉందని చెప్పలేను. కాని ఆయన నన్ను గుర్తు పట్టేంత పరిచయం మాత్రం కచ్చితంగా ఉంది.

నేను ఆయనను చూసిందే ఆయన వయసు ఎక్కువైన సమయంలో. నింపాదిగా కనిపించే వారు. నడకా నెమ్మదిగానే ఉండేది. కానీ ఆ కళ్లల్లో ఏదో తీక్షణత కొట్టొచ్చినట్టు ఉండేది. చూడగానే మేధావి అనుకునేట్టుగా ఉండేది.



బూర్గుల నరసింగరావు

నెరిసిన ఆయన తెల్ల గడ్డం ఆయన ముఖానికి ప్రత్యేక ఆకర్షణ. నరసింగ రావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన బూర్గుల రామకృష్ణారావు తమ్ముడు వెంకటేశ్వరరావు కుమారుడు. బూర్గుల రామకృష్ణారావు కాంగ్రెస్ రాజకీయాల్లో ఉంటే నర్సింగరావు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి రజాకార్లకు వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. విద్యార్థిగా ఉండగానే పోలీసుల కన్నుగప్పి జాతీయ జెండా ఎగురవేసి చరిత్ర సృష్టించారు. విద్యార్థి దశలో ఆయన అఖిల హైదరాబాద్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా పని చేశారు. ఇదే తరువాత అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏ.ఐ.ఎస్.ఎఫ్.)లో విలీనమైంది. లక్నోలో ఏ.ఐ.ఎస్.ఎఫ్. 75వ వ్యవస్థాపక దినోత్సవం జరిగితే ఆరోగ్యం సహకరించకపోయినా నరసింగ రావు ఆ ఉత్సవంలో పాల్గొన్నారు.

1948 ఆగస్టు 22-23 అర్థ రాత్రి హైదరాబాద్ స్వాతంత్ర్య సమర చరిత్రలో మరపు రాని రోజు. ఇమ్రోజ్ సంపాదకుడు షోయబుల్లా ఖాన్ ను ఆ రాత్రే రజాకార్లు హతమార్చారు. షోయబ్ పత్రిక పని ముగించుకుని అర్థ రాత్రి ఇంటికి తిరిగి వెళ్తుండగా నరసింగ రావు కనిపించారు. అప్పుడు నరసింగ రావు కుటుంబం చెప్పల్ బజార్లో ఉండేది. ఇమ్రోజ్ కార్యాలయమూ అక్కడే. ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. తరవాత షోయబ్ ఇంటి ముఖం పట్టారు. కొద్ది సేపటికే నరసింగ రావు ఇంట్లో పని చేసే చంద్రయ్య తలుపు తట్టి తుపాకీ పేలిన చప్పుడు వినిపించిందన్నారు. నరసింగ రావు బయటకొచ్చి చూస్తే షోయబ్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. రజాకార్లు ఆయన చేతులను ఖండించి తరువాత తుపాకీతో కాల్చి చంపారు. ఈ సంఘటన గురించి నరసింగ రావు ఎప్పుడు ప్రస్తావించినా నిన్న జరిగిన సంఘటన వివరించినంత స్పష్టంగా కళ్లకు కట్టినట్టు చెప్పే వారు.

నర్సింగ రావు చివరి దశలో కూడా పోరాట పంథా విడనాడలేదు. మార్క్సిజం మీద ఆయన విశ్వాసం సడల లేదు. ఆయన రావి నారాయణ రెడ్డి పేర నెలకొల్పిన అమర వీరుల సంఘానికి అధ్యక్షులుగా ఉండే వారు. ఆయన కుటుంబం అంతా రాజకీయాలతో, సామాజిక కార్యకలాపాలతో, కళలతో సంబంధం ఉన్నదే.

-ఆర్వీ రామారావ్

గాంధీని ధిక్కరించిన ధీర

క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇవ్వగానే బ్రిటిష్ వారు కాంగ్రెస్ అగ్రనాయకులందరినీ అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు. అరెస్టు కాకుండా తప్పించుకున్న కొందరు నాయకులే ఆ ఉద్యమాన్ని కొనసాగించడానికి తగిన నాయకత్వం అందించారు. అలాంటి విశిష్ట వ్యక్తి అరుణా ఆసఫ్ అలీ (1909 జులై 16, 1996 జులై 29). 1942లో ఆమె బొంబాయిలోని గొవాలియా టాంక్ మైదానంలో (ఇప్పుడు అది ఆజాద్ క్రాంతి మైదానం) జాతీయ పతాకాన్ని ఎగురవేసి చరిత్ర సృష్టించారు.

1928లో అంటే 19వ ఏట ఆమె కాంగ్రెస్ నాయకుడు ఆసఫ్ అలీని పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యుల అభ్యంతరాలను ధిక్కరించి ఈ పెళ్లి చేసుకున్నారు. ఆ తరవాత ఆమె జాతీయోద్యమంలో భాగస్వామి అయ్యారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న అరుణా ఆసఫ్ అలీని జైలుకు పంపారు. జైలులో ఖైదీల సదుపాయాల కోసం 1932లో ఆమె తిహార్ జైలులో నిరాహార దీక్ష చేశారు. 1931 నాటి గాంధీ-ఇర్విన్ ఒప్పందం ప్రకారం ఖైదీలందరినీ విడుదల చేసినా అరుణను మాత్రం విడుదల చేయలేదు. దీనితో ఇతర మహిళా ఖైదీలూ ఆమెను వదిలిపెట్టకపోతే తామూ జైలులోనే ఉంటామని మొరాయించారు.

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అజ్ఞాత వాసం గడుపుతున్నప్పుడే అరుణా ఆసఫ్ అలీ రహస్యంగా రేడియో స్టేషన్ నిర్వహించారు. ఇంక్విలాబ్ పత్రికకు సంపాదకత్వం వహించారు. ఈ ఉద్యమం సందర్భంగా తప్పించుకుని అజ్ఞాతంగా గడిపిన అరుణా ఆసఫ్ అలీని లొంగి పొమ్మని గాంధీ కోరినా తన మీద ఉన్న వారెంటును రద్దు చేసే దాకా లొంగిపోకుండా గాంధీని సైతం ధిక్కరించిన ధీర వనిత అరుణా ఆసఫ్ అలీ. భారత నావికాదళ తిరుగుబాటుకు ఆమె మద్దతివ్వడం గాంధీకి నచ్చక ఆయన ఆగ్రహానికి గురి కావలసి వచ్చింది. నౌకా దళ ఉద్యమం హిందూ-ముస్లింల ఐక్యతకు దోహదం చేస్తుందని ఆమె గట్టిగా నమ్మారు. ఆమె అజ్ఞాతంలో ఉన్నప్పుడే ప్రభుత్వం ఆమె ఆస్తి స్వాధీనం చేసుకుని అమ్మేసింది.

అరుణా ఆసఫ్ అలీ

స్వాతంత్ర్యం తరవాత ఆమె రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. 1958లో ఆమె దిల్లీ మొదటి మేయర్ అయ్యారు. ఆమె భయం ఎరుగని యోధురాలు. కృతనిశ్చయంతో పని చేయడం ఆమె స్వభావం. మహిళలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం లాంటి వాటికి ప్రోత్సాహం లేని రోజుల్లోనే అరుణా ఆసఫ్ అలీ పట్టభద్రురాలయ్యారు. ఉపాధ్యాయినిగా తన జీవితం ప్రారంభించారు. ఆమె నిరంతర పోరాట శీలి. జైలులో ఉన్నప్పుడు ఖైదీలను అమానుషంగా చూడడాన్ని నిరసిస్తూ పోరాడారు. జైలులో పరిస్థితులు అయితే మెరుగు పడ్డాయి కానీ అరుణను మాత్రం అంబాలా జైలుకు తరలించారు.

గాంధీ ఆదర్శవాదం నచ్చినా మార్క్సిజం ఆమెను ఆకట్టుకుంది. 1948లో ఆమె కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఉన్నారు. 1950ల ఆరంభంలో కమ్యూనిస్టు పార్టీలోనూ ఉన్నారు. ఆ సమయంలోనే 1954లో భారత మహిళా సమాఖ్య ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1964లో ఆమె కాంగ్రెస్ లో చేరినా ఆ తరవాత రాజకీయాలలో అంత క్రియాశీలంగా లేరు. అహింసా వాదమా, హింసావాదమా అన్న చర్చలతో కాలం వెళ్లబుచ్చకుండా కార్యాచరణకు దిగాలని ఆమె యువతకు ఉద్బోధించే వారు. ఎడతాత నారాయణన్ తో కలిసి ఆమె లింక్ ప్రచురణలు ఏర్పాటు చేసి పేట్రియాట్, లింక్ పత్రికలు నడిపారు. వీటికి నెహ్రూ, కృష్ణమీనన్, బిజూ పట్నాయక్ లాంటి వారి మద్దతు ఉండేది.

ఎమర్జెన్సీ విధించడం ఆమెకు నచ్చక పోయినా ఇందిరా గాంధీతో సన్నిహితంగా మెలగేవారు. మరణానంతరం 1997లో ఆమెకు 'భారత రత్న' దక్కింది. ఇందిరా గాంధీ, మదర్ థెరీసా తరవాత భారత రత్న లభించిన మూడవ మహిళ అరుణా ఆసఫ్ అలీనే.

- భరద్వాజ

అటవీచట్ట రూపకర్త సీకే చంద్రప్పన్

ఆరు దశాబ్దాలకుపైగా నిస్వార్థ రాజకీయ జీవితం గడిపిన సీకే చంద్రప్పన్ 20 సంవత్సరాల వయస్సులోనే పోరాటబాటపట్టారు. కేరళలో ఆయన శక్తిమంతమైన, ప్రభావశీల నేత. అంతర్జాతీయ యువజన ఉద్యమంలో, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక నాయకత్వ స్థానంలో పనిచేశారు. పార్లమెంటు, అసెంబ్లీతో సహా వేదికల ద్వారా సామాన్యుల హక్కుల కోసం ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. అందరి ఆదరాభిమానాలను పొందారు. 1975-2009 మధ్య 20 సంవత్సరాలు కేరళ నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేశారు. ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా ఆయన తుదిశ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు ప్రమాణాలను కాపాడుతూ పనిచేశారు. కేరళలోనూ, దేశవ్యాపితంగాను కమ్యూనిస్టు ఉద్యమం, పనిచేసిన ప్రజాసంఘాల పురోగమనానికి ఎనలేని కృషి చేశారు. ఆయన జీవితం, కృషి ప్రతి కమ్యూనిస్టు, ప్రతి ప్రజా సేవకునికి ఆదర్శం. కేరళ శాసనసభకు ఎన్నికైనప్పటికీ మంత్రిగా పనిచేసే అవకాశం ఆయనకు దక్కలేదు. ఆయన అసెంబ్లీకి ఎన్నికైనప్పుడు రాష్ట్రంలో ఎల్డీఎఫ్ అధికారంలోకి రాకపోవడమే అందుకు కారణం. సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. మూడు సార్లు లోక్ సభకు, ఒకసారి కేరళ శాసనసభకు ఎన్నికయ్యారు. మూడవసారి లోక్‌సభకి ఎన్నికైనప్పుడు అటవీ ముసాయిదా చట్టాన్ని రూపొందించడంలో, అటవీ ఉత్పత్తులపై అటవీ వాసులకు హక్కులను కల్పించడంలో చంద్రప్పన్ మార్గదర్శక పాత్ర పోషించారు.

సీకే చంద్రప్పన్

పున్నప్రవాయలార్ ప్రజా తిరుగుబాటు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన సీకే కుమార ఫణిక్కర్ చంద్రప్పన్ తండ్రి. తండ్రి పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న చంద్రప్పన్ పార్టీ యువజనోద్యమం నిర్మాతల్లో ఒకరుగా నిలిచారు. రైతులు, ఆదివాసీల కోసం ఆయన అనేక పోరాటాలు చేశారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన చంద్రప్పన్ అతి పిన్నవయస్సులోనే సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కేరళ నుంచి ఆయన 1971, 1977, 2004లో సీపీఐ పక్షాన లోక్‌భకు, 1991 నుంచి 1996 వరకు చర్తాలా శాసనసభ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మూడో సారి లోక్‌సభకు ఎన్నికైనప్పుడు ఆదివాసీలకు అటవీ ఉత్పత్తులపై హక్కు కల్పిస్తూ అటవీ చట్టం రూపకల్పనలో లోక్‌సభ సభ్యుడిగా ఆయన ప్రముఖ పాత్ర వహించారు. చంద్రప్పన్ రైతు సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కేరళ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గాబాధ్యతలు నిర్వహించారు. సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ బాధ్యతలు నిర్వహిస్తూనే కేరళ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా కొనసాగారు. ఉత్తమ కమ్యూనిస్టుగా బాధ్యతాయుతమైన భూమిక పోషించారు.

కేరళ రాష్ట్రంలోని అలప్పుజా జిల్లా ముహమ్మాలో సీకే. కుమార ఫణిక్కర్, అమ్ముకుట్టి దంపతులకు 1935 నవంబర్ 10న చంద్రప్పన్ జన్మించారు. ఆయన తండ్రి సీకే కుమార ఫణిక్కర్, సీపీఐ ప్రముఖ నాయకుడు. ఆయనను వాయలార్ స్టాలిన్ అని పిలుస్తారు. పున్నప్ర-వాయలార్ పోరాటంలో ముందు వరుసలో పోరాడిన వారిలో ఫణిక్కర్ ఒకరు. చంద్రప్పన్ తిరువనంతపురంలోని యూనివర్సిటీ కాలేజీలో ఎంఏ పాసయ్యారు. విద్యార్థిగా ఉన్నప్పుడే చంద్రప్పన్ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1970లలో అఖిల భారత యువజన సమాఖ్యలో వివిధ హోదాలలో పనిచేశారు. గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొన్నారు. దిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురంలలో వివిధ సందర్భాలలో రాజకీయ ఖైదీగా జైలు పాలయ్యారు. ఆంగ్ల పత్రిక యూత్ లైఫ్, మలయాళంలో యువ వేదిక (హిందీలో) కృషికారన్ మాసపత్రికకు సంపాదకులుగా, జనయుగం దిన పత్రిక ప్రధాన సంపాదకునిగా పనిచేశారు. చంద్రప్పన్ పశ్చిమ బెంగాల్ కు చెందిన రాజకీయ కార్యకర్త బులురాయ్ చౌదరిని 1978 అక్టోబర్ 28న వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు పిల్లలు కలగలేదు. చంద్రప్పన్ 76వ ఏట 2012 మార్చి 22న కాన్సర్ వ్యాధితో తిరువనంతపురంలో తుదిశ్వాసవిడిచారు.

-మోదుమూడి మురళీ కృష్ణ

పున్నప్ర- వాయలార్ పోరాటం

దేశ స్వాతంత్ర్యానికి ముందే1946 వరకు కేరళ పశ్చిమ తీరంలో గల పున్నప్ర ప్రాంతంలోని కేథలిక్ చర్చి ఆధిపత్యానికి, కొన్ని భూస్వామ్య కుటుంబాల దుర్మార్గపు చర్యలను ప్రతిఘటిస్తూ పున్నప్ర-వాయలార్ మహత్తర పోరాటం జరిగింది. కొబ్బరి తోటల్లో పనిచేసే కౌలుదార్లు, భూస్వాముల నుండి నాటు పడవలు అద్దెకు తీసుకొని శ్రమించే మత్స్యకారులు నికృష్ట జీవితాలకు కారణమైన వారిపై తిరుగుబాటు చేశారు. వామపక్ష ట్రేడ్ యూనియన్ ఆద్యుడు సైమన్ అసన్ మత్స్య, కల్లు గీత, కొబ్బరి పీచు పరిశ్రమల కార్మికులను సమీకరించి ట్రేడ్ యూనియన్లు స్థాపించారు. వాయలార్ ప్రాంతంలో కరవుతో అనేక మంది ఆకలి చావులు, దివాన్‌కు తైనాతీలైన భూస్వాములు కౌలుదారులు, వ్యవసాయ కార్మికులపై దాడులు, కొబ్బరి పీచు పరిశ్రమలో పనిచేసే కార్మికులకు నాలగవ వంతే వేతనాలు చెల్లించడం లాంటి దుర్భర పరిస్థితులుండేవి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు నాయకులు సదాశివన్, కుమార్ ఫణిక్కర్‌లు కార్మికులను సంఘటితం చేసి యూనియన్లు ఏర్పాటు చేశారు. ముందుగా చెర్తలా తాలూకాలో మత్స్య కార్మిక సంఘం స్థాపించాక మొత్తం 11 యూనియన్లు ఏర్పడ్డాయి. 1942-43 ప్రాంతంలో కట్టనాడులో కమ్యూనిస్టు పార్టీ బలమైన శక్తిగాఎదిగింది.

ఈ పరిస్థితులన్నింటిని చర్చించిన కమ్యూనిస్టు పార్టీ పెద్ద సంఖ్యలో వాలంటీర్లను రిక్రూట్ చేసి ఆయుధ శిక్షణ ఇచ్చారు. దీనితో తిరువాన్కూరు ప్రభుత్వం పోలీస్, మిలిటరీని దించింది. 1946 అక్టోబరు 22 న కొబ్బరి పీచు ఫ్యాక్టరీ కార్మికులు, మత్స్యకారులు, నాటుపడవ మీద పనిచేసే కార్మికులు, ఆయిల్ మిల్లు కార్మికులు, తదితర కార్మిక వర్గం చేతికి అందిన ఆయుధమల్లా తీసుకుని దీర్ఘకాల పోరాటానికి సిద్ధమయ్యారు. మాజీ సైనికులు కొందరు పోకచెట్టు కాండంతో తయారుచేసిన పదునైన ఈటెలను తీసుకు వచ్చారు. పున్నప్ర పోలీసు క్యాంపు మీద దాడిచేసి ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని పథకం వేశారు. ప్రదర్శనగా వస్తున్న కార్మికులపై పున్నప్ర పోలీస్ క్యాంపు నుండి కాల్పులు జరిపారు. వాలంటీర్లు వెంటనే నేలపై పడుకుని, ముందుకు పాకి, హఠాత్తుగా లేచి తమ ఈటెలు, కొడవళ్లు, ఇతర ఆయుధాలతో పోలీసుల మీద దాడి చేశారు. ఒకరు పోలీస్ ఇన్స్‌పెక్టరు వేలాయుధన్ నాయర్‌ను పట్టుకుని పదునైన ఆయుధంతో పొడిచి చంపారు. దీనితో పోలీసులు జరిపిన కాల్పులలో చాలామంది చనిపోయారు.

పోలీసు క్యాంపు వరండాలో మృతదేహాలు, గాయపడిన వారి దేహాలు చిందర వందరగా పడిపోయాయి. వాలంటీర్లు పోలీసులు వదిలి వెళ్లిన కొన్ని తుపాకులను స్వాధీనం చేసుకుని వెళ్లారు. పున్నప్ర పోలీస్ క్యాంపు మీద దాడితో సంబంధంలేని అమాయకులైన యువకులు, వృద్ధులను అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేశారు. పున్నప్ర దాడికి ప్రధాన వ్యూహకర్త కె.సి.జార్జి. ఇన్స్‌పెక్టరు వేలాయుధన్ నాదార్‌ను చంపాడన్న ఆరోపణ మీద ఎం.కె.చక్రపాణికి 21 సంవత్సరాలు కఠిన జైలు శిక్ష విధించారు. ఎ.ఎస్.శ్రీధరన్‌కు కూడా కఠిన కారాగార శిక్ష విధించారు.

అలప్పూజ, అంబాలప్పూజ, ముహమ్మా, చెర్తాలా, వాయలార్‌లోని వందలాది మందిని సైన్యం పొట్టన పెట్టుకుంది. పున్నప్ర- వాయలార్ తిరుగుబాటును అణచేందుకు దివాన్, ఐ.జి, ఎస్.పి.ల నాయకత్వంలో తిరువాన్కూర్ సైన్యం వ్యూహాన్ని అమలు చేసింది. సాయుధ వలంటీర్లకు సరైన శిక్షణ లేనందున సాయుధ సైన్యం ముందు నిలవలేకపోయారు. ఆ తరువాత మధ్యవర్తిగా ఐ.జి.తో మాట్లాడేందుకు వెళ్లిన కమ్యూనిస్టు నాయకులు టి.వి.థామస్‌ను అరెస్టు చేశారు. ఆల్‌ట్రావన్కూర్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాలన్నిటిని ప్రభుత్వం నిషేధించింది. దీని తర్వాత 1946 నవంబరు 1 న సార్వత్రిక సమ్మె విరమించగా ప్రభుత్వం నవంబరు 13వ తేదీన మిలిటరీ పాలన తొలగించింది. కట్టప్పన్, ఫ్రాంచి, పి.కె.దామోదరన్‌లకు ఉరిశిక్ష మరో 27 మందికి కఠిన జైలుశిక్ష విధించారు. పై కోర్టులో ఉరిశిక్షను కఠిన జైలుశిక్షకు తగ్గించారు. 8 సంవత్సరాల జైలు జీవితం తర్వాత 1954 లో పై ముగ్గురిని విడుదల చేశారు.

-చలసాని రామారావు

వీరనారి ప్రీతిలత

స్వాతంత్ర్య సమర వీరుల్లో పోరాట యోధులే కాదు వీర వనితలు కూడా అనేక మంది ఉన్నారు. వారిలో చిటగాంగ్ పోరాటంలో పాల్గొన్న వీరనారి ప్రీతి చరిత్ర మరువలేనిది. సాయుధ సమరంలో పాల్గొన్న వారిలో 61 మంది వీరనారీమణులు తుపాకీ గుళ్లకు, ఉరి కొయ్యలకు బలయ్యారు. "స్త్రీలు విప్లవోద్యమంలో పని చేయటానికి పనికిరారు. ఎందుకంటే వారు నిర్బంధాన్ని తట్టుకోలేరు. పైగా అజ్ఞాతంలో ఉండటానికి వారికి చాల ఇబ్బందులు ఉంటాయి" అనే అభిప్రాయం చిటగాంగ్ విప్లవ వీరుడు "ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ" అధ్యక్షుడు అయిన సూర్యసేన్‌కి ఉండేది. చంద్రశేఖర్ అజాద్ సహా అనేక మంది విప్లవకారులు ఇదే అభిప్రాయంతో ఉండేవారు. "ఇలాంటి అభిప్రాయం కల్గి ఉన్నందుకు సిగ్గుపడుతున్నానని" సూర్యసేన్ భావించేట్లు చేసిన విప్లవ నాయకురాళ్లు కల్పనాదత్, ప్రీతిలతలు.

విప్లవోద్యమంలో గెరిల్లా పోరాటానికి చెందిన దళానికి నాయకురాలైన తొలి మహిళ. ఇరవైయ్యవ శతాబ్దిలో అమరత్వం పొందిన తొలి మహిళ ప్రీతిలత. ఈమె 1911 మే 5 న ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని చిటగాంగ్ థల్‌ఘాట్ గ్రామంలో బగబంధు-ప్రతిభామయి దంపతులకు జన్మించారు. ఎం.ఏ చదివి ఒక విద్యాలయానికి ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. 1932 మే నెలలో గ్రామీణ ప్రాంతం థల్‌ఘాట్ గ్రామంలో ఉన్న సూర్యసేన్‌ను ప్రీతి, కల్పనాదత్ కలుసుకున్నారు. దీన్ని పసిగట్టిన కెప్టెన్ కామెరాన్ సైనికులతో గ్రామాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపించాడు. తుపాకీ పట్టడం కొత్త అయినప్పటికీ ప్రీతి ధైర్య సాహ సాలతో సైనికులను ఎదుర్కొన్నది. ఈ పోరాటంలో విప్లవకారులు అపర్ణాసేన్, నిర్మల్‌సేన్‌లు మరణించారు. ప్రీతి చిటగాంగ్‌కు, కల్పనాదత్ కలకత్తాకు చేరారు. వీరిద్దరి ఆనుపానాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం నిఘా పెట్టింది. అయినప్పటికీ పోలీసులను ఏమార్చి ప్రీతి అనేకసార్లు తప్పించుకొని రహస్య కార్యకలాపాలను నిర్వహించారు. రామకృష్ణబిస్వాస్, నరేష్‌రాయ్, త్రిపురసేన్, బిందుభట్టాచార్య, అమరేంద్రనాథ్ , ప్రమోద్‌రాజన్ చౌదరి, టేగ్రా, కృష్ణచౌదరి, జీవన్‌ఘోషాల్ తదితర అనేక మంది విప్లవ వీరులు, అభిమాన దేశ భక్తులు బ్రిటీష్ సైనికుల కాల్పులకు వీర మరణం పొందారు. దీనిపై బ్రిటీష్ పాలకుల మీద ప్రతీకారం తీర్చుకోవాలని ప్రీతి నిర్ణయించుకున్నది. రహస్యంగా ఉన్న సూర్యసేన్‌ను ఒప్పించి పొటాషియం సైనేడ్‌ను తీసుకుని దగ్గర ఉంచుకున్నారు.

1932 మే 24 న తన సహచరులు ఎనిమిదిమందితో రాత్రిపూట పొద్దుపోయిన తరువాత పమరితాలీ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌పై బాంబు దాడి చేశారు. చిటగాంగ్‌కు నాలుగు మైళ్ల దూరంలో ఉన్న ఆ క్లబ్‌కు బ్రిటీష్ అధికారులంతా కుటుంబాలతో వచ్చి విందులు, వినోదాలు చేస్తారు. బాంబు ఒక్కసారి పేలడంతో వినోదాలలో తలమునకలై ఉన్న వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నుంచి తేరుకుని సైనిక బలగాలతో కాల్పులు జరిపించారు. అప్పుడు ప్రీతి కాల్పులు జరుపుతూ గాయపడింది.తప్పించుకోలేనని అర్థం చేసుకున్న ప్రీతి పొటాషియం సైనేడ్ మింగి శత్రువు చేతికి చిక్కకుండా ప్రాణ త్యాగం చేసింది. ప్రీతి భారతదేశ స్త్రీజాతికే గర్వకారణంగా నిలిచింది. ఇలాంటి వీర నారీమణులెందరో విప్లవ పోరాటంలో ప్రాణాలు వదిలారు.

ప్రీతిలత

- చెరుకూరి సత్యనారాయణ

సీఎన్‌జీ గ్యాస్ మరింత భారం

న్యూఢిల్లీ: నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతిపై కేంద్రం మరోసారి సీఎన్‌జీ గ్యాస్ ధరల భారీన్ని మోపే అవకాశం ఉంది. వారం రోజుల కిందటే పెరిగిన గ్యాస్ ధరలు మరి కొద్ది రోజుల్లో మరోసారి పెరిగే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ సారి ఏకంగా ఒక కిలో సీఎన్‌జీ గ్యాస్ ధర రూ.8 నుంచి రూ.12 వరకూ పెరిగే అవకాశం ఉన్నట్టు తెలిపారు. సీఎన్‌జీ గ్యాస్‌ను ఎక్కువగా వాహనాలు, ఇతర ఆటోమొబైల్స్‌లో వినియోగిస్తుండగా, ప్రధాన నగరాల్లో పైప్ లైన్ల ద్వారా గృహ అవసరాలకు కూడా వినియోగిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ పరిణామాలు, భారతదేశ కరెన్సీ విలువ పడిపోతుండడంతోనే గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

మత సామరస్యంతోనే శాంతి

చాముండేశ్వరీ అలయాన్ని సందర్శించిన రాహుల్

మైసూరు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర కర్ణాటకలో సోమవారం మూడోరోజుకు చేరుకుంది. యాత్రలో భాగంగా చాముండి కొండపై గల చాముండేశ్వరీ ఆలయాన్ని సందర్శించిన రాహుల్...అక్కడ పూజలు చేశారు. మద్దతుదారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించారు. భారతదేశం శాంతియుతంగా ఉండటానికి, ప్రగతిపథంలో నడవడానికి మత సామరస్యమే ప్రధాన కారణమని ఆలయం సందర్శనం అనంతరం రాహుల్ ట్వీట్ చేశారు. రాహుల్ పాదయాత్ర ప్రారంభించి 26 రోజులు గడిచింది. పల్లెలు, పట్టణాలు, వీధులు అనే తేడా లేకుండా రాహుల్ యాత్ర చేస్తున్నారు. రాహుల్ అక్కడక్కడా దసరా ఉత్సవాలలో పాల్గొంటున్నారు. రాహుల్‌కు స్వాగతం పలికేందుకు ప్రజలు రోడ్డుకు రెండు వైపుల బారులు తీరి నిల్చున్నారు. రాహుల్ జిందాబాద్, కాంగ్రెస్ వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మైసూరులో రాహుల్ యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. అభిమానులు, పార్టీ కార్యకర్తలు డ్రమ్ములు వాయిస్తూ, నాట్యం చేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. దసరా ఉత్సవం ఉట్టిపడేలా రంగు రంగుల వస్త్రాలు ధరించారు. ఆదివారం రాత్రి రాహుల్‌గాంధీ ఇక్కడ జోరువానలోనూ ప్రసంగించారు. పూర్తిగా తడిసి ముద్దయినా ఆయన ప్రసంగం కొనసాగించారు. తన పాదయాత్ర ద్వారా దేశాన్ని ఐక్యంగా ఉంచడమే లక్ష్యమని రాహుల్ వ్యాఖ్యానించారు. జోరువానలోనూ రాహుల్ ఆపకుండా ప్రసంగించడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశంసలు కురిపించారు. యాత్ర నిబద్ధత ప్రస్ఫుటమయ్యేలా రాహుల్ వ్యవహరించారని చెప్పారు. మైసూరులో 22 కిలోమీటర్లు సాగిన రాహుల్ పాదయాత్ర మాండ్య జిల్లాలోని చారిత్రక శ్రీరంగపట్నంలోకి ప్రవేశించింది.

మైసూరుకు సోనియా

రాహుల్ పాదయాత్ర సాగుతున్న కర్ణాటకలోని మైసూరుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ సోమవారం వచ్చారు. రెండు రోజుల విరామం తర్వాత గురువారం నుంచి జరిగే పాదయాత్రలో సోనియా పాల్గొంటారు. ఆరోగ్య కారణాలతో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో సోనియాగాంధీ పాల్గొనలేదు. సుదీర్ఘకాలం తర్వాత పార్టీ కార్యక్రమాల్లో సోనియా పాలుపంచుకోవడం ఇదే మొదటిసారి.

విశాలాంధ్రకు గోపాలరావు దంపతుల విరాళం

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర దినపత్రిక అభివృద్ధిని కాంక్షిస్తూ సీపీఐ సీనియర్ నాయకుడు వీరంకి గోపాలరావు, సతీమణి విజయలక్ష్మి రూ.10వేలు విరాళంగా అందజేశారు. పటమట వీరంకి గోపాలరావు అభ్యుదయ గ్రంథాలయంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి జల్లి విల్సన్‌కు చెక్కు అందజేశారు. దాతృత్వంపై స్పందించిన విల్సన్ మాట్లాడుతూ, 1958 నుంచి విశాలాంధ్ర దినపత్రికను క్రమం తప్పకుండా గోపాలరావు దంపతులు పఠిస్తున్నారంటూ వారికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సీపీఐ సీనియర్ నాయకుడు ఈడే ప్రసాద్, విశాలాంధ్ర సర్క్యులేషన్ మేనేజర్ బొర్రు సుబ్బారావు, నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రద్దు ప్రతిపాదన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను రద్దు చేసే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం స్పష్టం చేసింది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కేంద్రం రద్దు చేసి, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలో విలీనం చేసే అవకాశం ఉందని ఒక మీడియా కథనంపై స్పందిస్తూ ఈ స్పష్టత వచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతి ఇరానీ రీ-ట్వీట్ చేసిన ట్వీట్‌లో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది.

తాత్కాలిక అధ్యాపకుల సమస్యలపై

దిల్లీ వర్సిటీలో డీయూటీఏ సమ్మె

న్యూఢిల్లీ: వర్సిటీలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న అడ్‌హాక్, తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) సోమవారం సమ్మెకు పిలుపునిచ్చింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న దేశ్‌బంధు, రాంజాస్, లక్ష్మీబాయి తదితర కాలేజీల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాల కోసం అక్కడ పని చేస్తున్న వారిని తొలగించే ప్రయత్నాలను డీయూటీఏ తీవ్రంగా వ్యతిరేకించింది. వర్సిటీ అనుబంధ కళాశాలల్లోని, వాణిజ్యం, సైకాలజీ విభాగాల్లోని అధ్యాపకుల స్థానం మార్పిడిని వ్యతిరేకిస్తూ సమ్మెకు పిలుపునిచ్చినట్టు డీయూటీఏ కార్యవర్గ సభ్యుడు ఒకరు తెలిపారు. దీన్ని నిరసిస్తూ దిల్లీ యూనివర్శిటీ కళాశాలల ఉపాధ్యాయులందరూ తరగతులను బహిష్కరిసున్నట్టు తెలిపారు. అడహాక్ అధ్యాపకుల స్థానం మార్పిడిని డీయూటీఏ తరపున ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ చర్యలు అడహాక్ పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాత్కాలికలికంగా పని చేస్తున్న వారి స్థానాలకు సంబంధించిన పోస్టులను ఇతరులకు రిజర్వు చేయవద్దని డిమాండు చేసింది. ఇప్పటికైనా వర్సిటీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని పున:సమీక్షించాలని విజ్ఞప్తి చేసింది.

వాయుసేన 'ప్రచండ్' వేగం

- అత్యాధునిక తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు
- స్వదేశీ పరిజ్ఞానంతో హెచ్‌ఏఎల్ రూపకల్పన
- ఎయిర్-టు-ఎయిర్‌గన్స్, రాకెట్ వ్యవస్థ
- రాత్రి వేళల్లోనూ లక్ష్య ఛేదన

న్యూఢిల్లీ: భారత వాయుసేన 'ప్రచండ్' వేగంతో దూసుకుపోనున్నది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యాధునిక తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లాంఛనంగా భారత వైమానిక దళంలోకి ప్రవేశపెట్టారు. ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి, సైనిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో మోహరింపు కోసం రూపొందించిన 'ప్రచండ్' హెలికాప్టర్లను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) అభివృద్ధి చేసింది. భారత సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచేందుకుగాను స్వదేశీ పరిజ్ఞానంతో తేలికపాటి హెలికాప్టర్లను (ఎల్‌సీహెచ్) సమకూర్చేందుకు 2020 మార్చిలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన భద్రతా కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఆమోద ముద్ర వేసింది. తొలుత 15 హెలికాప్టర్ల కోసం రూ.3887 కోట్లను కేటాయించింది. వీటిలో 10 హెలికాప్టర్లు భారత వాయుసేనలోకి, మరో ఐదింటిని ఆర్మీకి కేటాయించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో నాలుగు హెలికాప్టర్లను వాయుసేనలో ప్రవేశపెట్టారు. రానున్న రోజుల్లో మరిన్ని 'ప్రచండ్' ఎల్‌సీహెచ్‌లను సమీకరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భారత వాయుసేన అధికారులు వెల్లడించారు. 1999 కార్గిల్ యుద్ధం తర్వాత ఇటువంటి తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల అవసరాన్ని గుర్తించారు. వీటిని స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ప్రచండ్ ఎల్‌సీహెచ్‌లు అత్యాధునిక తేలికపాటి హెలికాప్టర్లయిన 'ధ్రువ్' మాదిరిగానే ఉంటాయి. రెండు ఇంజిన్లు కలిగిన ఈ తేలికపాటి హెలికాప్టర్ 5.8టన్నుల బరువు ఉంటుంది. గాల్లో క్షిపణి లక్ష్యాలను టార్గెట్ చేసే విధంగా ఎయిర్-టు-ఎయిర్ గన్స్ ఈ హెలికాప్టర్‌కు ఉంటాయి. 20ఎంఎం టర్రెంట్ గన్స్, రాకెట్ వ్యవస్థతోపాటు ఇతర ఆయుధాలను విడుదల చేసే ఏర్పాట్లు ఉన్నాయి. యుద్ధ ట్యాంకులు, బంకర్లు, డ్రోన్లు సహా ఎత్తైన పర్వత ప్రాంతాలతోపాటు రాత్రివేళల్లోనూ శత్రు లక్ష్యాలను ఇవి ఛేదిస్తాయి. సముద్ర, ఎడారి ప్రాంతాలతోపాటు సియాచిన్ వంటి ప్రతికూల వాతావరణాల్లో ఈ తేలికపాటి హెలికాప్టర్ల పనితీరును పరీక్షించారు.

ప్రభుత్వ లాంఛనాలతో

బాలకృష్ణన్ అంత్యక్రియలు

కన్నూర్: సీపీఎం సీనియర్ నేత కొడియేరి బాలకృష్ణన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన భౌతికకాయాన్ని సోయవారం కన్నూర్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు తరలించారు. పార్టీ సీనియర్ నేతలు కార్యకర్తల సందర్శన అనంతరం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కేరళ సీఎం పినరయి విజయన్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని తమ భుజాలపై మోస్తూ మూడు కిలోమీటర్ల మేర ఊరేగింపుగా స్థానిక పయ్యాంబలం బీచ్ వద్ద ఏర్పాటు చేసిన చితి వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వ లాంఛనాలతో సాగిన కార్యక్రమాల అనంతరం బాలకృష్ణన్ కుమారులు వినోయ్, వినీశ్‌లు చితికి నిప్పుపెట్టారు. అంత్యక్రియల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్, నేతలు ఎంఏ బేబీ, ఏ విజయరాఘవన్, ఎంవీ జయరాజన్, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులుగా, కేరళ హోంమంత్రిగా, టూరిజం శాఖ మంత్రిగా., పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన బాలకృష్ణన్ క్యాన్సర్‌తో బాధపడుతూ అక్టోబర్ 1 న చెన్నైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూసిన విషయం తెలిసిందే.

'ఆదిపురుష్' టీజర్‌పై రాజమౌళి అన్నయ్య వ్యంగ్యం



హైదరాబాద్: ప్రభాస్ రాముడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఆదిపురుష్' టీజర్‌ను ఆదివారం అయోధ్యలో విడుదల చేశారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా టీజర్ కొందరిని ఆకట్టుకుంటే మరికొందరిని నిరుత్సాహపరిచింది. అభిమానుల్లో కొందరు రోమాలు నిక్కబొడుచుకున్నాయని అంటుంటే మరి కొందరు కార్టూన్లతో సినిమా చేశారేంటి? అంటూ ట్రోల్ చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ నెటిజన్లు, అభిమానులే ఈ టీజర్ మీద కామెంట్ చేశారు. ఇప్పుడు సెలబ్రిటీలు కూడా 'ఆదిపురుష్' టీజర్‌ను కామెంట్ చేసే జాబితాలో చేరారు. టీజర్ విడుదలైన రెండు గంటల తర్వాత రాజమౌళి సోదరుడు నటుడు, రచయిత ఎస్.ఎస్.కాంచీ ఈ విషయం మీద ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 'పౌరాణికం తీస్తే తెలుగోడే తీయాలి' అంటూ కామెంట్ చేశారు. అయితే కాంచీ ఎక్కడా పేరును ప్రస్తావించలేదు. ప్రస్తుతం ఆయన ట్వీట్ హాట్‌టాపిక్‌గా మారింది.

పూజా హెగ్డేకి సర్జరీ నిజమేనా?

ముంబై: సౌత్ సినిమాలో పూజాహెగ్డేకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'రాధేశ్యామ్', 'ఆచార్య', 'బీస్ట్' వరుసగా మూడు చిత్రాలు పరాజయం పాలైనా ఆమె క్రేజ్, ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు. స్టార్ హీరోలందరితో అవకాశాలు అందుకున్న ఈ బెంగుళూరు బ్యూటీ పాన్ ఇండియా చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటోంది. మరోవైపు ప్రత్యేక గీతాల్లో నటించడానికి సై అంటోంది. తాజాగా పూజాహెగ్డేకు సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ప్రస్తుతం ఆమె సర్జరీ చేయించుకోవడానికి సిద్ధమైందనే వార్త హల్‌చల్ చేస్తోంది. దాంతో పూజాకు ఏమైంది అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేయడం మొదలుపెట్టారు. ఇంతకీ ఆమె చేయించుకునేది ముక్కుకు సంబంధించిన సర్జరీ అట. తన అందాన్ని మరింత మెరుగుపరచుకోవడానికి సిద్ధమైందని ప్రచారం జరుగుతోంది. దీని కోసమే ఇటీవల ఆమె విదేశాలకు వెళ్లిందని కొందరు అంటుంటే... సర్జరీ చేయించుకుందని కొందరు గుసగుసలాడుకుంటున్నారు. ఇటీవల విదేశాల్లో విహరిస్తున్న ఫొటోలను షేర్ చేయడంతో విదేశాల్లో సర్జరీ అన్న విషయం నిజమే అని భావిస్తున్నారు. అయితే దీనిపై పూజా హెగ్డే టీమ్ స్పందించింది. ప్రస్తుతం పూజాపై వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. హాలీడే కోసం ఆమె విదేశాలకు వెళ్లిందని, ఆమె ఎలాంటి సర్జరీ చేయించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం ఆమె మహేశ్ 28, హిందీలో రెండు చిత్రాలతో బిజీగా ఉంది.

'ఆస్కార్' సినిమా తీసిన తెలుగమ్మాయి

హైదరాబాద్: ఈసారి ఆస్కార్ బరిలో మన తెలుగు సినిమా 'ఆర్.ఆర్.ఆర్' నిలుస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఆ అవకాశం మనకు దక్కలేదు. అయితే.. మన తెలుగమ్మాయి నిర్మించిన ఓ సినిమా మాత్రం ఆస్కార్‌కి వెళ్లింది. అదే... 'జాయ్‌లాండ్'. ఇదో పాకిస్తానీ చిత్రం. ఈ చిత్రానికి పనిచేసిన వాళ్లంతా దాదాపుగా పాకిస్తానీయులే. దీనికి అపూర్వ నిర్మాత. హైదరాబాద్‌లో పుట్టి, అమెరికాలో స్థిరపడిన అపూర్వ కొన్ని లఘు చిత్రాల్ని, ఇండిపెండెంట్ చిత్రాల్ని నిర్మించారు. వాటిలో చాలా వరకూ అవార్డులు అందుకున్నవే. అపూర్వ తండ్రి హరి చరణ్ ప్రసాద్ కూడా నిర్మాతే. ఆయన నిర్మించిన 'కమలి' చిత్రానికి జాతీయ అవార్డు దక్కింది. ఆ స్ఫూర్తితోనే అపూర్వ నిర్మాతగా మారారు. 'జాయ్‌లాండ్'ని అనేక అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించారు. కొన్ని అవార్డులూ అందుకొంది. ఇప్పుడు ఉత్తమ విదేశీ చిత్రాల కేటగిరీలో పాకిస్తాన్ నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆస్కార్‌కు వెళ్లింది.

కాంగ్రెస్ పునరుజ్జీవమే లక్ష్యం

- సమర్ధ నాయకత్వం అవశ్యం
- ఖర్గెతో విభేదాలు లేవు: శశి థరూర్

న్యూఢిల్లీ/హైదరాబాద్: బీజేపీపై విజయం సాధించడానికి పార్టీ ప్రతిష్ఠను తిరిగి పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కాంగ్రెస్ నేత శశిథరూర్ వక్కాణించారు. పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మద్దతివ్వాల్సిందిగా పార్టీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన మరో అభ్యర్థి, పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గెతో తనకు సైద్ధాంతిక విభేదాలు లేవని తిరువనంతపురం లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న శశిథరూర్ చెప్పుకొచ్చారు. 'మేమంతా కాంగ్రెస్ నాయకులం. బీజేపీపై పోరాటమే మా లక్ష్యం. ఖర్గెతో నాకు ఎలాంటి వైరుధ్యాలు లేవని స్పష్టంచేస్తున్నా. పార్టీకి సమర్థ నాయకత్వం అవసరమని నేను భావిస్తున్నా' అని థరూర్ సోమవారం ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో ఏకాభిప్రాయ అభ్యర్థి ఉంటే మంచిదని శశిథరూర్‌కు మల్లికార్జున ఖర్గె చెప్పిన మరుసటి రోజే థరూర్ ఈ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం తాను పోటీ చేస్తానని థరూర్ తెలిపినట్లు ఖర్గె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంతా థరూర్ హైదరాబాద్ వచ్చారు. ప్రత్యర్థి మల్లికార్జున ఖర్గె పట్ల తనకు అపార గౌరవం ఉందని థరూర్ చెప్పారు. బీజేపీపై సమర్ధవంతంగా పోరాటం చేయడానికి పార్టీని మరింత పటిష్ఠవంతం చేయాల్సిన అవసరం ఉందని, పార్టీ ప్రతిష్ఠను పెంచడం కోసం తాను అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ స్పష్టంచేశారు. 'దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావాలని మేము కోరుకుంటున్నాం. నాకు సంబంధించినంత వరకూ బీజేపీని అధిగమించడం కోసం కాంగ్రెస్ ఎలాంటి సవాళ్లను అధిగమించాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎన్నికలకు కాంగ్రెస్‌ను ఎలా సమాయత్తం చేయాల్సి ఉందనేది చాలా కీలకం' అని థరూర్ చెప్పారు. పోటీ అనేది కుటుంబంలో చర్చించుకోవడమే...ఇది ఘర్షణ కాదు. గొప్ప అనుభవం, శక్తిసామర్థ్యాలు, తెలివి తేటలు గల నేత ఖర్గె. నేను కూడా భిన్నమైన అభిప్రాయాన్ని పార్టీ ముందు పెట్టాను. పార్టీ ఏమి కోరుకుంటున్నారో అది నేను వారి ముందుంచాను. అలాగని మా పార్టీ ఓటర్లపై నేను ఎలాంటి ఒత్తిడి చేయను. మేమంతా కలిసే ఉన్నాం...ఉంటాం' అని థరూర్ చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా అది కాంగ్రెస్ పార్టీకి గొప్ప విజయమేనని, ఎన్నికల నుంచి తాను తప్పుకునే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. తన ప్రచారానికి మంచి స్పందన వస్తున్నదని, చెన్నై, ముంబై వంటి అనేక నగరాల్లో తాను పర్యటిస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో థరూర్‌ను కేంద్ర మాజీమంత్రి ఎంఎం పల్లంరాజు కలిశారు.

ఆసియాకప్‌లో తెలుగు వెలుగు

- కెరీర్‌లో మొదటి అర్ధసెంచరీ నమోదు
- మలేసియాను ఓడించిన భారత అమ్మాయిలు!
- 30 పరుగుల తేడాతో ఘన విజయం

సిల్‌హట్: ఆసియాలోని అత్యుత్తమ జట్ల మధ్య పోరు ఉత్కంఠగా మారింది. మహిళల ఆసియా కప్‌లో భాగంగా సోమవారం మలేసియాతో జరిగిన మ్యాచ్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించి బోణీ కొట్టిన భారత అమ్మాయిలు వరుసగా రెండోసారి గెలిచి సత్తా చాటారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల తేడాతో 181 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఏర్పడిన అంతరాయంతో డీఎల్‌ఎస్(డక్ వర్త్ లూయిస్) పద్ధతి ప్రకారం భారత జట్టు విజేతగా నిలిచింది. అప్పటికే 2 వికెట్లకు 16 పరుగుల చేసిన మలేసియా ఓటమిపాలైంది. ఈ సందర్భంగా తెలుగమ్మాయి సబ్బినేని మేఘన 53 బంతుల్లో 69 పరుగులు తీసి ఔరా అనిపించింది. 11 ఫోర్లు, 1 సిక్స్‌ను తన ఖాతాలో వేసుకుంది. తన టీ20 కెరీర్లో మొదటి అర్ధ సెంచరీని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌తో ఓపెనర్ షెఫాలీ వర్మ ఫామ్‌లోకి వచ్చింది. 39 బంతుల్లో 46 పరుగులు చేసి 1 ఫోర్, 3 సిక్సర్లు బాదింది. చివరిగా రిచా ఘోష్ 19 బంతుల్లో 33 (నాటౌట్) 5 ఫోర్లు, 1సిక్స్‌తో ఇన్నింగ్స్‌ను పూర్తి చేసింది. మలేసియా బౌలర్లు దనియా సూహ్యద, కెప్టెన్ దురై సింగం చెరో 2 వికెట్లు సాధించారు.

'డెత్ ఓవర్ల'లో ఇంకా మెరుగుపడాలి: రోహిత్

గువహటి: దక్షిణాఫ్రికాపై సిరీస్ విజయంతో టీమిండియా సగర్వంగా టీ20 ప్రపంచకప్ వైపు అడుగులు వేసింది. గువాహటిలో జరిగిన రెండో టీ20లో రోహిత్ సేన దంచికొట్టింది. అయితే.. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. అటువైపు నుంచి కూడా అంతే దీటుగా సమాధానం వచ్చింది. లక్ష్యానికి కేవలం 16 పరుగుల దూరంలోనే సఫారీలు నిలిచిపోయారు. కొండంత స్కోరు చేసినా బౌలర్లు తేలిపోవడంతో గెలుపు కోసం భారత్ కష్టపడక తప్పలేదు. ఈ నేపథ్యంలో మరోసారి టీమిండియా డెత్ ఓవర్ల బౌలింగ్‌పై చర్చ మొదలైంది. మ్యాచ్ అనంతరం ఈ అంశంపై సారథి రోహిత్ కూడా స్పందించాడు. డెత్ ఓవర్ల అంశం ఆందోళన కలిగించకపోయినా.. మ్యాచ్ చివరలో జట్టు తన పనితీరును మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని రోహిత్ చెప్పాడు. 'జట్టు ఒక నిర్దిష్ట పద్ధతితో బౌలింగ్ చేయాలని కోరుకుంటుంది. ఆ రకంగా బౌలర్లకు స్వేచ్ఛనివ్వాలనుకుంటాం. నిజమే.. మేం గత ఐదారు మ్యాచ్‌ల్లో డెత్ ఓవర్లలో బాగా బౌలింగ్ చేయలేదు. ఆ అంశమే మాకు సవాలు విసిరేది' అని రోహిత్ పేర్కొన్నాడు. 'అయితే.. డెత్ ఓవర్లలో బౌలింగ్, బ్యాటింగ్ చేయడం కష్టంతో కూడుకున్న పని. ఆట ఫలితం తేలేదీ ఇక్కడే. ఇది ఆందోళన చెందే విషయమని నేను చెప్పను. కానీ.. ఇది కచ్చితంగా మనం కలిసికట్టుగా చర్యలు తీసుకోవాల్సిన అంశం' అని హిట్‌మ్యాన్ వివరించాడు. తొలి టీ20లో అదరగొట్టిన అర్ష్‌దీప్ ఈ మ్యాచ్‌లో ఏకంగా 62 పరుగులివ్వడమే కాదు.. మూడు నోబాల్స్, రెండు వైడ్లు వేసి ప్రపంచకప్ ముంగిట మన బౌలింగ్‌పై ఆందోళనను ఇంకా పెంచాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా.. 3 వికెట్లకు 237 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదన ఆరంభంలో తడబడ్డా దక్షిణాఫ్రికా ఆ తర్వాత గట్టి పోటీ ఇచ్చింది. మిల్లర్ (106 నాటౌట్, 47 బంతుల్లో 8×4, 7×6), డికాక్ (69 నాటౌట్, 48 బంతుల్లో 4×3, 4×6) చెలరేగడంతో 3 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.